www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 28-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 134 | విజయవాడ సిటీ**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 1.20 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మృగశిర మ. 3.53 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా. 12.33 -2.12; దుర్ముహూర్తం: ఉ. 11.51-12.40; అమృతఘడియలు: ఉ. 6.59-8.36; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.28

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పాత కార్లు 'తుక్కు'కిస్తే.. కొత్త వాటిపై కిక్కు

పాత వాహనాల స్క్రాప్ సర్టిఫికెట్ తీసుకెళ్తే 2

కొత్త వాహనాల ఎక్స్‌షోరూం ధరపై డిస్కౌంట్

ప్రయాణికుల వాహనాలపై 1.5% లేదా రూ.20 వేలు

వాణిజ్య వాహనాలపై 3 శాతం వరకు తగ్గింపు

కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీలో కంపెనీల అంగీకారం



12

రాష్ట్రవ్యాప్తంగా చికున్ గున్యా!

9 జిల్లాల్లో పరిస్థితి తీవ్రం.. మంచం పట్టిన పల్లెలు

ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తున్న జ్వరాలు

జ్వరం, కీళ్ల నొప్పులు, ఒంటిపై దద్దుర్లతో ఇబ్బందులు

జ్వరం తగ్గినా.. వదలని కీళ్ల నొప్పులు

చికున్ గున్యాగా నిర్ధారించిన పుణె వైరాలజీ ల్యాబ్

విషజ్వరాలతో ఎవరూ చనిపోకూడదు

సీజనల్ వ్యాధులపై నిపుణుల కమిటీ ఏర్పాటు

సమీక్షలో మంత్రి సత్యకుమార్



ఎమ్మెల్యేగారి భార్యగారి బర్త్‌డే మరి!

ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, ఒక ఎక్సైజ్ సీఐ ఫుల్ యూనిఫామ్‌తో హాజరై చప్పట్లు కొడుతున్న ఈ దృశ్యం ఏమిటో తెలుసా? అది... చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు భార్య వెంకట కుమారి పుట్టిన రోజు వేడుక! ఆమెకు ఎలాంటి అధికారిక హోదా లేదు! అయినా సరే... మంగళవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిలకలూరిపేట అర్బన్, రూరల్ పోలీస్ అధికారులు హాజరై ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఒక కేకు తెచ్చి ఆమెతో కట్ చేయించి... చప్పట్లు కొట్టారు! యూనిఫామ్‌కు ఉండే గౌరవాన్ని పక్కన పెట్టేశారు! 'ఇది తగదు' అని వారించాల్సిన ఎమ్మెల్యే సతీమణి కూడా కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. గతంలో తన భర్త పత్తిపాటి పుల్లారావు మంత్రిగా ఉండగా... టోల్‌గేట్ వద్ద తన వాహనాన్ని ఆపినందుకు వెంకట కుమారి నానా రచ్చ సృష్టించారు. ఇప్పుడు... ఇలా!

వైసీపీ హయాంలో ఎమ్మెల్యేలు తెగ రెచ్చిపోయారు! 'అధికార' అహంకారంతో విర్రవీగారు! ఇప్పుడు... ప్రభుత్వం మారింది. 'మేం మాత్రం తక్కువా' అంటూ కొందరు టీడీపీ ఎమ్మెల్యేలూ అవే అవలక్షణాలు ప్రదర్శిస్తున్నారు. 'అధికార దర్పం ప్రదర్శించవద్దు' అని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినా వారి చెవికెక్కడంలేదు. దీనికి ఉదాహరణలే ఈ సంఘటనలు

అవే అవలక్షణాలు

4 ఎకరాలు.. 30 లక్షలు!

మేం చెప్పిందే ధర.. ఇస్తావా.. చస్తావా?



ఎమ్మెల్యే గళ్లా మాధవి భర్త రామచంద్రరావు దందా

గతంలో అదే భూమికి ఎకరం రూ.48 లక్షలకు ఒప్పందం.. పిడుగురాళ్లలో 4.9 ఎకరాల కొనుగోలుకు అగ్రిమెంట్

భార్య ఎమ్మెల్యే అయ్యాక సీన్ రివర్స్.. చెప్పిన ధరకు భూమి అమ్మలేదని తండ్రీ కొడుకులపై దాడి

బాధితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు.. బాధితుడు కమ్మ వెంకట్రావు ఆరోపణ

సీఐ సారీ చెప్పాల్సిందే

తాడిపత్రిలో ఇసుక అక్రమ రవాణాపై ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి నిరసన

కేసు నమోదు చేయాలని సీఐపై ఒత్తిడి.. మాట వినలేదని స్టేషన్ వద్ద స్వయంగా ధర్నా

ఉన్నతాధికారుల సూచనతో సీఐ క్షమాపణ.. శాంతించిన ఎమ్మెల్యే

అధికారపార్టీ ఎమ్మెల్యే దూకుడుపై విమర్శల వెల్లువ 11

ఇసుకపై మహాకుట్ర



తెర వెనుక సూత్రధారులెవరో తేలుస్తాం

ఏసీబీ అధికారుల విచారణ లక్ష్యం అదే

పాత్రధారులు వెంకటరెడ్డి, జేపీ వెంచర్స్

మార్చి నాటికే జేపీకి డిమాండ్ నోటీసులు

జేపీ వెంచర్స్‌కు 877 కోట్ల జరిమానా వేశాం

మరిన్ని అక్రమాలు శోధిస్తున్న గనుల శాఖ

సుప్రీంకోర్టుకు నివేదించిన ఏపీ సర్కారు

అఫిడవిట్‌లో పలు సంచలన విషయాలు

మరో 3 నెలల్లో సుప్రీంకు సమగ్ర నివేదిక

గత ఐదేళ్లలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు, రవాణా పేరిట జరిగిన అక్రమాల వెనుక పెద్ద కుట్రే ఉంది. ఈ కుట్రలో అప్పటి గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఇసుక కాంట్రాక్టు సంస్థ జయప్రకాశ్ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్(జేపీవీఎల్)లు పాత్రధారులు. అసలు సూత్రధారులెవరో కనిపెట్టి తీరుతాం.

- సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ప్రభుత్వం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో ఇసుక దోపిడీ వెనుక మహాకుట్ర దాగి ఉందన్న 'ఆంధ్రజ్యోతి' వార్తలు అక్షరసత్యాలని తేలింది. నాటి ఇసుక అక్రమ తవ్వకాలపై గుంటూరుకు చెందిన దండా నాగేంద్రకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. జాతీయ హరిత ట్రైబ్యునల్, రాష్ట్ర హైకోర్టు, సుప్రీం కోర్టులను తప్పుదోవపట్టించి ఇసుక అక్రమ తవ్వకాలను కొనసాగించారని నాగేంద్ర పలు ఆధారాలను సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఈ అంశాలపై సప్లిమెంటరీ

మిగతా 2వ పేజీలో...

సాగునీటి సంఘాలకు జవసత్వాలు

ఎన్నికల నిర్వహణకు బాబు సర్కారు నిర్ణయం

నేడు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం.. జగన్ హయాంలో సంఘాలన్నీ నిర్వీర్యం

నిధులివ్వకపోవడంతో అటకెక్కిన పూడికతీత, కాలువ గట్ల పనులు

యాజమాన్య నిర్వహణ లేక దెబ్బతిన్న నీటి వనరులు

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి వనరుల వారీగా నీటి వినియోగదారుల సంఘాలకు త్వరలోనే ఎన్నికలు జరపాలని కూటమి ప్రభుత్వం నిశ్చయించింది. జగన్ ఏలుబడిలో గడచిన ఐదేళ్లలో అన్ని వ్యవస్థలూ నాశనమైనట్లుగానే.. సాగునీటి సంఘాలూ నిర్వీర్యమై పోయాయి. గత ఐదేళ్లలో

మిగతా 3వ పేజీలో...



3

జగన్ 'రివర్స్ టెండర్'కు స్వస్తి!

అది లోపభూయిష్టమన్న కేంద్ర విజిలెన్స్ కమిషన్

చీఫ్ ఇంజనీర్ల బోర్డుదీ అదే మాట

మళ్లీ సంప్రదాయ టెండర్ విధానానికి నేడు కేబినెట్ ఓకే

సజ్జన్ బచ్‌గయా

'మిస్టరీ లవ్‌స్టోరీ'లో కీలక మలుపు!



జగన్‌తో సజ్జన్ జిందాల్ (ఫైల్)

ముంబైలో సజ్జన్ జిందాల్‌పై నటి రేప్ కేసు

రాజీకి ససేమిరా అనడంతో ఇరకాటం

జగన్‌ను ఆశ్రయించిన పారిశ్రామికవేత్త

ఆమెను దారికి తెచ్చేందుకు ఇక్కడ కేసు

'కౌంటర్ కేసు' వ్యూహంలో సజ్జల పాత్ర!?

ఇబ్రహీంపట్నంలో ఆమెపై కేసు పెట్టిన వైసీపీ నేత

రంగంలోకి ఐపీఎస్‌లు కాంతిరాణా, విశాల్ గున్నీ

ఆగమేఘాల మీద ముంబై వెళ్లి నటి అరెస్టు

తల్లిదండ్రులనూ అరెస్టు చేసి చిత్ర హింసలు

జిందాల్‌పై కేసు విత్‌డ్రా చేసుకోవాలని హెచ్చరిక

రాజీకి అంగీకరించాకే ఆమె బెయిలుపై విడుదల

అక్కడ కేసు వాపస్.. ఇక్కడ కేసు క్లోజ్

ల్యాండ్ సెటిల్‌మెంట్లు చూసి ఉంటారు!
ఫైనాన్స్ సెటిల్‌మెంట్లు చూసి ఉంటారు!
ఆస్తుల సెటిల్‌మెంట్లూ చూసి ఉంటారు!
కానీ.. ఇది 'లవ్' సెటిల్‌మెంట్!

2

దేశంలోనే బడా పారిశ్రామిక వేత్త ఒకరిని కాపాడేందుకు చేసిన బెదిరింపుల సెటిల్‌మెంట్! అందులోనూ ఒక సీఎం ఆదేశంతో.. ప్రభుత్వ సలహాదారు రంగంలోకి దిగి.. ఇద్దరు ఐపీఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరీ చేసిన సెటిల్‌మెంట్! మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'మిస్టరీ లవ్ స్టోరీ'లో ఇదో భారీ మలుపు!



స్కిల్ కేరాఫ్ ఏపీ

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కసరత్తు

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు హబ్‌గా తీర్చిదిద్దే యోచన

దేశానికే తలమానికంగా ఏర్పాటు చేసేలా చర్యలు

నైపుణ్య గణన ఫైలుపై ఇప్పటికే సీఎం సంతకం

ప్రతి జిల్లాలోనూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు

ఇవన్నీ స్కిల్ వర్సిటీకి అనుబంధంగా ప్రారంభం

తగిన విద్యార్హతలున్న వారికి వివిధ రంగాల్లో శిక్షణ

ఇక్కడ శిక్షణ పొందిన యువతకు వర్సిటీ సర్టిఫికెట్లు

అది ఉన్నవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ప్రాధాన్యం

పరిశ్రమలకు మానవ వనరుల కేంద్రంగా వర్సిటీ

నిపుణులైన సిబ్బంది కొరతకు చెక్ పెట్టే అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతలో నైపుణ్యాలను పెంపొందించే దిశగా ప్రభుత్వం యోచన చేస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే పలుసార్లు మేధోమథనం నిర్వహించారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ సెన్సెస్ చేపట్టి తద్వారా ప్రజల నైపుణ్య స్థాయిలను పెంచుతామని ఆయన

మిగతా 12వ పేజీలో...

అర్చకులకు శుభవార్త

నెలవారీ వేతనం రూ.10 వేల నుంచి 15 వేలకు పెంపు: సీఎం

ఇక ధూపదీప నైవేద్యాలకు 10 వేలు.. నాయీబ్రాహ్మణుల కనీస వేతనం పాతిక వేలు!

వేద విద్య నిరుద్యోగులకు 3 వేల భృతి.. అధికారికంగా వాసవీమాత 'ఆత్మార్పణ దినం'

బలవంతపు మతమార్పిడులకు చెక్.. దేవదాయ శాఖపై చంద్రబాబు సమీక్ష 11

ఏపీలోనూ 'హైడ్రా'!



ఆ తరహా సంస్థను ఇక్కడా ఏర్పాటు చేస్తాం

అక్రమ నిర్మాణాలు కచ్చితంగా కూల్చేస్తాం 12

ఆక్రమణ స్థలాలను స్వచ్ఛందంగా వదిలేసుకోండి

భవనాలు నిర్మించుకున్నా వదిలేది లేదు: నారాయణ

కవితకు బెయిల్

ఢిల్లీ మద్యం కేసులో మంజూరు చేసిన సుప్రీం

తిహాడ్ జైలు నుంచి విడుదల

కవిత పాత్రపై ఈడీ, సీబీఐల దర్యాప్తు ముగిసింది

విచారణ ఇప్పట్లో పూర్తి కాదు

అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నామన్న ధర్మాసనం



జైలు నుంచి బయటకు వచ్చాక.. కుమారుణ్ని హత్తుకొని కవిత కంటతడి

ఈడీ, సీబీఐల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు 11



చీకటి చెర వీడింది!

ఇకపై ప్రభుత్వ జీవోలన్నీ బహిర్గతమే

జీవోఐఆర్ వెబ్‌పోర్టల్ పునరుద్ధరణ.. రేపటి నుంచే జీవోలు అప్‌లోడ్

జగన్ హయాంలో నిలిపివేత.. కూటమి సర్కార్ రాకతో మళ్లీ పారదర్శకత

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత జగన్ సర్కార్ పారదర్శకతకు పాతరేస్తే... చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టింది. జీవోఐఆర్‌ను పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 29వ తేదీ నుంచే జీవోఐఆర్‌లో జీవోలు అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి అమరావతి సచివాలయంలోని 33 ప్రభుత్వ శాఖల్లో

మిగతా 12వ పేజీలో...

పర్యవేక్షణ లేని పరిశ్రమలు



రాష్ట్రంలోనే అత్యధిక పరిశ్రమలున్న జిల్లా.. అనకాపల్లి! అందులోనూ.. 'రెడ్ కేటగిరీ' జాబితాలో ఉన్న పరిశ్రమలు చాలా ఎక్కువ! పైగా.. మొన్నటిదాకా పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రాతినిధ్యం వహించింది అనకాపల్లికే! కానీ.. ఫ్యాక్టరీలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, భద్రతా లోపాలను గుర్తించాల్సిన డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఐఎఫ్) కార్యాలయమే అనకాపల్లిలో లేదు! ఇదీ.. కర్మాగారాల్లో భద్రతపై నాటి జగన్ సర్కారు చూపించిన శ్రద్ధ!

అనకాపల్లిలోనే 600 కంపెనీలు

రాష్ట్రంలోనే అత్యధిక పరిశ్రమలున్న జిల్లా

కానీ.. పర్యవేక్షక అధికారి మాత్రం లేరు

ఆ కార్యాలయం విజయనగరం జిల్లాలో.. మొన్నటిదాకా అనకాపల్లి ఎమ్మెల్యేనే మంత్రి

అయినా భద్రతపై దృష్టి శూన్యం.. లోపాల పుట్టగా ఇన్‌స్పెక్షన్ పోర్టల్

ఒక్కొక్క అధికారికీ పది డ్యూటీలు.. ఏ ఒక్కటి మిస్సయినా మళ్లీ ఏడాదికే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన తర్వాత అత్యధిక పరిశ్రమలు ఉన్న జిల్లాల్లో అనకాపల్లి అగ్రస్థానంలో నిలిచింది. కానీ... పరిశ్రమలను ఏడాదికోసారి తనిఖీ చేయాల్సిన అధికారి కార్యాలయం మాత్రం ఎక్కడో విజయనగరంలో ఉంది. ఇదీ.. పరిశ్రమల్లో భద్రతపై నాటి జగన్ సర్కారు తీసుకున్న 'శ్రద్ధ'! అనకాపల్లి జిల్లా పరవాడలో జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ(రాంకీ-90 కంపెనీలు), నక్కపల్లిలో హెటిరో డ్రగ్స్, పాయకరావుపేటలో డెక్కన్ కెమికల్స్, అచ్యుతాపురం ఏపీఐఐసీ ఆర్థిక మండలిలో

మిగతా 12వ పేజీలో...



జూలై 27న ఒకే రోజు 10 పరిశ్రమలు తనిఖీ చేయాలంటూ విశాఖ డీసీఐఎఫ్‌కు జారీ చేసిన ఆదేశం! దిక్కుకు ఒకటిగా ఉన్న పది పరిశ్రమలను ఒక్క రోజులో తనిఖీ చేయడం సాధ్యమయ్యేనా?

ఆంధ్రజ్యోతి

కలరాకు ఓరల్ టీకా

అందుబాటులోకి తీసుకువచ్చిన భారత్ బయోటెక్

» హిల్‌కాల్ పేరుతో విడుదల.. 14 రోజుల వ్యవధిలో 2 డోసులు చాలు




ఓరల్ కలరా వ్యాక్సిన్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణ ఎల్లా తదితరులు


హైదరాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వ్యాక్సిన్ దిగ్గజ కంపెనీ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ తాజాగా కలరాకు ఓరల్ టీకాను అందుబాటులోకి తీసుకువచ్చింది. 'హిల్‌కాల్' పేరుతో మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. ఈ టీకాను 14 రోజుల వ్యవధిలో రెండుసార్లు తీసుకోవాల్సిఉంటుంది. ఏడాది వయసు దాటిన పిల్లలు మొదలు.. వృద్ధుల వరకు అందరూ దీన్ని తీసుకోవచ్చు. అమెరికాకు చెందిన హిల్లేమాన్ లాబొరేటరీస్ వారి నుంచి లైసెన్స్ తీసుకుని.. దీన్ని అభివృద్ధి చేశారు. టీకా ఆవిష్కరణ సందర్భంగా భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 4.5 కోట్ల డోసులను ఉత్పత్తి చేసే ప్లాంట్ ఉందని, రాబోయే కొద్ది నెలల్లో భువనేశ్వర్‌లో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. దాంతో.. 20 కోట్ల డోసులను ఉత్పత్తి చేసే సామర్థ్యం తమకు ఉంటుందన్నారు. భారత ఔషధ నియంత్రణ సంస్థ(డీసీజీఐ) కూడా ఇక్కడ ప్లాంట్ పెట్టి, కలరా టీకాను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన అనుమతులను మంజూరు చేసిందని వివరించారు. "ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో నిర్లక్ష్యం చేసిన వ్యాధులపై మేం పనిచేయాలనుకుంటున్నాం. ఇందులో భాగంగానే కలరాకు ఓరల్ టీకాను తీసుకొచ్చాం. 2030 నాటికి కలరా రహిత ప్రపంచమే లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పనిచేస్తోంది. మేము కూడా ఆ లక్ష్యంలో భాగస్వాములమవుతాం" అని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 10 కోట్ల కలరా టీకాల డిమాండ్ ఉందని, అయితే.. 4 కోట్ల డోసుల లోటు కొనసాగుతోందని వివరించారు.

రేపు అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 29న అల్పపీడనం ఏర్పడనున్నది. తర్వాత రెండు రోజుల్లో పశ్చిమ వాయువ్యంగా పయనించి ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా వైపు రానున్నదని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఈనెల 29 నుంచి కోస్తాలో ఎక్కువచోట్ల సాధారణ, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. దక్షిణ కోస్తాలో మంగళవారం సాధారణం కంటే 3-5 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా బాపట్లలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా ఈ నెలలో దేశంలోనే ఎక్కువ రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలోనే నమోదైన విషయాన్ని వాతావరణ నిపుణుడొకరు గుర్తు చేస్తున్నారు.

లోకం తీరు




సర్జరీ జరిగిన తీరు..

కంటి గుండా మెదడుకు సర్జరీ

» 'ఎండోస్కోపిక్ లాటరల్ ట్రాన్స్ ఆర్బిటల్' విధానంలో ఒక మహిళ మెదడులో కణితి తొలగింపు.. ఏఐజీ వైద్యుల ఘనత


మెదడులోని కణితిని తొలగించిన అనంతరం.. రోగి కంటిపై కేవలం చిన్న గాటు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మెదడులో కణితిని తొలగించాలంటే.. పుర్రె భాగానికి కోత పెట్టాలి! కానీ.. మెదడులో కణితితో బాధపడుతున్న 54 ఏళ్ల మహిళకు ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు ఓ అరుదైన శస్త్రచికిత్సతో ఉపశమనం కలిగించారు! ఆమె కనుబొమ కింద భాగంలో గాటు పెట్టి.. ఆ మార్గం గుండా శస్త్రచికిత్స చేసి మెదడులో కణితిని తొలగించారు. రోగి పుర్రెను తెరవకుండా నిర్వహించే ఈ ప్రక్రియను 'ఎండోస్కోపిక్ లాటరల్ ట్రాన్స్ ఆర్బిటల్ అప్రోచ్' అంటారు. ఈ తరహా సర్జరీ నిర్వహించడం భారతదేశంలోనే మొదటిసారి వైద్యులు వివరించారు. ఆరు నెలలుగా.. కుడి కంటి చూపు మసకబారి, తలనొప్పితో బాధపడుతున్న మహిళ (54) ఏఐజీ వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు ఆమె 'స్ఫినో ఆర్బిటల్ కావెర్నస్ మెనింజియోమా (ఎస్‌వోఎం)' అనే సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కంటి వెనుక భాగంలో ఉండే స్ఫినాయిడ్ ఎముకకు, ఐ సాకెట్‌కు, కార్వెనియస్ సైనస్‌కు మధ్య ఉండే భాగంలో నిరపాయకరమైన ఏర్పడే కణితిని ఇలా వ్యవహరిస్తారు. దీనిని కనురెప్ప పై భాగంలో గాటు ద్వారా తొలగించినట్లు ఏఐజీ న్యూరో సర్జన్లు వివరించారు. ఈ విధానంలో చికిత్స చేయడం వల్ల మెదడుపై ఎలాంటి దుష్ప్రభావం పడదని, రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉందని వారు వెల్లడించారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని రెండోరోజే ఇంటికి పంపినట్టు తెలిపారు. కాగా.. అరుదైన ఈ శస్త్రచికిత్స చేసిన వైద్య బృందంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ అభిరామ చంద్ర గబ్బిట, డాక్టర్ సుబోధ్ రాజు (డైరెక్టర్- న్యూరోసర్జరీ) తదితరులు ఉన్నారు. కాగా.. అత్యంత అరుదైన సర్జరీ చేసిన వైద్యులను ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర రెడ్డి అభినందించారు.

కోల్‌కతా రణరంగం



ఛలో సెక్రటేరియేట్‌కు ఛాత్రసమాజ్ పిలుపు.. భారీగా తరలివచ్చిన విద్యార్థులు

» మమత రాజీనామాకు డిమాండ్
» ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
» గాల్లోకి కాల్పులు.. పలువురికి గాయాలు
» నేడు బెంగాల్ బంద్‌కు బీజేపీ పిలుపు


ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్; విద్యార్థుల దాడిలో గాయపడ్డ పోలీసు

కోల్‌కతా, ఆగస్టు 27: కోల్‌కతా నగర వీధులు మంగళవారం రణరంగంలా మారాయి. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ మంగళవారం హావ్‌డా నుంచి నిర్వహించిన నబన్నా అభియాన్(ఛలో సెక్రటేరియేట్) ర్యాలీ హింసాత్మకంగా మారింది. సీఎం మమతాబెనర్జీ రాజీనామా డిమాండ్‌తో విద్యార్థులు నిర్వహించిన ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. బ్యారికేడ్లను విద్యార్థులు తొలగించకుండా ఉండేందుకు పోలీసులు వాటికి గ్రీజ్ రాస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముందు జాగ్రత్తగా నలుగురు విద్యార్థులను సోమవారం రాత్రే అదుపులోకి తీసుకున్న పోలీసులు.. సచివాలయానికి దారితీసే మార్గాల్లో 6 వేల మందితో భారీ బందోబస్తు నిర్వహించారు. డ్రోన్లతో పరిస్థితిని అంచనా వేశారు. ర్యాలీ, నియంత్రణ వంటి అంశాలపై పర్యవేక్షణకు ప్రభుత్వం 26 జిల్లాల కలెక్టర్లను నియమించింది. ముఖ్యంగా.. ఎంజీరోడ్, హేస్టింగ్స్ రోడ్, సంత్రాగచి, హౌరా మైదాన్, హౌరా బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. విద్యార్థులు బ్యారికేడ్లను బద్దలుకొట్టి, పోలీసులను తోసుకుంటూ ముందుకు దూసుకెళ్లారు. పోలీసులపై రాళ్లు, ఇటుకలను విసిరారు. ఈ ఘటనలో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరుపుతూ.. లాఠీచార్జ్ చేశారు. వాటర్‌కెనాన్, టియర్‌గ్యాస్‌ను ప్రయోగించారు. ఈ ఘటనల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారు.

విద్యార్థుల ముందస్తు అరెస్టులు

నబన్నా అభియాన్ ర్యాలీకి పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ పిలుపునివ్వగా.. రవీంద్ర భారతి వర్సిటీ విద్యార్థి ప్రబీర్ దాస్, కల్యాణి వర్సిటీకి చెందిన శుభంకర్ హల్దార్, రవీంద్ర ముక్త వర్సిటీకి చెందిన సాయన్ లహరి ముందుండి నడిపించారు. అయితే.. సోమవారం రాత్రే పోలీసులు నలుగురు కీలక విద్యార్థి నేతలను అరెస్టు చేయడంతో బీజేపీ నేత సువేందు అధికారి ఎక్స్‌లో వరుస ట్వీట్లు చేశారు. "అర్ధరాత్రి నుంచి నలుగురు కీలక విద్యార్థులు అదృశ్యమయ్యారు" అని పేర్కొన్నారు. దీనికి కోల్‌కతా పోలీసులు స్పందిస్తూ.. ఎవరూ మిస్సింగ్ అవ్వలేదని సమాధానమిచ్చారు. దానికి సువేందు ప్రతిస్పందిస్తూ.. "అయితే.. విద్యార్థుల కుటుంబాలు కోర్టులు ఆశ్రయించాయి. మమత పోలీసులారా.. కోర్టులో కలుద్దాం" అని ట్వీట్ చేశారు. కాగా.. విద్యార్థుల ర్యాలీ బీజేపీ-ఆరెస్సెస్ ప్రేరేపితమని వామపక్ష నాయకురాలు బృందా కరాట్ తీవ్ర విమర్శలు చేశారు. కాగా, విద్యార్థుల ర్యాలీపై పోలీసుల లాఠీచార్జ్‌ని నిరసిస్తూ బీజేపీ బుధవారం 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా బీజేపీ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ మాట్లాడుతూ.. విద్యార్థులపై పోలీసుల దాడి దారుణమన్నారు.

కెనడాలో విదేశీ విద్యార్థులపై
బహిష్కరణ కత్తి

70 వేల మందికి పైగా పొంచి ఉన్న ముప్పు

దేశవ్యాప్తంగా విద్యార్థుల శిబిరాలు, ర్యాలీలు

టొరంటో, ఆగస్టు 27: కెనడాలో చదువుతున్న విదేశీ విద్యార్థులు ప్రస్తుతం బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ విధానాల్లో మార్పుల కారణంగా 70వేల మందికి పైగా అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థులు త్వరలో దేశాన్ని వదిలి వెళ్లాల్సి ఉంటుంది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. స్టడీ పర్మిట్లను పరిమితం చేస్తూ, శాశ్వత నివాస నామినేషన్లను తగ్గించాలని ట్రూడో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఇప్పుడు విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ఇళ్ల కొరత, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం కోసమే స్టడీ పర్మిట్లలో కోత విధించినట్లు ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు తక్కువ వేతనాలకు ఉద్యోగాలు చేస్తున్న తాత్కాలిక విదేశీ కార్మికుల సంఖ్యను కూడా తగ్గిస్తున్నట్లు ప్రధాని ట్రూడో తాజాగా ప్రకటించడం అగ్గి రాజేసింది.

కనీస పింఛను 7500కు పెంచాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 27: పింఛనుదారుల సంఘం ఈపీఎస్-95 జాతీయ ఆందోళన కమిటీ(ఎన్ఏసీ) ప్రతినిధులు ఈపీఎఫ్‌వో అధికారులతో సమావేశమయ్యారు. విశ్రాంత ఉద్యోగులకు కనీస పింఛను నెలకు రూ.7500 ఇవ్వాలని ఈపీఎస్-95 సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తోంది. అలాగే ఈపీఎస్ సభ్యులు, వారి జీవిత భాగస్వాములకు పూర్తి మెడికల్ కవరేజీ కల్పించాలని కోరుతున్నట్లు ఈపీఎస్-95 ఎన్ఏసీ తెలిపింది. సమస్యలపై చర్చించేందుకు రావాలంటూ ఈపీఎఫ్‌వో నుంచి ఆహ్వానం అందినట్లు ఈపీఎస్-95 ఎన్ఏసీ అధ్యక్షుడు అశోక్ రౌత్ తెలిపారు. పింఛనుదారుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం జరిగిన సమావేశంలో కోరినట్లు చెప్పారు.

సజ్జన్ బచ్‌గయా!

» 'మిస్టరీ లవ్‌స్టోరీ'లో కీలక మలుపు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

సజ్జన్ జిందాల్! జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ మేనేజింగ్ డైరెక్టర్! దేశంలోనే అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల్లో ఒకరు! అలాంటి ప్రముఖుడిపై గత ఏడాది ముంబైకి చెందిన ఒక నటి 'రేప్' కేసు పెట్టింది. అప్పట్లో ఇదో సంచలనం. అయితే... కొద్ది రోజులకే అదే నటి సజ్జన్ జిందాల్‌పై కేసును వాపస్ తీసుకుంది! కేసు పెట్టడానికి, వాపస్ తీసుకోవడానికి మధ్య విజయవాడ కేంద్రంగా ఒక భారీ 'సెటిల్‌మెంట్' నడిచింది. అక్కడ 'బాధితురాలి'గా సజ్జన్ జిందాల్‌పై కేసు పెట్టిన ముంబై నటిని... ఇక్కడ నిందితురాలిగా చేర్చి ఒక కేసు పెట్టారు. ఆమెను, ఆమె తల్లిదండ్రులనూ అరెస్టు చేసి నెలకుపైగా జైలులో ఉంచారు. ఇక్కడ బెయిలుపై విడుదలైన తర్వాత... అక్కడ సజ్జన్ జిందాల్‌పై పెట్టిన రేప్ కేసును ఆమె ఉపసంహరించుకున్నారు. వెరసి... జిందాల్‌ను రక్షించేందుకు అప్పటి ప్రభుత్వ పెద్దలే రంగంలోకి దిగి, ముంబై నటిపై కేసు పెట్టి, ఆమెను అరెస్టు చేయించి, బెదిరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేప్ కేసులో ఇరుక్కుని...

ముంబై నటి 2023 డిసెంబరులో సజ్జన్ జిందాల్‌పై రేప్ కేసు పెట్టింది. ఒక పెంట్ హౌస్‌లో ఆయన తనపై అత్యాచారం చేసినట్లు ఆరోపించింది. సజ్జన్ జిందాల్ చిక్కుల్లో ఇరుకున్నారు. ఆమె కేసు విత్‌డ్రా చేసుకోకుంటే కోర్టు విచారణ ఎదుర్కోక తప్పదు! దీంతో... ఆమెతో రాజీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ రాజీ ఎపిసోడ్‌లో వైసీపీ నేత, 2014లో పెనమలూరు వైసీపీ అభ్యర్థి, ఓ మోస్తరు పారిశ్రామిక వేత్త అయిన కేవీఆర్ విద్యాసాగర్ కూడా ప్రవేశించారు. ఆయనకు సదరు ముంబై నటితోపాటు సజ్జన్ జిందాల్‌తోనూ పరిచయముంది. కేసు వాపసు తీసుకునేందుకు ఆమెను ఒప్పించేందుకు ప్రయత్నించారు. కానీ, అందుకు ఆమె ససేమిరా అన్నారు! 'ఇది ఇలా తెగే వ్యవహారం కాదు! ఆమెను దారికి తెచ్చుకునేందుకు మనదైన స్టైల్‌లో ముందుకెళదాం' అన్నట్లుగా ఈ మ్యాటర్‌ను అప్పటి సీఎం జగన్ ముందుకు తీసుకెళ్లారు. సజ్జన్ జిందాల్‌కు జగన్ సన్నిహితుడనే విషయం అందరికీ తెలుసు. ఇక... విద్యాసాగర్‌కూ జగన్‌తో మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ క్రమంలో... సజ్జన్ జిందాల్, విద్యాసాగర్ ఇద్దరూ కలిసి ఈ ఏడాది ఫిబ్రవరిలో జగన్‌ను కలిసినట్లు సమాచారం. ఆ తర్వాతే... 'కౌంటర్' వ్యూహం అమలులోకి వచ్చింది.

ఇబ్రహీంపట్నంలో కేసు

జగన్‌తో సజ్జన్ జిందాల్ భేటీ అనంతరం... ఈ వ్యవహారాన్ని నేరుగా డీల్ చేసేందుకు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి రంగంలోకి దిగినట్లు సమాచారం. తమ వ్యూహంలో భాగంగా కేవీఆర్ విద్యాసాగర్ అదే ముంబై నటిపై విజయవాడ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఆమె తనను బ్లాక్ మెయిల్ చేసిందనీ, కొన్ని సంతకాలు చేయించుకుందనీ ఆరోపించారు. సలహాదారు ఆదేశాలతో అప్పటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా ఆగమేఘాల మీద స్పందించారు. అప్పటి డీసీపీ విశాల్ గున్నీ నేతృత్వంలో ప్రత్యేక బృందం ముంబైకి వెళ్లింది. దర్యాప్తు అధికారి సత్యనారాయణతోపాటు ఏసీపీలు రమణమూర్తి, హనుమంతరావు ముంబైకి వెళ్లారు. అక్కడ... ముంబై నటిని, ఆమె తల్లిదండ్రులను అరెస్టు చేశారు. తొలుత అక్కడి కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై ఇక్కడికి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. ఆ తర్వాత నటి కుటుంబ సభ్యులను దారుణంగా వేధించినట్లు తెలుస్తోంది. నాడు కమిషనరేట్‌లో ఉంటూ చక్రం తిప్పి, ఇప్పుడు వీఆర్‌లో ఉన్న ఒక ఎస్ఐ నటి పట్ల దారుణంగా ప్రవర్తించినట్లు తెలిసింది. ఆ నటితోపాటు ఆమె కుటుంబ సభ్యులను చిత్రహింసలు పెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత పోలీసులు అసలు విషయం చెప్పారు. ముంబైలో సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసును వాపసు తీసుకుంటేనే... ఇక్కడ ఈ కేసులో ఉపశమనం ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో వారి బంధువులు వచ్చి పోలీసులతో మాట్లాడి రాజీకి అంగీకరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన అరెస్టుకాగా... మార్చి 8వ తేదీన ఆ నటి, కుటుంబ సభ్యులు బెయిలుపై విడుదలై ముంబై వెళ్లిపోయారు. ఆపై వారం రోజులకే, అంటే మార్చి 16వ తేదీన సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసును ఆమె ఉపసంహరించుకున్నారు. ఈ సందర్భంగా తమ సమయం వృథా చేస్తున్నారంటూ ఆమెపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయిన కొద్దిరోజుల తర్వాత ఇబ్రహీంపట్నంలో నమోదైన కేసు విషయంలో 'రాజీ' కుదిరింది. కేసు విచారణ కోర్టులో ఉండడంతో లోక్ అదాలత్‌లో వైసీపీ నేత, నటి రాజీ పడుతున్నట్టుగా కాగితాల్లో చూపించారు. రేప్ కేసు నుంచి సజ్జన్ జిందాల్ ఇలా బయటపడ్డారు!



నటి టార్చర్‌లో సజ్జల పాత్ర: వర్ల

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన నటిని విజయవాడ తీసుకువచ్చి టార్చర్ పెట్టడంలో గత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉందని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఆరోపించారు. బిన్ లాడెన్‌నో, కసబ్‌నో తీసుకువచ్చినట్లుగా ఆ నటిని విజయవాడకు తెచ్చేందుకు ఐపీఎస్ అధికారులు కాంతి రాణా, విశాల్ గున్నీ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. జగన్ హయాంలో వ్యవస్థలు ఎంత భ్రష్టు పట్టాయో చెప్పేందుకు ఈ సంఘటన ఒక ఉదాహరణ అని, దీనిపై విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన చెప్పారు. ఒక ఎస్సై విచారించాల్సిన కేసులో ఐపీఎస్ అధికారులు పరుగులు తీయడం ఏమిటో సజ్జలకే తెలియాలని వర్ల వ్యాఖ్యానించారు.

4,929 స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 6,285 మంది స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉండగా, 7,848 మంది కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో మండల స్థాయిలో 4,929 మందిని కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ప్రకాశం జిల్లాలో 380 మంది టీచర్లు అత్యధికంగా సర్దుబాటు అయ్యారు. మండల స్థాయిలో అనంతపురం జిల్లాలో 367 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 295 మంది, నెల్లూరులో 271 మందిని సర్దుబాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 35 మంది, మన్యం జిల్లాలో 58 మంది, విశాఖపట్నంలో 91 మందిని సర్దుబాటు చేశారు. బుధవారం నుంచి డివిజన్ స్థాయి సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

3 వారాల తర్వాత 3వేల కోట్లు అప్పు

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.3వేల కోట్లు అప్పు తెచ్చింది. మంగళవారం ఆర్బీఐ నిర్వహించిన సెక్యూరిటీల వేలంలో పాల్గొని ఈ రుణం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి 6నెలల కాలానికి దాదాపు రూ.47వేల కోట్లు అప్పుగా తెచ్చుకోవడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. గత జగన్ ప్రభుత్వం ఎన్నికలకు ముందే అందులో రూ.25వేల కోట్లు అప్పు తెచ్చి వాడేసింది. కూటమి ప్రభుత్వం గత మూడు మంగళవారాల నుంచి ఆర్బీఐ వద్ద అప్పులు తీసుకురాలేదు. ప్రస్తుతం సామాజిక పెన్షన్లు, ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు సమయం దగ్గర పడుతుండటంతో ఇప్పుడు ఈ అప్పు తెచ్చారు.

పాత కార్లు 'తుక్కు'కిస్తే.. కొత్త వాటిపై కిక్కు!

» పాత వాహనాల స్క్రాప్ సర్టిఫికెట్ తీసుకెళ్తే కొత్త వాహనాల ఎక్స్‌షోరూం ధరపై డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఆగస్టు 27: పండగ రోజుల్లో కొత్త కారు కొనుక్కోవాలనుకునే వారికి శుభవార్త. పాత కార్లను తుక్కు కింద ఇచ్చేసి, ఆ సర్టిఫికెట్ తీసుకెళ్తే.. కొత్త కార్లపై డిస్కౌంట్ అందించనున్నట్లు ఆటోమొబైల్ కంపెనీలు వెల్లడించాయి. పాత వాహనాలకు 'సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్'ను తీసుకొచ్చిన వినియోగదారులకు కొత్త వాహనాలపై 1.5 నుంచి 3 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపాయి. మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 'భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘాని (సియామ్)'కి చెందిన పలువురు సీఈవోలతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. కొత్త వాహనాలపై డిస్కౌంట్లు అందజేసేందుకు కంపెనీల ప్రతినిధులు అంగీకరించారు. ప్రయాణికుల వాహనాలపై ఏడాది పాటు, వాణిజ్య వాహనాలపై రెండేళ్ల పాటు ఈ డిస్కౌంట్లు అందించేందుకు తయారీదారులు అంగీకరించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. కార్లకు స్క్రాప్ సర్టిఫికెట్ తీసుకొచ్చిన వారికి కొత్త కార్ల ఎక్స్ షోరూం ధరపై 1.5 శాతం లేదా రూ.20 వేలు.. ఏది తక్కువైతే అది అందజేస్తారు. ఇక టాటా మోటార్స్, అశోక్ లే లాండ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఫోర్స్ వంటి వాణిజ్య వాహనాల తయారీ సంస్థలు.. 3.5 టన్నుల కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన రవాణా వాహనాల ఎక్స్ షోరూం ధరపై 3 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వాణిజ్య వాహనాలను స్క్రాపింగ్ చేసిన సర్టిఫికెట్లు తీసుకొచ్చిన వినియోగదారులకు ఈ తగ్గింపు వర్తిస్తుందని తెలిపారు. ఈ డిస్కౌంట్ల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు లబ్ధి చేకూరుతుందని, అలాగే స్వచ్ఛమైన, సురక్షితమైన, మరింత సమర్థవంతమైన వాహనాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

ఉపాధి పథకం డైరెక్టర్‌గా ఐఎఫ్ఎస్ షణ్ముఖ్ కుమార్

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం డైరెక్టర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి వీకే షణ్ముఖ్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. శ్రీవేంకటేశ్వర భక్తి చానెల్‌కు సీఈఓగా ఉన్న ఆయను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు బదిలీ చేశారు. కాగా, ఉమ్మడి ఏపీలో మాత్రమే ఉపాధి హామీ పథకానికి డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి ఉండేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ పోస్టును రిటైర్ అధికారితో భర్తీ చేశారు. తాజాగా ఓ ఐఎఫ్ఎస్ అధికారిని నియమించడాన్ని బట్టి ఈ పథకంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని చెప్పవచ్చు!

ఇసుకపై మహాకుట్ర

(మొదటి పేజీ తరువాయి)

అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఈ నెల 2న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. జగన్ పాలనలో ఇసుక తవ్వకం, రవాణాలో అక్రమాలకు అంతులేకుండా పోయిందని పేర్కొంది. ఇదేసమయంలో గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వెంకటరెడ్డి వ్యవహరించిన తీరు ఎంత చట్టవిరుద్ధంగా ఉందో తెలియజేసేలా పలు నివేదికలను ప్రభుత్వం సుప్రీంకోర్టు ముందుంచింది.

అఫిడవిట్‌లో కీలక అంశాలు

- మా ప్రభుత్వం ఈ ఏడాది జూన్ నుంచి ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎన్జీటీ, హైకోర్టు, సుప్రీం కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు చేస్తున్నాం. అక్రమ మైనింగ్‌ను అరికట్టడంతోపాటు, బాధ్యులైన వారిని గుర్తిస్తున్నాం. ఇసుకపై సమగ్ర సమీక్ష నిర్వహించాక గతంలో ఎన్ని తప్పులు జరిగాయో.. పర్యావరణ పరిరక్షణ, చట్టాల అమలులో ఎంతగా నిర్లక్ష్యంగా వ్యవహరించారో గుర్తించాం. కోర్టు ఆదేశాలను పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.
- గత ఐదేళ్లలో ఇసుక కేంద్రంగా పెద్ద కుట్రే జరిగింది. ఇందులో పాత్రధారులు నాటి గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి, జేపీవెంచర్స్ లిమిటెడ్‌లు. వెంకటరెడ్డి తీరుతోనే అక్రమాలు పెరిగాయి. ఇసుక తవ్వకం, రవాణా, వంటి విధానాల అమలు, టెండర్లలో అడ్డగోలుగా అక్రమాలు జరిగాయి. ఏపీ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్(ఏపీఎంఎంసీ)కు విరుద్ధంగా వ్యవహరించారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం వెంకటరెడ్డిని సస్పెండ్ చేసింది. ఆయనపై ఏసీబీ విచారణకు ఆదేశించింది.
- అలాగే, పర్యావరణ పరిరక్షణ, అక్రమ తవ్వకాలను నిరోధించాలంటూ ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారా? కుట్రకోణం ఉందా? ఇతర దురుద్దేశాలు ఉన్నాయా అనే అన్ని కోణాలను ఏసీబీ వెలికితీస్తుంది. ఏసీబీ ఇచ్చే నివేదిక, సిఫారసుల ఆధారంగా చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇసుక విషయంలో అక్రమాలకు ఆస్కారం లేకుండా చేస్తాం. అక్రమాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నిగ్గు తేలుస్తాం

ఇసుక టెండర్లు, అక్రమ తవ్వకాలకు దారితీసిన పరిస్థితులు, దీనివెనుక దాగి ఉన్న కుట్ర, అవినీతి, కుమ్మక్కు, నిర్లక్ష్యం వంటి వాటిని ఏసీబీ వెలికితీస్తోంది. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు, సంస్థలు ఎవరు? నిధులు ఎక్కడికి తరలించారు? నిర్వహణలో వైఫల్యాలు, టెండర్ గోల్‌మాల్, చట్టపరమైన అంశాలన్నింటిపై వాస్తవాల నిగ్గు తేలుస్తున్నాం.

పాలసీ పీకేశాం

పర్యావరణాన్ని దెబ్బతీసిన జగన్ ఇసుక పాలసీని ఉపసంహరించాం. ఇసుక కాంట్రాక్టును ప్రైవేటు ఏజెన్సీల నుంచి తప్పించి కలెక్టర్ నేతృత్వంలోని జిల్లాస్థాయి కమిటీలకు అప్పగించాం. ఇసుక వ్యవహారాలను పూర్తిగా డిజిటలైజ్ చేసి అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తిగా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాం.

\- సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ప్రభుత్వం వెల్లడి.

వెంకటరెడ్డి కనికట్టు

- ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి గనుల శాఖ నుంచి జేపీ వెంచర్స్‌కు 2021-24 మధ్య అనేక షోకాజ్ నోటీసులెళ్లాయి. వాటిలో కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల గనుల విభాగాల నుంచే జేపీ వెంచర్స్‌కు డిమాండ్ నోటీసులు వెళ్లాయి.
- రీచ్ పరిధి దాటి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేశారని షోకాజ్ నోటీసులు ఇచ్చినా జేపీ గ్రూప్ స్పందించలేదు. దీంతో ఆ సంస్థపై జరిమానా విధిస్తూ డిమాండ్ నోటీసులు పంపించారు.
- కడప జిల్లా వేదూరు డీసిల్టేషన్ పాయింట్, అనంతపురం జిల్లా పెద్దపప్పూరు రీచ్‌లో అక్రమ తవ్వకాలకు రూ.3.89 కోట్లు, వంకరాజు కాల్వ రీచ్‌లో రూ.1.45 కోట్లు, ప్రకాశం జిల్లా కామేపల్లి రీచ్‌లో చేసిన అక్రమాలకుగాను రూ.13.59 కోట్లు పెనాల్టీ చెల్లించాలని గనుల శాఖ అధికారులు డిమాండ్ నోటీసులు ఇచ్చారు.
- ఈ సొమ్మును జేపీ సంస్థ గనులశాఖకు చెల్లించాల్సి ఉంది. అయితే, రూపాయి కూడా చెల్లించలేదు.

జేపీపై కొరడా ఝుళిపించాం

» రూ.877 కోట్ల జరిమానా వేశాం

ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక జేపీ వెంచర్స్‌పై కొరడా ఝుళిపించినట్టు సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో సర్కారు స్పష్టం చేసింది. గుంటూరు జిల్లాలోని 4 రీచుల్లో జేపీ వెంచర్స్ జరిపిన అక్రమ తవ్వకాలకుగాను ఆ సంస్థపై రూ.877.5 కోట్ల జరిమానా విధించామని తెలిపింది. ఈ మేరకు కంపెనీకి డిమాండ్ నోటీసులు పంపినట్టు పేర్కొంది. "గుంటూరులోని కొల్లిపర రీచ్‌లో గత నెల 20, 22 తేదీల్లో గనుల అధికారులు తనిఖీలు చేపట్టారు. 26న జేపీ వెంచర్స్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. కొల్లిపర రీచ్‌కు సంబంధించి 2 నోటీసుల కింద రూ.73.56 కోట్ల జరిమానా, వీర్లపాలెం రీచ్ అక్రమ తవ్వకాలకుగాను రూ.375.45 కోట్లు, వల్లభాపురం రీచ్‌లో అక్రమాలకుగాను రూ.171.62 కోట్లు, గుండిమెడ రీచ్‌లో అక్రమాలకు రూ.256.87 కోట్లు పెనాల్టీ విధించాం" అని నివేదించింది. ఇదిలావుంటే, కేవలం 4 రీచ్‌ల్లో జరిగిన అక్రమాలకే రూ.877.5 కోట్ల జరిమానా విధించామని, మిగిలిన 996 రీచ్‌ల్లో జరిగిన అక్రమాలపై ఇంకెంత జరిమానా విధించాల్సి ఉంటుందో అన్న అంశాన్ని సర్కారు సుప్రీం కోర్టు ముందుంచింది.

- అయినా, ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వానికి తెలియకుండానే వెంకటరెడ్డి.. జేపీ వెంచర్స్‌కు రూ.120 కోట్ల మేరకు బ్యాంకు గ్యారంటీలు విడుదల చేశారు.
- జేపీ సంస్థ ప్రభుత్వానికి బకాయి లేదంటూ 'నో డ్యూ' సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఇది వెంకటరెడ్డి చేసిన ఘోర నేరంగా ప్రభుత్వం పరిగణిస్తోంది. ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాల్సిన అధికారి ప్రైవేటు కంపెనీతో కుమ్మక్కయి దానికి లబ్ధి చేకూర్చారని అఫిడవిట్‌లో సర్కారు వివరించింది.

కడప మేయర్ ఇంట్లో చెత్త

నగరంలో చెత్త సేకరించనందుకు టీడీపీ శ్రేణుల నిరసన



చెత్తను తీసుకెళ్లి కడప మేయర్ సురేశ్‌బాబు ఇంటి ముందు ఆందోళనకు దిగిన టీడీపీ శ్రేణులు



కడప మేయర్ సురేశ్‌బాబు ఇంటి ఆవరణలో వేసిన చెత్త

- టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మేయర్ ఇల్లు ముట్టడి
- వైసీపీ శ్రేణుల ఆగ్రహం.. పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 27: నగరంలో ఇంటింట చెత్త సేకరణ జరగకుంటే ఆ చెత్తను తీసుకెళ్లి మేయర్, కార్పొరేటర్లు ఇంట్లో వేయాలని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి రెండు రోజుల క్రితం ఇచ్చిన పిలుపు మేరకు టీడీపీ శ్రేణులు స్పందించాయి. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కడప మేయర్ సురేశ్‌బాబు ఇంటిని ముట్టడించారు. ఇంటి ముందు బైఠాయించి మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం చెత్తను మేయర్ ఇంటి ఆవరణలో పడేశారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ మాట్లాడుతూ.. నగరంలో చెత్త ఎత్తడం లేదని ప్రజలు ఎమ్మెల్యే మాధవి దృష్టికి తెస్తున్నారని, ఆమెకు చెడ్డపేరు తెచ్చేందుకే వైసీపీ మేయరు, కార్పొరేటర్లు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. మేయరు, కార్పొరేటర్ల బాధ్యతను గుర్తుచేస్తే ఎమ్మెల్యేను విమర్శిస్తారా.. అని ప్రశ్నించారు. కడప నగరంలో చెత్త ఎందుకు సేకరించడంలేదని ప్రశ్నించారు. ఇదే సమయంలో వైసీపీ శ్రేణులు మేయర్ ఇంటి వద్దకు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్పటికే చిన్నచౌకు పోలీసులు అక్కడికి చేరుకుని టీడీపీ కార్యకర్తలను పంపించి వేశారు. కాగా.. తన ఇంటి ఆవరణలో చెత్త వేసిన టీడీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మేయర్ సురేశ్ బాబు, కార్పొరేటర్లు, వైసీపీ కార్యకర్తలు చిన్నచౌకు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు.

తిరుమలేశుడి సేవలో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



కుటుంబ సభ్యులతో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జస్టిస్ ఎన్వీ రమణకు ఆలయంలోని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత కుమారి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

న్యాయమూర్తిగా నా వృత్తి ధర్మం నేను పాటించాను

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాకేశ్ కుమార్
- విజయవాడ వచ్చిన ఆయనను కలిసిన రాజధాని రైతులు, మహిళలు



జస్టిస్ రాకేశ్ కుమార్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపిన రాజధాని రైతులు

గుంటూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నా వృత్తి ధర్మం నేను పాటించాను. న్యాయసూత్రాల ప్రకారం అనేక ఆర్డర్లు ఇచ్చాను. అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని అనేది ఆ రోజున చట్టంలో ఉంది. ఆ చట్టం, నిబంధనల మేరకే ఆ రోజు తీర్పు వెలువరించాను' అంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాకేష్ కుమార్ చెప్పారు. ఒక ప్రైవేటు ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు మంగళవారం విజయవాడ వచ్చిన ఆయనను విజయవాడలోని స్టేట్ గెస్టు హౌస్‌లో రాజధాని అమరావతి రైతులు, మహిళలు కలిశారు. ఆయనకు రాజధాని రైతుల తరుఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆయన రైతు, మహిళా ప్రతినిధులతో మాట్లాడారు. తాను నిబంధనల మేరకే వ్యవహరించానని, న్యాయమూర్తిగా వృత్తి ధర్మం పాటించానని ఆయన చెప్పారు.

ఏపీ నిట్‌కు రూ.500 కోట్ల రుణం

భీమవరం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని జాతీయ విద్యాసంస్థ ఏపీ నిట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్ల రుణ మంజూరుకు అంగీకారం తెలిపింది. బ్యాంకుల ద్వారా మంజూరు చేసే రుణం మొత్తంలో 90 శాతం కేంద్రమే చెల్లిస్తుంది. మిగిలిన పదిశాతం అంటే రూ.50 కోట్లు మాత్రమే ఏపీ నిట్ చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఏపీ నిట్‌కు అదనంగా కనీసం 25 ఎకరాల భూమిని కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో నిట్ విస్తరణకు అవకాశం ఏర్పడింది. కేంద్రం ఇచ్చే నిధులతో మౌలిక వసతులకు పెద్దపీట వేయనున్నారు.

లోకేశ్ అన్నా.. నన్ను కాపాడండి!

- చిత్రహింసలు ఎదుర్కొంటున్నా..కువైట్‌లో చిక్కుకున్న నాగమణి వినతి



నాగమణి

ప్రత్తిపాడు, ఆగస్టు 27: 'మంత్రి లోకేశ్ అన్నా నన్ను కాపాడండి. జీవనోపాధి కోసం కువైట్ వెళ్లిన నేను. ఇక్కడ యజమాని పెట్టే చిత్రహింసలు భరించలేకపోతున్నాను' అంటూ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన చింతపల్లి నాగమణి మంగళవారం విడుదల చేసిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబాన్ని పోషించుకోవడానికి 4 నెలల కిందట కువైట్ వెళ్లానని, ఇటీవల తన ఆరోగ్యం క్షీణించిందని, నోరు, ముక్కు నుంచి రక్తం వస్తోందని, తనను స్వస్థలానికి తీసుకెళ్లాలని నాగమణి కోరింది. ఆదుకోపోతే తనకు చావే శరణ్యమని పేర్కొంది. రాచపల్లిలో నివసిస్తున్న నాగమణి భర్త నాగేశ్వరరావు, కుమార్తెలు విమల, అమృత ఈ వీడియోపై కలవరపడుతున్నారు. తమ తల్లి ఎలా ఉందోనని కుమార్తెలు ఆందోళన చెందుతున్నారు. మంత్రి లోకేశ్ స్పందించి తమ తల్లిని రప్పించాలని కోరారు.

టీడీపీలో చేరిన ఏలూరు మేయర్ దంపతులు

- పసుపు కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి లోకేశ్



ఏలూరు మేయర్ నూర్జహాన్ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

అమరావతి(ఆంధ్రజ్యోతి), ఏలూరు టూటౌన్, ఆగస్టు 27: ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులతో సహా వైసీపీ ముఖ్య నేతలంతా మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉండవల్లిలో మంత్రి లోకేశ్ వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలో చేర్చుకున్నారు. మేయర్ దంపతులతో పాటు మాజీ ఇడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్ బొద్దాని అఖిల పార్టీలో చేరారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలోకి చేర్చుకున్న అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... 'ఎన్నికల్లో ఓటమి నుంచి వైసీపీ గుణపాఠం నేర్చుకోలేదు. ప్రజాప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేస్తూ, పబ్బం గడుపుకుంటోంది. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది' అని అన్నారు. మేయర్ నూర్జహాన్ దంపతులు మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వ పాలనలో గత మూడేళ్లలో నగరంలో అభివృద్ధి ఏమి చేయలేకపోయాం. ప్రభుత్వం నుంచి సహకారం లేదు. టీడీపీతో అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నాం. త్వరలో 40 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు' అని వివరించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల గడువు పెంచండి

విజయవాడ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల గడువును పెంచాల్సిందిగా ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందించారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఆ శాఖ అడిషనల్ కమిషనర్, హెచ్ఆర్, శిక్షణ అధికారులను కూడా కలిసి చర్చించారు.

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన ఒడిశా బృందం

పోలవరం, ఆగస్టు 27: పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో ఒడిశాలో ముంపు ప్రాంతాల పరిరక్షణ, ఇతర అంశాలపై చర్యలకు గాను ఆ రాష్ట్రానికి చెందిన ఎంపీ ఎమ్మెల్యేలతో కూడిన 8 మంది బృందం మంగళవారం ప్రాజెక్టును సందర్శించింది. హిల్‌వ్యూ ప్రాంతం, స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పరిశీలించింది. వారికి సీఈ నరసింహమూర్తి వివరాలను తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షకుమార్ రివ్యూ పిటిషన్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 27: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో మాజీ ఎంపీ, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ జీవీ హర్షకుమార్ రివ్యూ పిటిషన్ వేశారు.

సాగునీటి సంఘాలకు జవసత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలే జరుపలేదు. దీంతో పూడికతీత పనులు, మరమ్మతులు, కాలువగట్ల బలోపేతం వంటి క్షేత్ర స్థాయి ముఖ్యమైన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అలాగే నీటి తీరువా వసూలు కూడా ఆగిపోయింది. ఈ సంఘాలు నీటి తీరువా వసూలు చేసి నీటి వనరుల నిర్వహణకు ఖర్చుచేసేవి. గత ఐదేళ్లలో ఈ సంఘాలే లేకపోవడంతో నిర్వహణ కరువై నీటి వనరులు దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఈ సంఘాలకు తిరిగి ఊపిరులూదడం ద్వారా నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కూటమి సర్కారు నిశ్చయించింది. ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. బుధవారం నాటి కేబినెట్ భేటీలో ఇది ప్రధాన ఎజెండా అంశంగా ఉంది. రాష్ట్రంలో మేజర్ నీటి వనరుల పరిధిలో 1,755 సాగునీటి వినియెదారుల సంఘాలు, 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 17 ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. అదేవిధంగా మధ్యతరహాలో 249 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 36 ప్రాజెక్టు కమిటీలు.. మైనర్ ఇరిగేషన్‌లో 4,134 నీటి వినియోగదారుల సంఘాలున్నాయి. కేబినెట్ ఆమోదించగానే మొత్తంగా 6,138 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 53 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) పరిధిలో సాగునీటి వినియోగదారుల సంఘాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) స్థాయిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) స్థాయిలో ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ సంఘాల కాలపరిమితి ఐదేళ్లు. ఈ సంఘాల సభ్యులను జిల్లా కలెక్టర్లు గుర్తిస్తారు. రాష్ట్రంలో మేజర్ జల వనరుల పరిధిలో 2,10,160 ప్రాదేశిక నియోజకవర్గాలుంటాయి. మధ్యతరహా నీటి వనరుల కింద 3,192 ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి. మైనర్ ఇరిగేషన్ కింద 24,768 ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి.

గ్రీజు రాసేవారూ లేరు..

గతంలో భారీ, మధ్యతరహా, చిన్న ప్రాజెక్టులు, చెరువులు, వాగులు, కుంటలు వంటి వాటి యాజమాన్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసేవారు. రైతులు సభ్యులుగా ఉండే ఈ కమిటీలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేవారు. కక్షలు, కార్పణ్యాలకు తావివ్వకుండా ఏకగ్రీవంగా ఎన్నుకునే ఈ సంఘాలకు ప్రభుత్వం ప్రత్యేక నగదు ప్రోత్సాహకం ఇచ్చేది. ఈ నగదుతో అవి పూడికతీత పనులు, కాలువ గట్ల మరమ్మతులు చేపట్టేవి. కానీ జగన్ ఏలుబడిలో వీటిని నిర్వీర్యం చేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉంటాయన్న ధ్యాసే ఆయనకు లేకుండా పోయింది. ఎన్నికలు జరపకపోవడంతో ఈ సంఘాల ఉనికే కనుమరుగైంది. నీటి వనరుల యాజమాన్య నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో అవన్నీ పాడైపోయాయి. కనీసం గ్రీజు రాసి గేట్లు ఎత్తేవారు కూడా కరువయ్యారు. దరిమిలా చాలా మేజర్ ప్రాజెక్టులు, మీడియం ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నాయి. కొన్ని కొట్టుకుపోయాయి కూడా. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రైతులే సొంతంగా యాజమాన్య నిర్వహణ విధానాలు అమలు చేసేందుకు వీలుగా సాగునీటి వినియోగదారుల సంఘాలకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. మంత్రివర్గం ఈ ప్రక్రియకు ఆమోద ముద్ర వేస్తే.. త్వరలోనే గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కోలాహలం కనిపించనుంది. అవి పూర్తయితే నీటి వనరుల నిర్వహణకు ఎలాంటి ఢోకా ఉండదని రైతులు అంటున్నారు.

జగన్ 'రివర్స్ టెండర్'కు స్వస్తి!

- నేడు కేబినెట్ ఆమోదం!

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అస్మదీయ పరివారం కోసం వైసీపీ అధ్యక్షుడు, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏరికోరి తెచ్చుకున్న 'రివర్స్ టెండర్' విధానానికి చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడబోతోంది. కేంద్ర విజిలెన్స్ కమిషన్, రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ల బోర్డు ఇచ్చిన సిఫారసుల ఆధారంగా దీనికి స్వస్తి పలికి.. పారదర్శకంగా ఉండే సంప్రదాయ టెండర్ల విధానాన్నే తిరిగి అమలు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం దీనికి ఆమోద ముద్ర వేయనుంది.

ఉత్తరాంధ్రకు గోదారి జలాలు!

- 6 వేల క్యూసెక్కులు వచ్చేలా పోలవరం ఎడమ కాలువ విస్తరణ
- పనులకు రూ.1,226 కోట్లతో టెండర్లు
- రాష్ట్ర జల వనరుల శాఖ నిర్ణయం
- నేడు కేబినెట్‌లో చర్చ.. ఆమోదం?

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాలకు త్వరలో గోదావరి జలాలు తరలివెళ్లనున్నాయి. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి 6,000 క్యూసెక్కుల గోదావరి జలాలను విశాఖకు తరలించేలా విస్తరణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. దీనికి రూ.1226.68 కోట్లతో టెండర్లు పిలిచేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలపనుంది. పోలవరం సాగునీటి ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికలో భాగంగా ఇప్పటికే పనులు చేపడుతున్న ఏజెన్సీలు వాటి అంచనాల విలువతోనే.. కొత్త పనులు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకునేందుకు జల వనరుల శాఖ సిద్ధమైంది. పోలవం ఎడమ ప్రధాన కాలువ ద్వారా నాలుగు లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు పారేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తద్వారా విశాఖ నగర ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు పారిశ్రామిక అవసరాలకు 23.44 టీఎంసీల గోదావరి జలాలను అందించేందుకు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని అమలులోకి తీసుకురానున్నారు. 14,000 క్యూసెక్కుల జలాలను విశాఖకు తరలించేందుకు రూ.1,353 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. విశాఖకు గోదావరి జలాలను తరలించే పనులను ఎనిమిది ప్యాకేజీలుగా విభజించారు. ప్యాకేజీ 1, 3, 4, 5, 6 పనులను ఇప్పటికే రద్దు చేశారు. వీటిని ప్రీక్లోజర్ చేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ గుండా పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా 50,000 ఎకరాలకు సాగు నీరందించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. 2024-25 స్టాండర్డ్ ఆఫ్ రేట్(ఎస్ఓఆర్) ధరలకు పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 1,41,000 ఎకరాలకు సాగునీరందించడమూ ఈ విస్తరణ పనుల్లో కలసి ఉన్నాయి. పోలవరం ఎడమ ప్రధాన కాలువ సమగ్ర కార్యాచరణకు బుధవారం రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం పొందాలని జల వనరుల శాఖ నిర్ణయించింది.

ఏలేశ్వరం గురుకుల పాఠశాలలో 72మంది విద్యార్థినులకు అస్వస్థత

- ఆహారం వికటించి వాంతులు, విరేచనాలు.. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స
- కలెక్టర్‌తో మాట్లాడిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశాలు

ఏలేశ్వరం, ఆగస్టు 27: ఆహారం వికటించడంతో కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన 72మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి తిన్న గోంగూర, వంకాయ కూర, సోమవారం ఉదయం అల్పాహారంగా తీసుకున్న పులిహోర వికటించడంతో కొంతమంది విద్యార్థినులు వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి బారినపడ్డారు. వీరికి ప్రిన్సిపాల్ చంద్రశారద మాత్రలు ఇచ్చి సరిపెట్టారు. కాగా వీరితో పాటు మరికొంతమంది విద్యార్థినులు మంగళవారం ఉదయం మరింత అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని అంబులెన్స్ ద్వారా ఏలేశ్వరంలోని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థినుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని ఆదేశించారు.

త్వరలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ప్రక్షాళన

- ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ వన్‌టౌన్, ఆగస్టు 27 : ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌ను త్వరలోనే ప్రక్షాళన చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఒలింపిక్ అసోసియేషన్‌ను కబ్జా చేసిందన్నారు. అసోసియేషన్‌లో 34 ఫెడరేషన్‌లు ఉంటే అన్నింటినీ దొంగ రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. దాదాపు 340 కేసులతో ఒలింపిక్ అసోసియేషన్ చీడ పట్టిందన్నారు. మితిమీరిన రాజకీయ జోక్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ రికార్డుల్లో వివరాలు సరిగా నమోదు కాకుండా గత ప్రభుత్వంలో పెద్దలు అడ్డుకున్నారని విమర్శించారు. ఇటువంటి వాటిపైన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయడానికి ప్రజలు తరలివచ్చారని చెప్పారు. వినతులు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మా ప్రాణాలను వేలం వేశారు

- మమ్మల్ని చంపిన వారికి మాచర్ల మునిసిపల్ ఛైర్మన్ పదవి ఇస్తామన్నారు
- హత్యకు ఉసిగొల్పిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి
- దాడి చేసిన తురకా కిశోర్‌పై చర్యలు తీసుకోండి
- పల్నాడు ఎస్పీకి బుద్దా వెంకన్న ఫిర్యాదు



పల్నాడు ఎస్పీ లక్ష్మీపతికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

నరసరావుపేట లీగల్, ఆగస్టు 27: 'మా ప్రాణాలను తీసిన వారికి పదవి ఇస్తానని బహిరంగ ప్రకటన చేసిన వారిపై, మాపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన పల్నాడు ఎస్పీ లక్ష్మీపతిని కలిసి, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తురక కిశోర్ తదితరులపై ఫిర్యాదు చేశారు. 'బుద్దా వెంకన్న, బొండా ఉమామహేశ్వరరావు, లాయర్ కిశోర్‌ను హతమార్చిన వారికి మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇస్తా.. అని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బహిరంగంగా ప్రకటించారు. మాపై దాడి చేయించిన, చేసిన పిన్నెల్లి, తురకా కిశోర్ వారి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోండి. మాకు న్యాయం చేయండి' అని వెంకన్న కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "2020 సంవత్సరం మార్చి 10న మాచర్లలో మా పార్టీ వారిని నామినేషన్ వేయకుండా ఎమ్మెల్యే పిన్నెల్లి కట్టడి చేశారు. మా నాయకుడు చంద్రబాబు సూచనల మేరకు నేను, బొండా ఉమ మాచర్ల వెళ్లాం. విషయం తెలిసి అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 'తెలుగుదేశం నాయకులు మాచర్ల వస్తున్నారు. వారిని చంపిన వారికి మున్సిపల్ ఛైర్మన్ పదవి కట్టబెడతా' అని బహిరంగ వేలం పెట్టారు. ఆ వేలంపాటలో తురకా కిశోర్ ముందుకు వచ్చి మాచర్ల వచ్చే తెలుగుదేశం నేతలను మట్టుపెడతా అని శపథం చేశాడు. దాని ప్రకారమే తురకా కిశోర్ తన బృందంతో మాచర్లలోకి ప్రవేశించిన మా వాహనాన్ని, మోటార్ సైకిల్‌పై వెంబడించి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వీటికి సంబంధించి సోషల్ మీడియా, మాధ్యమాల్లో వచ్చాయి. అప్పట్లో ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా మా నుంచి ఫిర్యాదు కూడా తీసుకోలేదు. ఇప్పటికైనా సంఘటనకు సంబంధించిన ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేసి మాపై హత్యాయత్నానికి పాల్పడ్డ వారిని, వారిని ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్పీ లక్ష్మీపతికి ఫిర్యాదు చేశా' అని బుద్దా వెంకన్న వివరించారు.

ఫైల్స్ దహనం కేసులో సీఐడీ జోరు!

- మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ
- సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ స్వీయపర్యవేక్షణ



మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని విచారిస్తున్న సీఐడీ అధికారులు

రాయచోటి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్ల దహనం కేసు విచారణలో ఏపీ సీఐడీ పోలీసులు జోరు పెంచారు. స్వయంగా సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ హాజరై విచారణను పర్యవేక్షించారు. కొన్ని రోజులుగా స్తబ్దుగా ఉన్న సీఐడీ అధికారులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. వీఆర్‌వో రమణయ్య, సీనియర్ అసిస్టెంటు గౌతమ్‌తేజ, ఆర్డీవో హరిప్రసాద్‌లను విచారించారు. సోమవారం సాయంత్రం నుంచి దాదాపు అర్ధరాత్రి 12.30 వరకు పై ముగ్గురినీ విచారించారు. వీడియో రికార్డింగ్ మధ్య సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఘటన సమయంలో మంటలు ఎక్కడ నుంచి ఎక్కడికి వ్యాపించాయి. ఎన్ని ఫైళ్లు, ఏ స్థాయిలో దహనం అయ్యాయి అనే కోణంలో ఫైర్ అధికారులను విచారించారు. తెల్లవారు జాము 3 గంటల వరకు సీఐడీ చీఫ్‌తోపాటు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలోనే ఉండి విచారణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్యాలంయంలోకి ఎవరినీ రానీయలేదు. మంగళవారం రవిశంకర్ అయ్యన్నార్, విద్యాసాగర్ వెళ్లిపోయాక సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని విచారించారు. సంఘటన జరిగిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం తొలుత స్థానిక పోలీసులతోనే విచారణ జరిపించినా.. ఇందులో ప్రధాన సూత్రధారులుగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు ఉన్నారనే అనుమానంతో విచారణను సీఐడీకి అప్పగించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వరద రాజకీయం

ఎడతెరిపిలేని వర్షాలతో బంగ్లాదేశ్‌లోని పలుప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. మరణాల సంఖ్య పాతికవరకూ ఉన్నప్పటికీ, అరవైలక్షలమంది ప్రజల జీవితాలను ఈ వరదలు ప్రభావితం చేశాయి. రోడ్లు ధ్వంసమై రవాణావ్యవస్థ స్తంభించడంతో ఆహారసరఫరాలకు ఇబ్బంది ఏర్పడింది. నిత్యావసరాలు, తాగునీరు, మందులు అందక ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. వరద బీభత్సం తీవ్రంగా ఉన్న స్థితిలో మధ్యంతర ప్రభుత్వాధినేత మహ్మద్ యూనుస్ దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వరదబాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి ఆకస్మిక వరదలు ముంచెత్తకుండా పొరుగుదేశాలతో చర్చలు జరుపుతామని ప్రకటించారు. భారతదేశానికి చెందిన త్రిపుర రాష్ట్రంలోని దుంబూర్ డ్యామ్ గేట్లను అకస్మాత్తుగా తెరవడం వల్లనే బంగ్లాదేశ్‌లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద పోటెత్తిందనే ప్రచారం విస్తృతంగా సాగిన నేపథ్యంలో, ఆయన నోటినుంచి అటువంటి ఆరోపణేమీ నేరుగా రాకున్నా ఈ పరోక్షప్రస్తావనకు ప్రాధాన్యం ఏర్పడింది. దుంబూర్ డ్యామ్ వల్లనే బంగ్లాదేశ్‌లో మునక అధికంగా జరిగిందన్న ప్రచారాన్ని భారత్ వెంటనే ఖండించింది. ఈ డ్యామ్ సామర్థ్యం, విడుదలైన నీరు వ్యాప్తిచెందగల వేగం, విస్తీర్ణం, ప్రభావం ఇత్యాది అంశాలతో మంచివివరణే ఇచ్చింది. అయినప్పటికీ, బంగ్లాదేశ్ సామాజిక మాధ్యమాల్లో వరదల వెనుక అనుమానాలు, కుట్రసిద్ధాంతాల ప్రచారాలు పూర్తిగా ఆగిపోలేదు.

గతవారం త్రిపురను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఐదురోజుల పాటు సాధారణం కంటే మూడురెట్లు అధికంగా కుంభవృష్టి కురవడంతో రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. పాతికమంది మరణించారు, ఇరవైలక్షలమంది ప్రభావితులైనారు, లక్షన్నరమంది నిరాశ్రయులైనారు. త్రిపురకు పశ్చిమాన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లోని జిల్లాల్లో కూడా ఇదే రకమైన కష్టం తలెత్తింది. అక్కడ కూడా వరదలు వచ్చాయి, చెరువులు తెగిపడ్డాయి. అయితే, మారిన రాజకీయ వాతావరణం వల్ల కాబోలు, అక్కడి సామాజిక మాధ్యమాల్లో భారత్ మీద ఆరోపణలు ఊపందుకున్నాయి. డ్యామ్ గేట్లు తెరిచేసి, గుమ్టీ నదిద్వారా భారతదేశం కక్షపూరితంగా బంగ్లాదేశ్‌లో కృత్రిమవరదలను సృష్టించిందన్నది ఆ ప్రచారం సారాంశం. విశ్వాసం తగ్గుముఖం పట్టినప్పుడు ఇటువంటి విషప్రచారాలకు హద్దు ఉండదు. డ్యామ్‌గేట్లను ఎత్తివేయడం వెనుక ఏవో దురుద్దేశాలున్నాయన్న ఆరోపణలు సరికాదు కానీ, నిర్దిష్టమైన ఎత్తుకు నీరుచేరినప్పుడు గేట్లు ఆటోమేటిక్‌గా తెరుచుకొని నీరు విడుదలయ్యే ఏర్పాటయితే అక్కడ ఉంది. అయితే, డ్యామ్‌లో నీరు ప్రమాదకరమైన ఎత్తుకుచేరిందనీ, ఏ క్షణమైనా అది ఆటోమేటిక్‌గా ఖాళీ కావచ్చునన్న హెచ్చరిక మనసుంచి బంగ్లాదేశ్‌కు చేరలేదని అంటారు. అందువల్ల, ఎంతో ముందునుంచే ఆ దేశంలోనూ తీవ్రమైన వర్షాలు, వరదపరిస్థితి ఉన్నప్పటికీ, త్రిపురలో గేట్లు ఎత్తివేయడంతోనే తమకు ఈ దుస్థితి ఏర్పడిందంటూ భారత్‌ను తప్పుబట్టడానికి వారికి అవకాశం కలిగింది. త్రిపురలోని ఎనిమిది జిల్లాలనూ వరద ముంచెత్తిన వాస్తవాన్ని పక్కనబెట్టి, ఒక జిల్లాలోని ఓ చిన్నడ్యామ్ కారణంగా ఈ ఘోరం జరిగిపోయిందంటూ బంగ్లాదేశ్‌లోని ఒక వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రచారం చేసిందని అంటారు. డ్యామ్ అధికారులు త్రిపుర ప్రభుత్వానికి తమవంతుగా ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేరవేస్తున్నప్పటికీ, అవి పొరుగుదేశానికి అందలేదన్న వాదనలూ ఉన్నాయి.

చెప్పాపెట్టకుండా గేట్లు తెరిచేసి, విపత్తును ఎదుర్కొనేందుకు ఏమాత్రం సమయం ఇవ్వకుండా భారతదేశం మమ్మల్ని ప్రమాదంలో పడవేసిందన్న రీతిలో బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ సలహాదారు ఇటీవల వ్యాఖ్యానించారు. అక్కడి కోటా వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన ఈ ఢాకా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు భారతదేశం సహాయనిరాకరణ చేస్తోందని కూడా ఆరోపిస్తున్నారు. ఆయన వేటిని మనసులో పెట్టుకొని ఈ మాటలన్నారో తెలియదు కానీ, రెండు దేశాల మధ్యా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన నీటి తగువులు కూడా ఇకమీదట వేడెక్కవచ్చును. రెండు దేశాల మధ్యా దాదాపు యాభైనాలుగు నదులు సరిహద్దులకు అతీతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇటువంటి పొరపొచ్చాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. బంగ్లాదేశ్‌లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇది ఎంతో ముఖ్యం. ఇప్పటికే ఉన్న విధానాలను కచ్చితంగా అమలుచేయడం, మరింత పటిష్టపరచడం అవసరం. ఎప్పటికప్పుడు డేటా పంచుకోవడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవడం అవసరం.

ప్రభుత్వాల చేతుల్లోకి కేబుల్ టీవీ

టీ ఫైబర్ ప్రాజెక్ట్ ద్వారా రూ.300కే హైస్పీడ్ ఇంటర్నెట్‌తోబాటు కేబుల్ టీవీ ప్రసారాలు అందిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను సామాన్య ప్రజలు స్వాగతిస్తున్నారు. కేబుల్ పరిశ్రమ మాత్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కేబుల్ టీవీ ప్రసారాలు ప్రభుత్వం చేతుల్లోకి వెళ్ళిపోతే ఈ పరిశ్రమ భవిష్యత్ ఏంటన్నది వాళ్ళ ముందున్న సమస్య. కానీ సామాన్య ప్రజలకు మాత్రం తక్కువ ధరకే కేబుల్, ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుంది. సీఎం చెబుతున్నదాన్ని బట్టి తెలంగాణలో 93 లక్షల ఇళ్లకు చేరటం ప్రభుత్వ లక్ష్యం. అదే విధంగా సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ సహా 65,500 ప్రభుత్వ సంస్థలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తారు. ఈ-గవర్నెన్స్ అందించటానికి వీలుగా భారత్ నెట్ పథకాన్ని టీఫైబర్‌కు వర్తింపజేయాలని ఇప్పటికే ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటర్నెట్ విస్తరణలో రాష్ట్రాలకు సహకరించటం వరకూ ఎలాంటి సమస్యా లేకపోయినా, టీవీ పంపిణీ రంగంలోకి రావటం మీదనే కేంద్రానికి మొదటి నుంచీ అభ్యంతరాలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో టీవీ ఉండకూడదన్నది కేంద్ర ప్రభుత్వ విధానం. అందుకే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు సొంతగా టీవీ చానల్స్ నడుపుకుంటామని అడిగినా ఒప్పుకోలేదు. అలా అడిగి కాదనిపించుకున్న రాష్ట్రాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పంజాబ్, కర్ణాటక, హర్యానా, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. అభివృద్ధి సంబంధమైన విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం లాంటి విషయాల ప్రచారానికి ఇస్రో సహకారంతో నడిచే కేయూ బాండ్ ఛానల్స్‌ను మాత్రమే కేంద్రం అనుమతించింది. తెలంగాణలో టీశాట్, ఆంధ్రప్రదేశ్‌లో శాప్ నెట్ కింద నడుస్తున్న రెండేసి చానల్స్ అందుకు ఉదాహరణ.

సొంత చానల్స్ సంగతి అలా ఉంచితే, కేబుల్ టీవీ ద్వారా శాటిలైట్ టీవీ చానల్స్ పంపిణీ చేయటానికి ప్రయత్నించిన మొదటి రాష్ట్రం తమిళనాడు. సన్ టీవీ ఆధ్వర్యంలో నడిచే సుమంగళి కేబుల్ విజయం గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయటానికి జయలలిత ఈ వ్యవస్థను ప్రోత్సహించారు. తక్కువ ధరకే కేబుల్ ప్రసారాలు అందించటంలో విజయం సాధించారు. ఒక దశలో 80 శాతం ఇళ్ళకు చేరిన ఘనత అక్కడి అరసు కేబుల్ టీవీది. అయితే, కేబుల్ టీవీ డిజిటైజేషన్ జరిగినప్పుడు "రాష్ట్ర ప్రభుత్వమే ఒక ఎమ్మెస్వోగా ఉండటం కుదర"దంటూ లైసెన్స్ ఇవ్వలేదు. చాలాకాలం ఈ ప్రతిష్టంభన కొనసాగింది. జయలలిత 36 సార్లు కేంద్రానికి లేఖలు రాశారు. ఢిల్లీ వెళ్ళిన ప్రతిసారీ ఆ విషయం ప్రస్తావించేవారు. ఏమైతేనేం తాత్కాలిక అనుమతి రావటం, ఇప్పుడు 55శాతం మేర ఇళ్ళకు టీవీ ప్రసారాలు అందిస్తూ ఆ రాష్ట్రంలో అతి పెద్ద ఎమ్మెస్వోగా ఉండటం తెలిసిందే.



హైదరాబాద్ హైటెక్స్‌లో ఆగస్టు 28న మూడు రోజుల కేబుల్ ఎక్స్‌పో మొదలవుతున్న వేళ రేవంత్‌రెడ్డి ఈ తేనెతుట్టెను కదపటం కేబుల్ టీవీ రంగాన్ని అనేక భయాలకు గురి చేసినట్టయింది. కానీ, ప్రభుత్వం పోషిస్తున్నది ఎమ్మెస్వో పాత్ర మాత్రమేనని, ఆపరేటర్ల ఉనికికి, ఉపాధికి ఇబ్బంది ఉండదనే భరోసా ఇవ్వటం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు.

ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా దాదాపు ఇదే బాటలో నడిచింది. అయితే, ఇది ఒక విధంగా 'భారత్ నెట్' అని పిలిచే భారత్ బ్రాడ్ బాండ్ నెట్ వర్క్ పథకానికి కొనసాగింపు. 2012లో ఏర్పాటైన భారత్ నెట్ లక్ష్యం దేశంలోని రెండున్నర లక్షల గ్రామ పంచాయితీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించటం ద్వారా 'డిజిటల్ ఇండియా'ను సాధించటం. 2014లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని ఏపీ ఫైబర్ పేరుతో మరింత వేగంగా అమలు చేయటానికి పూనుకుంది. అందరికంటే ముందుగా అమలు చేసి ఆదర్శంగా నిలవాలని భావించింది. అండర్ గ్రౌండ్ కేబుల్ ఆలస్యమవుతుందని ఓవర్ హెడ్ ఫైబర్ వేసింది. పనిలో పనిగా 'ట్రిపుల్ ప్లే' పేరుతో ఇంటర్నెట్, టీవీ, ఫోన్ ఇస్తానని చెప్పింది. నిజానికి ఇది పురోగామి చర్యలా కనిపించినా, ఫోన్ అనవసరమని చాలామంది అన్నారు. అప్పటికి ఇంటర్నెట్ మీద కూడా అంతగా మోజు లేదు. అప్పటికే కేబుల్ టీవీ డిజిటైజేషన్ పూర్తి కావస్తూ ఉండటం, చాలామంది సెట్ టాప్ బాక్సులు కొనుక్కొని ఉండటంతో ఏపీ ఫైబర్ తన స్పెషల్ 'ట్రిపుల్ ప్లే' సెట్ టాప్ బాక్సులు అమ్మలేకపోయింది. పైగా, ఇతర కేబుల్ టీవీ ఎమ్మెస్వోలు రూ.1500కే బాక్స్ ఇస్తున్నప్పుడు ఈ ట్రిపుల్ ప్లే బాక్స్ ధర రూ.4,500 ఉండటం వల్ల కూడా ఆశించిన స్పందన రాలేదు.

ఏమైతేనేం, టీడీపీ హయాంలో నయానో భయానో కనెక్షన్ల సంఖ్య దాదాపు 10 లక్షలకు చేరినా, వైసీపీ హయాంలో అంతగా పట్టించుకోకపోవటంతో దాదాపు సగానికి తగ్గాయి. ఇప్పుడు మళ్ళీ టీడీపీ ప్రభుత్వం వాటి మీద దృష్టిపెట్టింది. 9.7 లక్షల కనెక్షన్లలో 5 లక్షలు క్రియాశీలంగా ఉన్నాయని కేంద్రానికి చెప్పింది. భారత్ నెట్ రెండో దశలో భాగంగా 35 లక్షల సెట్ టాప్ బాక్సులు ఇవ్వాలని కోరింది. అదే జరిగితే ఇప్పటికే పాతబడ్డ ఇతర ఎమ్మెస్వోల సెట్ టాప్ బాక్సులు వదిలేసి ఇప్పుడు ఏపీ ఫైబర్ బాక్సులవైపు జనం మొగ్గు చూపే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఆ 35 లక్షల కస్టమర్లను సంపాదించుకోవటం కష్టం కాకపోవచ్చు.

ఆ విధంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాల కేబుల్ వ్యాపారం దూకుడు పెరగబోతోంది. ప్రభుత్వాలే ఎమ్మెస్వోల అవతారం ఎత్తినప్పుడు నష్టపోయేది ఎమ్మెస్వోలే తప్ప సాధారణ కేబుల్ ఆపరేటర్లకు వచ్చే ఇబ్బందేమీ ఉండకపోవచ్చు. తమిళనాడులో అదే జరిగింది. చందాదారుకు నచ్చజెప్పి ప్రభుత్వ సెట్ టాప్ బాక్స్ పెట్టించటమే ఆపరేటర్ పని. ప్రభుత్వం లాభాపేక్షతో నడపదు కాబట్టి ఆపరేటర్‌కు ఎప్పటిలాగానే కమిషన్ వస్తుంది. ప్రభుత్వాలు కనెక్షన్లు పెంచుకునే కొద్దీ పే చానల్స్‌తో బేరమాడే శక్తి పెరుగుతుంది. ఆ విధంగా చందాదారులకు వీలైనంత తక్కువ ధరకే ప్రసారాలు అందించగలుగుతారు. చానల్స్ అందించినందుకు వాటి నుంచి వసూలు చేస్తున్న కారేజ్ ఫీజుకూ సరైన లెక్కలుండటం వల్ల చానల్స్‌కు కూడా అది ఉపయోగం. కారేజ్ ఫీజులో వాటా ఆపరేటర్‌కి ఇవ్వటమా, ఆ మేరకు చందాదారు బిల్లు తగ్గించటమా అనే విషయంలో ప్రభుత్వమే ఒక నిర్ణయం తీసుకోవచ్చు.

అందువలన తమిళనాడు నమూనాను అధ్యయనం చేసి తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేయాల్సి ఉంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ నమూనాలో మంచిచెడ్డలు కూడా పరిశీలించటానికి ఇప్పుడు తగిన అవకాశం దొరికినట్టయింది. వీటి ఆధారంగా ఒక మెరుగైన మార్గంలో టీ ఫైబర్‌ను ముందుకు నడిపితే ఇప్పుడు ప్రకటించిన '300కే హై స్పీడ్ ఇంటర్నెట్, టీవీ' కచ్చితంగా ప్రజాదరణ పొందుతుంది. హైదరాబాద్ హైటెక్స్‌లో ఆగస్టు 28న మూడు రోజుల కేబుల్ ఎక్స్ పో మొదలవుతున్న వేళ రేవంత్‌రెడ్డి ఈ తేనెతుట్టెను కదపటం కేబుల్ టీవీ రంగాన్ని అనేక భయాలకు గురి చేసినట్టయింది. కానీ, ప్రభుత్వం పోషిస్తున్నది ఎమ్మెస్వో పాత్ర మాత్రమేనని, ఆపరేటర్ల ఉనికికి, ఉపాధికి ఇబ్బంది ఉండదనే భరోసా ఇవ్వటం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు.

● తోట భావనారాయణ

హరియాణా ఎన్నికలు, ప్రాంతీయ అస్తిత్వాలు

తెలుగుదేశం అధినేత నందమూరి తారకరామారావు 1987లో హరియాణాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి లోక్‌దళ్ ఘన విజయానికి తోడ్పడిన విషయం చరిత్ర పుటల్లో రికార్డు అయింది. ఆ ఎన్నికల్లో రైతు నాయకుడు దేవీలాల్ సారథ్యంలోని లోక్‌దళ్ – భారతీయ జనతా పార్టీతో కలిసి పోటీ చేసి 90 సీట్లలో 76 సీట్లు గెలుచుకుని ఘన విజయం సాధించింది. లోక్‌దళ్‌కు 60 సీట్లు రాగా, బీజేపీకి 16 సీట్లు లభించాయి. దాదాపు 37 సంవత్సరాల తర్వాత ఇప్పుడు జరుగుతున్న హరియాణా ఎన్నికల్లో దేవీలాల్ మునిమనుమడు, నాలుగోతరం నేత దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జెజెపి) భవిష్యత్ ఏమిటో అక్టోబర్ 1న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలు తేల్చనున్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 15 శాతం ఓట్లు, 10 సీట్లు సాధించిన జెజెపి మూడునెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 0.87 శాతం ఓట్లు సాధించింది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హరియాణాలోని 90 సీట్లలో బీజేపీ కేవలం 47 సీట్లు సాధించడంతో జెజెపి కీలక మద్దతునిచ్చి ప్రభుత్వం ఏర్పాటుకు దోహదం చేసింది. అయిదు సంవత్సరాల తర్వాత ఇప్పుడు జెజెపిని ఎవరూ పట్టించుకునే స్థితిలో లేరు. 2020లో రైతుల ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నప్పుడు, మహిళా మల్లయోధుల నిరసన సమయంలో కూడా అధికారంతో అంటకాగడంతో జెజెపి ప్రజలకు దూరమైంది. లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో ప్రజలు ఆ పార్టీని ప్రచారానికి కూడా అనుమతించలేదు. ఒకప్పుడు హరియాణా రాజకీయాలను శాసించిన దేవీలాల్ – చౌతాలా కుటుంబం ముక్కలుముక్కలై, వేర్వేరు పార్టీలుగా చీలి ఇప్పుడు అస్తిత్వ పరీక్షలో ఉన్నది. ఉనికిని కాపాడుకునేందుకు చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీతో కలిసి జెజెపి పోటీ చేస్తోంది. తద్వారా ఎంతో కొంత ఓటు బ్యాంకును నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. 'ప్రజల మనోభావాలు మేము అర్థం చేసుకోలేకపోయాం. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో మూల్యం చెల్లించాం' అని దుష్యంత్ చౌతాలా ఒక ఇంటర్వ్యూలో అన్నారు. హరియాణాలో ప్రధాన పోటీ ఇప్పుడు కాంగ్రెస్– బీజేపీలకే పరిమితం కావడంతో తాను మరోసారి కింగ్ మేకర్ పాత్ర పోషిస్తాననే ఆశతో దుష్యంత్ ఉన్నారు.

నిజానికి హరియాణాలో ప్రాంతీయ రాజకీయాలు 1967లోనే ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్‌లో ముఠా తగాదాలే ఈ ప్రాంతీయ పార్టీలకు కారణమయ్యాయి. 1967లో హరియాణా వికాస్ పార్టీ స్థాపించిన బీరేంద్ర సింగ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండవ ముఖ్యమంత్రిగా అధికారం చలాయించినప్పటికీ ఏడాది కూడా పాలించలేకపోయారు. ఆ తర్వాత నిలదొక్కుకోకపోవడంతో 1978లో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఆ తర్వాత భారతీయ క్రాంతిదళ్, హరియాణా వికాస్ పార్టీ, హరియాణా జనసభ వంటి నాలుగైదు ప్రాంతీయ పార్టీలు ఏర్పడినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. కేవలం భారత జాతీయ లోక్‌దళ్ మాత్రమే చాలా కాలం హరియాణా రాజకీయాలను ప్రభావితం చేసింది. కాని ఈ పార్టీ ముక్కలై 2019లో జననాయక్ జనతా పార్టీ రూపంలో మిగిలింది. ఇప్పుడా పార్టీ కూడా కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నది.

1989 లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 85 సీట్లు



హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందో లేక మళ్లీ కాంగ్రెస్‌కు అధికారం అప్పజెబుతుందో ఇప్పుడే చెప్పడం కష్టం. ఆ రెండు జాతీయ పక్షాల మధ్య జరిగే భీకర పోరులో ఒక చరిత్ర గలిగిన ప్రాంతీయ పార్టీ (ఐఎన్‌ఎల్‌డి) అవశేషం (జననాయక్ జనసేన) భవితవ్యం ఏమిటో తేలనున్నదనేది స్పష్టం. ఆ మాటకొస్తే జాతీయ పాలక, ప్రతిపక్ష కూటములకు చెందని సమస్త పార్టీలూ మనుగడ ముప్పులో ఉన్నాయి.

సాధించినప్పటికీ బీజేపీ హరియాణాలో ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. సుష్మాస్వరాజ్, సూరజ్‌భాను వంటి నేతలు కూడా పరాజయం పాలయ్యారు. 1991 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దేశవ్యాప్తంగా 120 సీట్లు సాధించినప్పటికీ హరియాణాలో రెండు సీట్లు సాధించింది. దీనితో దేశవ్యాప్తంగా బీజేపీ పుంజుకోవాలంటే ప్రాంతీయ పార్టీల భుజాన ఎక్కడం తప్పదని గ్రహించింది. సరిగ్గా అదే సమయంలో నరేంద్రమోదీని పార్టీ ఇన్‌చార్జిగా బీజేపీ రంగంలోకి దించింది. అప్పటికి కాంగ్రెస్‌తో విభేదాల వల్ల బన్సీలాల్ హరియాణా వికాస్ పార్టీ పేరుతో స్వంత కుంపటిని ఏర్పాటు చేసుకుని 1991 ఎన్నికల్లో 5.35శాతం ఓట్లతో ఒక సీటును సాధించడం మోదీ దృష్టిని ఆకర్షించింది. మోదీ ప్రయోగం విజయవంతమై 1996 ఎన్నికల్లో హరియాణా వికాస్ పార్టీ–బీజేపీ కూటమి కలిసి 76 సీట్లను సాధించింది. 11 సీట్లతో బీజేపీ బన్సీలాల్ ప్రభుత్వానికి కీలక మద్దతును అందించింది. ఆసక్తికరమైన విషయం ఏమంటే బన్సీలాల్ ప్రభుత్వం దుష్పరిపాలన మూలంగా రెండేళ్లలోనే ప్రజాదరణ కోల్పోయింది. 1998 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 182 సీట్లను సాధించినప్పటికీ బీజేపీ, హెచ్‌విపి హరియాణాలో చెరొక సీటును మాత్రమే పొందాయి. దీనితో మోదీ చక్రం తిప్పి వెంటనే బన్సీలాల్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుని భారత జాతీయ లోక్‌దళ్ నేత దేవీలాల్ కుమారుడు ఓం ప్రకాశ్ చౌతాలాతో చేతులు కలిపారు. కేంద్రంలో ఏర్పడ్డ వాజపేయి తొలి ప్రభుత్వానికి నలుగురు ఎంపీలతో చౌతాలా మద్దతు నీయడమే ఇందుకు కారణం. ఆ తర్వాత బన్సీలాల్ గతిలేక మళ్లీ కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేశారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ వ్యూహం ఫలించి ఐఎన్‌ఎల్‌డి–బీజేపీ మొత్తం పది సీట్లను సాధించగలిగాయి. 2000 అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎన్‌ఎల్‌డి స్వంతంగానే 62 సీట్లు సాధించడంతో బీజేపీ మద్దతు అవసరం లేకుండా పోయింది. అయినప్పటికీ బీజేపీ వెలుపలి నుంచి మద్దతునందించింది. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా మోదీ మళ్లీ గుజరాత్ రాజకీయాల్లో ప్రవేశించడం, వాజపేయి ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోవడం, కాంగ్రెస్ పుంజుకోవడంతో హరియాణా రాజకీయాలు బీజేపీ చేతుల్లోంచి జారిపోయాయి. 2005 నుంచి 2014 వరకు భూపీందర్ సింగ్ హుడా నేతృత్వంలో కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీతో అధికారం చలాయించింది. ఐఎన్‌ఎల్‌డి ప్రతిపక్ష స్థానంలో ఉండగా, బీజేపీ రెండు మూడు సీట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకోవల్సి వచ్చింది.

మళ్లీ 2014లో నరేంద్రమోదీ ప్రభంజనం వీచి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాతే హరియాణాలో బీజేపీ దశ తిరిగింది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మోదీ హరియాణాలో బీజేపీని గెలిపించి 1995–2001 మధ్య తనతో పాటు పార్టీ యంత్రాంగంలో పని చేసిన మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రి చేశారు. 2019లో ఖట్టర్ పూర్తి మెజారిటీ సాధించలేకపోవడంతో చౌతాలా మనుమడి సహకారంతో ప్రభుత్వం నిలబెట్టుకున్నారు. కాని లోక్‌సభ ఎన్నికల సమయంలో జెజెపితో విభేదాలు రావడంతో ఖట్టర్‌ను తప్పించి నాయబ్‌సింగ్ సైనీ అనే బీసీ నేతకు పగ్గాలు అప్పజెప్పారు. జెజెపిని పక్కన పెట్టి స్వంతంగా పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పదేళ్ల ప్రజా వ్యతిరేకతను తట్టుకుని బీజేపీ హరియాణాలో గెలుస్తుందా, పది సంవత్సరాల తర్వాత మళ్లీ కాంగ్రెస్‌కు అధికారం అప్పజెబుతుందా ఇప్పుడే చెప్పడం కష్టం. ఏమైనా 'ఉద్ధతుల మధ్య పేదలకుండతరమే' అన్నట్లుగా హరియాణాలో ప్రస్తుతం బీజేపీ కాంగ్రెస్‌ల మధ్య జరిగే భీకరపోరులో ఒక చరిత్ర గలిగిన ప్రాంతీయ పార్టీ అవశేషం మనుగడ ఏమిటో ఈ ఎన్నికల్లో తేలుతుంది.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

సారాంశం ఏమంటే 1987లో ఎన్టీఆర్ లోక్‌దళ్‌కు ప్రచారం చేసినప్పుడు బీజేపీ బాల్యదశలో ఉన్న పార్టీయే. నాడు ఎన్టీఆర్, దేవీలాల్ నేషనల్ ఫ్రంట్ నేతలుగా కూర్చుని ఉండగా వాజపేయి, చంద్రశేఖర్‌లు వెనుక నిలబడి ఉన్న దృశ్యం మరిచిపోలేనిది. దేశ వ్యాప్తంగా ఎన్టీఆర్‌ను ప్రచారానికి ఆహ్వానిస్తున్న రోజులవి. ఆ తర్వాతి కాలంలో బీజేపీ దినదిన ప్రవర్ధమానమైనట్లు ఎదిగి దేశ రాజకీయాలను తానే ప్రభావితం చేయగలిగే స్థాయికి చేరుకుంది. హరియాణాలో నిలదొక్కుకునేందుకు చాలా అవస్థలు పడింది. పేక ముక్కల్ని మార్చినట్లు మిత్రపక్షాలను మార్చింది. చివరకు బీజేపీ తానే స్వంతంగా అధికారంలోకి రాగలిగిన స్థాయికి చేరుకుంది.

హరియాణా అనుభవాలు దేశంలో ఇతర ప్రాంతీయ పార్టీలకు కూడా వర్తిస్తాయా అన్న విశ్లేషణకు ఆస్కారం కలిగిస్తున్నాయి. నేషనల్ ఫ్రంట్‌లో పాత్ర పోషించిన బిజూ జనతాదళ్ అధినేత బిజూ పట్నాయక్ కుమారుడు నవీన్ పట్నాయక్ ఇప్పుడు 24 సంవత్సరాల పాలన తర్వాత పార్టీ పరాజయం కావడంతో దాన్ని కాపాడాల్సిన పరిస్థితిలో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ ఒకప్పుడు ఒడిషాలో బిజెడి భుజాలపై ఎక్కి ఎదిగిన పార్టీయే. బిజెడితో పాటు తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రలో వైసీపీ కూడా హరియాణాలో జన నాయక్ జనసేన పార్టీ మాదిరి మనుగడ తేల్చుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాయి. దేవీలాల్ తర్వాత నాల్గోతరం వరకైనా జెజెపి రూపంలో ఆయన వారసత్వం మిగిలి ఉంటే, బిజెడి రెండో తరం కొంతకాలం నిలదొక్కుకోగలిగింది. బిఆర్ఎస్ రెండో తరం వరకు రాకముందే సంక్షోభంలో పడింది. వైసీపీలో మొదటి తరమే మిగిలి ఉంటుందా అన్నది అనుమానమే. దేశంలో ఇప్పుడు తెలుగుదేశం, జనతాదళ్(యు) పార్టీల మద్దతుపై ఎన్డీఏ ప్రభుత్వం మనుగడ ఆధారపడి ఉండగా, అత్యధిక ప్రాంతీయ పార్టీలు ఇండియా కూటమికి మద్దతునిస్తున్నాయి. హరియాణా, జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ-ఇండియా కూటమిల మధ్యే పరిమితం కాగా దేశవ్యాప్తంగా ఇక జరిగే ప్రతి ఎన్నికల్లోనూ ఈ ఉభయ కూటముల ఆధిపత్యమే కొనసాగే అవకాశాలున్నాయి. భారత రాజకీయాలు ఇప్పుడు రెండు కూటముల మధ్యే పరిమితమయ్యాయని, ఈ రెండు కూటములకు చెందని పార్టీలు అస్తిత్వ పరీక్షలో ఉన్నాయని చెప్పేందుకు పెద్దగా రాజకీయ పరిశీలన అక్కర్లేదు. అవినీతి, అరాచక పాలన, ఒంటెత్తు పోకడల వల్లే దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు అదృశ్యమయే పరిస్థితిలో పడ్డాయి. వాటి పరిస్థితికి బీజేపీని పూర్తిగా నిందించాల్సిన పనిలేదు. సక్రమంగా పనిచేసే ప్రాంతీయ పార్టీలకు ఎప్పటికీ ఢోకా ఉండదు. అలాంటి పార్టీల మద్దతుపై ఆధారపడినప్పుడే జాతీయ పార్టీలు బుద్ధిగా నడుచుకుంటాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

తరగతుల విభజన అశాస్త్రీయం

నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం సాధ్యమైనంతవరకు ఎనిమిదవ తరగతి, ఆ తర్వాత కూడా మాతృభాషలో చదివే అవకాశం విద్యార్థులకు కల్పించాలి. కనీసం ఐదవ తరగతి వరకైనా మాతృభాషలో చదవాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు ఉన్నత పాఠశాల స్థాయి వరకు కూడా ఆంగ్ల మాధ్యమం లేదా తెలుగు మాధ్యమం ఏది కావాలంటే అందులో చదివే అవకాశం ఉండేది. అయితే గత ప్రభుత్వం ఉన్నపళంగా పాఠశాల విద్యా వ్యవస్థని ఆంగ్ల మాధ్యమ విద్యా వ్యవస్థగ మార్చివేసింది. ఫలితంగా తల్లిదండ్రుల వెన్నుదన్ను లేనివారు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత విద్యార్థులు భారీగా నష్టపోయే విపత్కర పరిస్థితులు ఏర్పడ్డాయి. భాషా మాధ్యమం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో పాలనా సంబంధమైన నియమ నిబంధనలు అధికంగా ఉండడంతో క్రమంగా ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థుల వలస మొదలైంది. ప్రభుత్వ విధానాలు కూడా కొంతవరకు ప్రైవేటు విద్యా విధానాన్ని ప్రోత్సహించేదిగా ఉన్నాయి. ఉదాహరణకు తరగతుల విభజన గమనించినట్లయితే మూడవ తరగతి నుండి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఉండే ఒక సమూహం వచ్చే విధంగా విభజన చేశారు. ఇలాంటి విధానం వలన ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్, ఆ పై స్థాయి వరకు కూడా ఒకే ప్రాంగణంలో ఉండడం వలన తేడా ఉండదు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఒకటి నుండి 5వ తరగతి వరకు కూడా ఒకే ప్రాంగణంలో ఉండడమే ప్రభుత్వ పాఠశాలల్లో సరైన విధానం.

విద్యా వ్యవస్థపై నమ్మకం కుదరాలంటే గుడ్డిగా జరిగిన తరగతుల విభజనను నిలిపివేయాలి. కనీసం ప్రాథమిక స్థాయిలోనైనా గ్రామీణ సామాజిక వాతావరణానికి అనుగుణంగా గతంలో ఉన్నట్లుగానే సరి చేయాలి. ఇప్పుడున్న నూతన విద్యావిధానం ప్రకారం ప్రాథమిక స్థాయిలోనైనా తెలుగు మాధ్యమం ఉండాలనే విషయం సాధ్యమయ్యేపరిస్థితి లేదు. కారణం గత ప్రభుత్వం ఉన్న పళంగ తెలుగు మాధ్యమం నుండి ఆంగ్లమాధ్యమానికి మార్చడమే. మరలా ఇప్పుడు తెలుగు మాధ్యమంలోకి మార్చడం విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. స్థూలంగా చూసినప్పుడు సరైన అవగాహన రాహిత్యం వలన ప్రజల ఆమోదం కూడ ఆంగ్ల మాధ్యమం వైపే ఉంది. ఇటువంటి పరిస్థితులలో ఒకటవ తరగతి నుండి కనీసం మూడవ తరగతి వరకు తెలుగుకు కనీసం 80 శాతం సమయం కేటాయించాలి. అంటే మిగిలిన 20 శాతం విద్యార్థుల తల్లిదండ్రుల విశ్వాసం పొందడం కోసం ఆంగ్ల భాష పరిచయం నెమ్మదిగ చేయాలి. ముద్రణ మాఫియాను పెంచిపోషించడం కోసం అన్నట్లు ఉన్న పుస్తకాలను పూర్తిగ నిలిపివేయాలి. మూడవ తరగతి వరకు కేవలం తెలుగు, సరళంగ ముద్రించిన ఇంగ్లీష్ పుస్తకం మాత్రమే ఉండాలి. గణితానికి సంబంధించిన అంకెలు సంఖ్యల పరిచయం కూడ ఈ రెండు పుస్తకాలలోనే ఉండాలి. మూడవ తరగతితో తెలుగు రాయడం చదవడం నేర్చుకోవడం అయిపోతుంది. నాలుగవ తరగతి నుండి తెలుగుకు 30–40 శాతం సమయం కేటాయించవచ్చు. తెలుగు మాతృభాషగ ఉంటుంది కాబట్టి తరువాత భాష నేర్చుకోవడం అంటూ ఏమీ ఉండదు. కేవలం చదవడం అభ్యాసం చేయడం, దాని నుండి ఇతర విషయాలు నేర్చుకోవడం మాత్రమే. ఐదవ తరగతి నుండి 8వ తరగతి వరకు కూడా పాఠ్యపుస్తకాలన్నీ కూడా ఇప్పటి మాదిరిగానే రెండు భాషలలోను ముద్రించాలి. దానివలన విద్యార్థి నాలుగవ తరగతిలోనే తెలుగు బాగా చదవడం అభ్యాసం చేసి ఉంటాడు కనుక తనకు తానుగ కూడా పాఠాన్ని తెలుగులోను ఆంగ్లంలోను కూడా చదవడం అభ్యాసం చేయవచ్చు. దీనివలన ఉపాధ్యాయులలో లోపించిన ఆంగ్లభాష పరిజ్ఞాన లోపం కూడా కొంతవరకు పరిష్కారం కాగలదు. వీటితో పాటు ఐదవ తరగతి నుండి కూడ విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు స్పోకెన్ ఇంగ్లీష్‌ను కూడా ప్రవేశపెట్టవచ్చు.

– ఆనందనాయుడు వై, ఏలూరు

ఉన్నతవిద్యను చక్కదిద్దేదెప్పుడు?

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం వెనకబడి ఉందని విశ్వవిద్యాలయాలకు ఇటీవల ఎన్ఆర్ఐఎఫ్ ఇచ్చిన ర్యాంకులు వెల్లడిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన రూసా నిధులను రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సద్వినియోగం చేసుకోలేకపోయాయని తేటతెల్లమయింది. ఆ నిర్వాకానికి వైసీపీ ప్రభుత్వమే కారణమంటున్న విద్యావేత్తలు కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తి కావస్తున్నా ఇంకా విశ్వవిద్యాలయాల స్థితిగతులపై శ్రద్ధ చూపడంలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఉన్నత విద్యను గత ముఖ్యమంత్రి భ్రష్టుపట్టించారు. లెక్కలేనన్ని ఉల్లంఘనలతో ఉన్నతవిద్యారంగాన్ని అతలాకుతలం చేశారు. కళాశాల విద్యను సైతం నాశనం చేశారు. ప్రవేశాల్లోను కేంద్రీకృత పద్ధతుల్ని అవలంబించి డిగ్రీ కళాశాలలు మూతపడేటట్టు చేశారు. నియామకాలు చేపట్టలేక నాక్ కమిటీ పర్యటనల్లో చూపించడం కోసం ఎయిడెడ్ వ్యవస్థను నాశనం చేసి, అక్కడ అండర్ గ్రాడ్యుయేట్ తెలుగు మీడియం అధ్యాపకుల్ని తీసుకొచ్చి విశ్వవిద్యాలయాల్లో బోధనకు పెట్టారు. దీంతో వర్శిటీల్లో బోధనంతా గందరగోళంలో పడిపోయింది.

కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖ ఇచ్చిన రూసా నిధుల్ని వైసీపీ ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలూ దుర్వినియోగపరిచాయి. నిధుల వినియోగ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో యూజీసీకి సక్రమంగా సమర్పించకపోవడంతో మంజూరైన నిధులు కూడా విడుదల కాకుండా ఆగిపోయాయి. దీంతో భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు, ఉద్యోగాల్లో నియమించుకున్న తమ అనుయాయులకు అడ్వాన్స్ కింద కోట్ల రూపాయిలు వర్శిటీ నిధుల నుంచి చెల్లించేశారు. నిజానికి రూసా నిధుల నుంచే ఈ చెల్లింపులు చేయవలసి వుంది. ఒక్క ఆంధ్రాయూనివర్శిటీ సెక్యూరిటీ అధికారిగా నియమించుకున్న మహ్మద్ ఖాన్, అతని ఉద్యోగులకే సుమారు కోటి రూపాయిలు చెల్లించారు. ఈ అవినీతిని ఆధారాలతో సహా పత్రికలు వార్తాకథనాలుగా ప్రచురించాయి. ఏ రూపంలోనూ ప్రకటన ఇవ్వకుండా ఎగ్జింక్ట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పేరిట వందల మందిని ఉపకులపతులే ఇష్టానుసారంగా నియమించేసుకున్నారు. ఒక్క ఆంధ్రా యూనివర్శిటీలోనే ఈ బాపతు నియామకాలు వందకు పైగా ఉన్నాయి. యూజీసీ, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ వంటి సంస్థల నియమనిబంధనలు ఉల్లంఘించారు. అయినప్పటికీ ఇంకా ఏ విశ్వవిద్యాలయ ఉపకులపతి మీద విచారణకు ప్రభుత్వం ఆదేశించలేదు. ప్రస్తుతం ఉపకులపతులు తప్ప మిగతా అధికారులంతా గత ప్రభుత్వ హయాంలో నియమితులయినవారే ఇంకా కొనసాగుతున్నారు. ఉన్నత విద్యామండలిలో ఛైర్మన్ ఒక్కరే రాజీనామా చేశారు. మిగతావారంతా పాతవారే. ఫీజు రెగ్యులేటరీ కమిటీలో ఇంకా మార్పు జరగలేదు. అవే పద్ధతులు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల నుంచి డిప్యుటేషన్ మీద ప్రభుత్వ సంస్థల్లోకి వెళ్లిన ఆచార్యులు, అధ్యాపకులు స్కిల్ డెవలప్‌మెంట్, ఉన్నత విద్యామండలి వంటి సంస్థల్లోనే ఇంకా కొనసాగుతూనే వున్నారు. విశ్వవిద్యాలయాల పాలకమండళ్లను మార్చలేదు. వైసీపీ ప్రభుత్వం నియమించిన సభ్యులే ఇంకా పెత్తనం చెలాయిస్తున్నారు.

విశ్వవిద్యాలయాల పునర్విభజన చట్టంలో నిర్దేశించిన ఉమ్మడి పదేళ్ళ కాలవ్యవధి పూర్తయిపోయినప్పటికీ ఇంకా తెలుగు విశ్వవిద్యాలయం, డాక్టర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే ప్రక్రియ మొదలు కాలేదు. కనీసం ప్రత్యేక అధికారుల్ని కూడా ఇంకా నియమించలేదు. అధికార భాషాసంఘానికి అధ్యక్షుడిని నియమించవలసి వుంది. తెలుగు, సంస్కృతం, హిందీ అకాడమీలకు ఛైర్మన్‌లు లేరు. నాలుగేళ్ళ కిందట తెలుగు అకాడమీలో భారీ కుంభకోణం చోటు చేసుకుంది. ఈ విషయాలన్నిటినీ వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌కు కలిగిన నష్టమేమిటో కూటమి ప్రభుత్వం సమీక్షించవలసివుంది. శక్తిమంతమయిన కూటమి ప్రభుత్వం తలచుకుంటే ఇవన్నీ పెద్ద విషయాలు కావు. అయినా ప్రభుత్వం ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదో అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రి తర్వాత అంతటి శక్తిమంతమయిన నాయకుని చేతిలో వున్న మానవ వనరుల మంత్రిత్వ శాఖ సంబంధించిన అంశాల్లో జాప్యం జరుగుతుండటాన్ని విద్యావేత్తలు భరించలేక పోతున్నారు. ఈ నియామకాలన్నీ జరిగి సమగ్రంగా ప్రక్షాళన మొదలయితేనే రాష్ట్రం సాంస్కృతికంగా పరిపూర్ణ సాధనవైపు అడుగులు వేయగలుతుంది.

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు అంటించిన మకిలి నుంచి ఇప్పుడు ప్రక్షాళన జరగాలి. సామర్థ్యాలు, ప్రమాణాలు పెంపొందించుకొని జాతీయస్థాయి ర్యాంకులు సాధించేందుకు ప్రతిభ, అనుభవం గల ఉపకులపతుల్ని సత్వరమే నియమించాలి.



రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఉల్లంఘనలు, అక్రమాల మీద విచారణ చేపట్టవలసిన అవసరం ఎంతో వుంది. ఏపీ విశ్వవిద్యాలయాల చట్టానికి విరుద్ధంగా అవినీతికి పాల్పడి అంతర్ విశ్వవిద్యాలయాల మధ్య శాశ్వత బదిలీలకు పాల్పడ్డారు. దీంతో భవిష్యత్తు నియామకాల భర్తీలో న్యాయపరమైన అడ్డంకులు ఎదురుకానున్నాయి. కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగంలోకి ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను శాశ్వత బదిలీ చేశారు. దీని వెనుక అప్పటి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి చేతివాటం వుందని పాలకమండలి సభ్యులే మీడియాకి చెప్పారు. ఈ ఘటనని అడ్డుపెట్టుకొని కొంతమంది వీసీలు కొన్ని నియమోల్లంఘనలకు పాల్పడ్డారు. జేఎన్‌టీయు విజయనగరం నుంచి తన స్నేహితుడయిన మరో ఆచార్యుడిని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తాత్కాలిక బదిలీ మీద తీసుకొచ్చారు అప్పటి ఏయూ వీసీ ప్రసాదరెడ్డి. ద్రావిడ విశ్వవిద్యాలయంలో రాజకీయ పలుకుబడితో నాన్ టీచింగ్ సిబ్బందికి ఆచార్యులుగా పదోన్నతి కల్పించారు. ఈ నిర్ణయాలన్నీ కేవలం వ్యక్తుల ఆశలకు అనుగుణంగా జరిగినవే తప్ప, సంస్థల అవసరాల కోసం కాదనేది కూడా రుజువయింది. సంబంధిత వ్యక్తుల నుంచి ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ఆయా విశ్వవిద్యాలయాల వీసీలు, రిజిస్ట్రార్లు అవినీతికి పాల్పడి అధికార దుర్వినియోగం చేశారు. వీటి మీద ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విశ్వవిద్యాలయాల్లో వాటి నిధులతోనే వైఎస్సార్ కాంస్య విగ్రహాలు నిర్మింపజేశారు. ఈ విగ్రహాలకు ఉత్సవాలు నిర్వహించడాన్ని ఆనవాయితీగా మార్చేశారు. ఈ విషయంలోనూ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి విద్యావాతావరణాన్ని పరిరక్షించాలి.

గత ఐదేళ్ళుగా రాష్ట్రంలో కొన్ని విశ్వవిద్యాలయాల ఆస్తులు అన్యాక్రాంతమైపోయాయనే చెప్పాలి. విశ్వవిద్యాలయ అవసరాల కోసం దాతలు ఇచ్చిన భూములు లీజులకు ఇచ్చారు. కొన్ని చోట్ల నేతల సిఫార్సులతో భవనాలు నిర్మించి మరీ అయినవారికి అద్దెలకు ఇచ్చేశారు. ఉల్లంఘనలే ఊపిరిగా గత ఐదేళ్ళూ నడిచిన వైసీపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు అంటించిన మకిలి నుంచి ప్రక్షాళన జరగాలి. సామర్థ్యాలు, ప్రమాణాలు పెంపొందించుకొని జాతీయస్థాయి ర్యాంకులు సాధించాలన్నా ప్రతిభ, అనుభవం గల ఉపకులపతుల్ని సత్వరమే నియమించాలి. అప్పుడే రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఎన్ఐటీ, ఐఐటీ, కేంద్ర విశ్వవిద్యాలయాల సరసన చేరుకోగలుగుతాయి.

■ డాక్టర్ జీకేడీ ప్రసాద్



స్థానాలు పదిలం చేసుకుంటున్న వైసీపీ విధేయులు



కమిషనరేట్‌లో కోవర్టులు

అధికారులు మారినా కీలక స్థానాల్లో కొనసాగింపు

- పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా ఓ ఇన్‌స్పెక్టర్ వ్యవహారం
- ఇంటెలిజన్స్‌కు వెళ్లడానికి వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ ప్రయత్నాలు
- సాయం చేస్తున్న 'అశోకచక్రం'

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పోలీసు అధికారులు ఎక్కడా ఆగలేదు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన పనులను తల ఊపుకుంటూ చేశారు. స్వామి భక్తిని ప్రదర్శిస్తూ ప్రత్యర్థులను కేసులతో వేధించారు. కోరుకున్న స్థానాలు ఇవ్వడానికి అధికారులు వెనుకడుగు వేస్తే 'ప్యాలస్' నుంచి పైరవీలు చేయించుకుని సీట్లలో కూర్చుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో.. వైసీపీ ప్రజాప్రతినిధులకు తొత్తులుగా వ్యవహరించిన పోలీసు గ్యాంగ్‌ను మొత్తం ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. ఈ సరెండర్ జాబితా నుంచి తప్పించుకుని కొంతమంది ఇంకా కమిషనరేట్‌లో పాగా వేసుకుని కూర్చున్నారు. అధికారుల ముందు వినయ విధేయతలు ప్రదర్శిస్తూ వారిని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ ఇన్‌స్పెక్టర్లు కమిషనరేట్‌లో 'కీలకంగా' ఉండడం చర్చనీయాంశంగా మారింది.

- (ఆంధ్రజ్యోతి - విజయవాడ)

వినయ విధేయుడు

వెల్లంపల్లి శ్రీనివాసరావు ఎప్పుడు ప్రజాప్రతినిధిగా ఎన్నికైనా పశ్చిమ డివిజన్‌లో ఇంద్రకీలాద్రి చుట్టూ పోస్టింగ్‌లు దక్కించుకునే ఒక ఇన్‌స్పెక్టర్ ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో కమిషనరేట్‌కు వచ్చారు. కొందరు ఇన్‌స్పెక్టర్లు కొద్దిరోజుల క్రితం జరిగిన బదిలీల్లో ఏలూరు రేంజ్‌కు సరెండర్ అయ్యారు. ఇద్దరు మాత్రం విభాగాలు మారి పాతుకుపోయారు. వారిలో ఒక ఇన్‌స్పెక్టర్ కమిషనరేట్‌లో ముఖ్య అధికారి చాంబర్ వద్ద వాలిపోయారు. ఇప్పుడు కమిషనరేట్ మొత్తానికి అంతా తానై వ్యవహరిస్తున్నారని ప్రచారం నడుస్తోంది. పీహెచ్‌డీ రామకృష్ణ కమిషనర్‌గా ఉన్నప్పుడు వైసీపీ నేతలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణుతోపాటు కొంతమంది ఆయనను కలవడానికి వచ్చారు. ఆయన లేకపోయినప్పటికీ కమిషనరేట్‌లో పాతుకుపోయిన సీఐ స్థాయి అధికారి గేటు వద్ద నుంచి వారిని వెంటబెట్టుకుని తీసుకెళ్లి చాంబర్‌లో కూర్చోబెట్టి రాచమర్యాదలు చేశారు. ఇటీవల జరిగిన ఎస్‌ఐల బదిలీల్లో ఈ ఇన్‌స్పెక్టర్‌తోపాటు మరో ఇన్‌స్పెక్టర్ కలిసి తమకు నచ్చిన వారిని కోరుకున్నచోటకు బదిలీ చేయించుకున్నట్టు కమిషనరేట్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. వెల్లంపల్లి శ్రీనివాసరావు తండ్రి చనిపోయినప్పుడు పాడె మోసి ఈ ఇన్‌స్పెక్టర్ రుణం తీర్చుకున్నారు. ఇప్పుడు ఈ ఇన్‌స్పెక్టర్ కన్ను రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పోలీస్‌స్టేషన్‌పై పడింది. రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న స్టేషన్‌కు 'ఆదాయం'లో ఎలాంటి హద్దులు ఉండవు. ఆయనకు రాజకీయంగా ఎలాంటి బ్రేకుల పడకుండా ఒక అధికారి స్వయంగా స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి లైన్ క్లియర్ చేస్తున్నారని పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది.

చెంతకు వచ్చిన స్నేహితుడు

పశ్చిమ డివిజన్‌లో ఐదేళ్లపాటు ఒక్క బదిలీ లేకుండా పనిచేసిన ఇన్‌స్పెక్టర్ ఇప్పుడు కమిషనరేట్‌లో అడుగుపెట్టారు. వెలంపల్లి మంత్రిగా ఉన్నప్పుడు శాంతిభద్రతల స్టేషన్‌లో ఒక ఇన్‌స్పెక్టర్ తిష్ట వేస్తే, ట్రాఫిక్‌లో మరో ఇన్‌స్పెక్టర్ సీటుకు అతుక్కుపోయారు. శాంతిభద్రతల విభాగ ఇన్‌స్పెక్టర్ నెమ్మదిగా కమిషనరేట్‌లో కాలు మోపారు. ట్రాఫిక్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ మాత్రం వన్‌టౌన్‌లో 'పంచవర్ష' ప్రణాళికను అమలు చేశారు. ఐదేళ్లలో ఒక్క బదిలీ లేకుండా వన్‌టౌన్‌ను దున్నేశారు. ఎన్నికల బదిలీల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెకర్ ఏలూరు జిల్లాకు వెళ్లారు. కుటుంబం విజయవాడలోనే ఉందని చెప్పి తిరిగి ఇక్కడికి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొద్దిరోజుల క్రితం కమిషనర్‌ను కలిసి దరఖాస్తు చేసుకున్నారు. పశ్చిమంలో తనతోపాటు అన్ని అంశాల్లోనూ పాలుపంచుకున్న అప్పటి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను కమిషనరేట్‌కు రప్పించుకోవడానికి లైన్ క్లియర్ చేశారు. ఆయన ఇలా దరఖాస్తు చేశారో లేదో వెంటనే లైన్ క్లియర్ అయింది. కమిషనరేట్‌లో రిపోర్టు చేసి వెయిటింగ్‌లో ఉంటూ పోస్టింగ్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈయన స్వస్థలం చిట్టినగర్. స్వస్థలంలో విధులు నిర్వర్తించడం నిబంధనలకు విరుద్ధం. అయినా ఆయన కమిషనరేట్‌లో రిపోర్టు చేయడం గమనార్హం.

అశోక'చక్రం' తిరుగుతోందా?

హోదాలో ఎస్‌ఐ అయినా ఏసీపీ స్థాయిలో వ్యవహరించిన ఓ ఎస్‌ఐ ఇప్పుడు నెమ్మదిగా నిఘా విభాగంలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఈ ఎస్‌ఐ కేటాయించిన స్టేషన్‌లో విధులు నిర్వర్తించకుండా మిగిలిన అన్ని స్టేషన్ల వ్యవహారాల్లో వేలు పెట్టేవారు. చంద్రబాబును ఏసీబీ కోర్టుకు తీసుకువచ్చినప్పుడు, గులకరాయి కేసులో నిందితులను అరెస్టు చేసినప్పుడు అతిగా ప్రవర్తించారు. దక్షిణ మండలంలోని నేరపరిశోధన విభాగంలో పనిచేసే ఆ ఎస్‌ఐను కొద్దిరోజుల క్రితం జరిగిన బదిలీల్లో ఉత్తర మండలానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయనను అధికారులు వీఆర్‌లోకి పంపారు. రెండు రోజుల క్రితం ఏలూరు రేంజ్‌కి సరెండర్ చేశారు. ఆయన చూపు ఇంటెలిజెన్స్‌పై పడింది. ఈ కారణంగానే కమిషనరేట్ నుంచి ఇంకా రిలీవ్ కాలేదని తెలుస్తోంది. నగరంలో తూర్పు నియోజకవర్గంలో ఇంటెలిజెన్స్ ఎస్‌ఐగా పోస్టింగ్ సంపాదించుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ హయాంలో విజిలెన్స్‌లో కీలకంగా పనిచేసి, ఇప్పుడు ఇంటెలిజెన్స్‌లో ఉన్న ఇన్స్‌పెక్టర్ 'అశోకచక్రం' ఈ ఎస్‌ఐను ఇంటెలిజెన్స్‌లోకి రప్పించుకోవడానికి మార్గాలు సుగమం చేస్తోంది.

దుర్గగుడిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి 1992లో దేవదాయశాఖలో చేరారు. ఆ సమయంలో ఆయన సర్వీస్ రిజిస్టర్ (ఎస్ఆర్)లో 'జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కావాల్సిన పదో తరగతి విద్యార్హత మీకు లేదు. కావున ఉద్యోగంలో చేరిన రెండేళ్లలోపు ఈ పోస్టుకు కావాల్సిన విద్యార్హత పొందాల్సి ఉంటుంది' అని నమోదు చేశారు. కట్ చేస్తే.. ఆ ఉద్యోగి తాను 1986లోనే పదో తరగతి పాస్ అయ్యానని ఓ సర్టిఫికెట్ ఇచ్చి ఉద్యోగంలో కొనసాగారు. ఆ తర్వాత 1994లో ఇంటర్మీడియెట్ కూడా పాస్ అయినట్టు మరో సర్టిఫికెట్ కూడా ఇచ్చి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2021లో అప్పటి దుర్గగుడి ఈవో భ్రమరాంబ.. నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వారిలో ఈ ఉద్యోగి ఒకరు. వేటు పడటంతో ఉద్యోగాన్ని కాపాడుకునేందుకు 'నేను 1994లో ఇంటర్మీడియెట్ గుంటూరులో చదివాను. ఆ సర్టిఫికెట్ నకిలీదని తేలింది. ఆ సర్టిఫికెట్ ద్వారా నేను ఎలాంటి పదోన్నతి పొందలేదు' అని వివరణ రాసి ఇచ్చారు. ఆ తర్వాత ఆయనపై సస్పెన్షన్ వేటు ఎత్తేసి మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు.

దేవదాయ నకిలీలపై విజిలెన్స్



దొంగ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, పదోన్నతులు


- దుర్గగుడిలో 10 మందికిపైగా ఫేక్‌లు
- ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ పదుల సంఖ్యలో..
- నకిలీలపై దృష్టి సారించిన విజిలెన్స్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య పదుల్లోనే ఉంటుందని 2019లోనే గుర్తించారు. దీనిపై దేవదాయ శాఖ సూచన మేరకు విజిలెన్స్ రంగంలోకి దిగి నకిలీలపై దృష్టి సారించింది. పక్కాగా ఆధారాలు దొరికిన ఇద్దరు సిబ్బందిని విచారించగా వారు మరికొందరి పేర్లు చెప్పారు. సమగ్ర విచారణ కోసం మరికొందరు ఉద్యోగుల వివరాలు కావాలని విజిలెన్స్ అధికారులు దేవస్థానం అధికారులను కోరారు. అదే సమయంలో రాష్ట్రంలో ఎన్నికలు జరగడం వైసీపీ అధికారంలోకి రావడం. వెలంపల్లి శ్రీనివాస్ దేవదాయశాఖ మంత్రి కావడంతో విజిలెన్స్ విచారణ పక్కదారి పట్టింది. నకిలీలు వెలం పల్లిని ఆశ్రయించడంతో వారి నుంచి భారీగా ముడుపులు తీసుకుని విచారణను అటకెక్కించేశారు. తాజాగా దుర్గగుడితోపాటు దేవదాయశాఖలో నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వహిస్తున్న వారిపై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి నకిలీల విషయం నిగ్గు తేల్చాలని కమిషనర్‌కు సూచించడంతో మరోసారి విజిలెన్స్ అధికారులు రంగలోకి దిగారు. దుర్గగుడిలో పరిపాలనా విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు రాజస్థాన్‌లోని యూనివర్సిటీల నుంచి దొంగ సర్టిఫికెట్లు పొంది వాటి ఆధారంగా పదోన్నతులు కూడా పొందారు. మరికొందరు బిహార్‌లోని యూనివర్సిటీల నుంచి నకిలీ సర్టిఫికెట్లను పొందారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు సైతం పదోన్నతుల కోసం దొంగ సర్టిఫికెట్లు పెట్టినట్లు సమాచారం. వీరందరిపైనా విజిలెన్స్ అధికారులు విచారణ జరిపేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పలువురు ఉద్యోగుల విద్యార్హతల వివరాలు అందజేయాలని దుర్గగుడి అధికారులను కోరినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో పలువురు నకిలీలు..

తిరుమలగిరిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ దేవదాయశాఖ ఉద్యోగిది మరీ చిత్రమైన కథ. సదరు ఉద్యోగి 1980లో పుట్టి.. 1993లో ఉద్యోగంలో చేరినట్లు రికార్డుల్లో నమోదు చేయడం గమనార్హం. అంటే 13 ఏళ్లకే ఉద్యోగం చేరి ఈయన రికార్డు సృష్టించారు. ఈ ఉద్యోగిని 1999లో పర్మినెంట్ చేశారు. ప్రస్తుతం ఈయన గ్రేడ్-3 ఈవో పదోన్నతుల జాబితాలో చోటు సంపాదించుకుని పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. విజయవాడలో గ్రేడ్-2 ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి 18 ఏళ్లు నిండకుండానే దేవదాయశాఖలో చేరిపోయారు. 18 ఏళ్ల 2 నెలల వయసులో జూనియర్ అసిస్టెంట్‌గా రెగ్యులరైజ్ అయ్యారు. ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఈయన సూపరింటెండెంట్ పదోన్నతి జాబితాలో చోటు దక్కించుకున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో బదిలీల జాతర



రేపు విజయవాడలో జోన్-2 బదిలీల కౌన్సెలింగ్

- * ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు జోన్-1 వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఖాళీలు
- * క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎక్కువగా భర్తీ చేయాలని మౌఖిక ఆదేశాలు
- * ఉద్యోగుల కొరత వల్ల మంచినీటి పథకాల అమలుకు తీవ్ర ఇబ్బంది

గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో బదిలీలకు తెర లేచింది. బదిలీల నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఖాళీ పోస్టుల అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. సిబ్బంది కొరత వల్ల మంచినీటి పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయటం కష్టసాధ్యమవుతున్న తరుణంలో సిబ్బంది సంఖ్యను మరింత పెంచాల్సిందిగా ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. జోన్-2 బదిలీలు విజయవాడ సర్కిల్ కార్యాలయం వేదికగా ఈ నెల 29న జరగబోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎక్కువ మంది సిబ్బంది పనిచేసేలా బదిలీలు ఉంటాయా? రాజకీయ సిఫార్సులకు, డబ్బులకు మొగ్గు చూపిస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా బదిలీలు జరిగాయి. బదిలీలు, డిప్యూటేషన్ల అడ్డగోలు వ్యవహారాలతో రూ.కోట్లు చేతులు మారాయి. అక్రమ బదిలీలు కారణంగా చరిత్రలోనే చవిచూడనంత అవినీతి గత ఐదేళ్లలో చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు చార్జ్ ఫ్రేమ్స్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. యూనియన్ల ముసుగులో కూడా నిబంధనలకు విరుద్ధంగా గతంలో బదిలీలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఉద్యోగుల ఐచ్ఛిక బదిలీలకు అవకాశం కల్పించింది. ఆఫీసుల్లో పనిచేయటం వల్ల ఎక్కువమంది అవినీతికి అలవాటు పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆఫీసుల్లోనే ఐదేళ్లకుపైగా పనిచేస్తున్న వారికి ఫీల్డ్‌లో పోస్టింగ్‌లు కల్పించాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. వర్క్ ఎస్టిమేట్లు, కంప్లీషన్ రిపోర్టులు, ఫైనల్ బిల్స్ స్క్రూటినీ వంటి వ్యవహారాల్లో ఎలాంటి రిస్క్ లేకుండా కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు దండుకునేందుకు ఎక్కువగా ఆఫీసుల్లోనే పనిచేయటానికి ఇష్టపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రిస్క్‌లేని ఆఫీసు పోస్టులను ఎంపిక చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాబట్టి క్షేత్రస్థాయిలో సిబ్బంది సంఖ్యను పెంచాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలను బదిలీల కౌన్సిలింగ్‌లో పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరికెక్కడ పోస్టులు కల్పించాలో ముందే సిద్ధం చేశారా?

బదిలీల కౌన్సిలింగ్ నేపథ్యంలో ఎవరికెక్కడ పోస్టింగ్‌లు కల్పించాలన్నది ముందుగానే నిర్దేశితమైందని, కౌన్సిలింగ్ నామమాత్రమన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎక్కువగా ఉపయోగించాలన్న ప్రభుత్వ ఆదేశాలను కూడా ఖాతరు చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి. బదిలీలకు సంబంధించి భారీగా బేరాలు జరిగాయన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ఈ ఆరోపణలలో ఎంత నిజం ఉందనేది బదిలీల కౌన్సిలింగ్ రోజున తేలిపోతుంది.

జోన్-2 పరిధిలో భారీ సంఖ్యలో ఖాళీలు

గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం జోన్-2 పరిధిలో భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఎన్టీఆర్, కృష్ణా, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలు ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఏఈఈల కేటగిరీలో 63 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో ఏఈ మూడేసి మండలాల చొప్పున పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే అత్యధికంగా 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మైలవరం డబ్ల్యూక్యూఎం ల్యాబ్‌లో 1, తిరువూరు 1, తిరువూరు (విస్సన్నపేట) 1, నందిగామ-1, జగ్గయ్యపేట-1, మచిలీపట్నం డీఆర్‌ఈఎం పరిధిలో 2, గుడివాడ డీఆర్‌ఈఎం పరిధిలో అవనిగడ్డ, ఘంటసాల, గన్నవరం, ఉంగుటూరు, మచిలీపట్నం, గూడూరు, పెనమలూరు, ఉయ్యూరులలో 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో డీఈఈలకు సంబంధించి చూస్తే మొత్తం 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోనే 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఐదేళ్లు దాటి ఆఫీసుల్లో పనిచేసే వారి జాబితా ఇదే

ఏఈలకు సంబంధించి చూస్తే క్షేత్రస్థాయిలో కాకుండా గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం, విజయవాడ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఐదేళ్లకుపైగా పనిచేస్తూ కొనసాగుతున్నవారు ఉన్నారు. జోన్-2కి సంబంధించి చూస్తే కల్పన ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 5 సంవత్సరాల 24 నెలలు, ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 2 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆఫీసులోనే ఏకంగా 8 సంవత్సరాల నెలా 24 రోజుల పాటు ఆమె పనిచూస్తూనే ఉన్నారు. ఖాదర్ బాషా ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 5 సంవత్సరాల నెల రోజులు దాటి మరీ పనిచేస్తున్నారు. అనుపమ ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 5 సంవత్సరాల నెల, ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 2 సంవత్సరాల 2 నెలలుగా మొత్తం 7 సంవత్సరాల 3 నెలల పాటుగా ఆఫీసుల్లోనే పనిచేస్తున్నారు. కుశాల్ కుమార్ అనే ఏఈ ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 5 సంవత్సరాల 29 రోజులు, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 11 నెలలు, ఈఎన్‌సీ కార్యాలయంలో 1 ఏడాది 2 నెలలు చొప్పున మొత్తంగా 7 సంవత్సరాల 29 రోజులుగా ఆఫీసులలోనే పనిచేస్తున్నారు. సరోజ అనే ఏఈఈ ఈఎన్‌సీ కార్యాలయంలో గత 5 సంవత్సరాల 16 రోజులకుపైగా ఆమె ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇలా ఆఫీసుల్లో పనిచేసే వారికి క్షేత్రస్థాయిలో పోస్టింగులు ఇవ్వటం చాలా ముఖ్యం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎక్కువ కాలం ఆఫీసుల్లో పనిచేసిన వారికి ఫీల్డ్ లెవల్‌లో స్థానాలు కల్పించాలన్న వాదనలు వస్తున్నాయి.



మిద్దె శ్రీనివాసరావు

సూపర్ మాస్టారు

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు గుడివాడ టీచర్ ఎంపిక

మచిలీపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను గుడివాడలోని ఎస్పీఎస్ మునిసిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావు జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయనను రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనవారికి రూ.50 వేల పారితోషికంతో పాటు, వెండి పతాకాన్ని సెప్టెంబర్ 3వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. వచ్చేనెల 3వ తేదీన ఢిల్లీలోని హోటల్ చాణక్యపురిలో జరిగే అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని విద్దె శ్రీనివాసరావుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆహ్వానం పంపారు.

మిద్దె నేపథ్యమిదీ..

ఎన్టీఆర్ జిల్లా ఎ-కొండూరు మండలం పోలిశెట్టిపాడుకు చెందిన మిద్దె శ్రీనివాసరావు డీఎస్సీ-2000 ద్వారా గుడివాడ ఎస్పీఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. 9, 10వ తరగతుల భౌతిక రసాయనశాస్త్రం, 7వ తరగతి సామాన్య రసాయనశాస్త్రం పాఠ్య పుస్తకాలను ఆయన రచించారు. ఆరు సంవత్సరాల క్రితం శ్రీనిసైన్స్ మైండ్ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉచితంగా టీచర్లకు, విద్యార్థులకు హ్యాండ్‌బుక్స్, స్టడీ మెటీరియల్, లెసన్‌ప్లాన్, ల్యాబ్ యాక్టివిటీ, ప్రాజెక్ట్ వర్క్‌లను అందిస్తూ వస్తున్నారు. బాలికల డ్రాపవుట్స్‌ను తగ్గించేందుకు మూడు లక్షల విలువచేసే స్టడీ మెటీరియల్ ఇచ్చారు. డిస్ట్రిక్ట్ ఆన్ కాస్ట్ కో-ఆర్డినేటర్‌గా రెండు సంవత్సరాలుగా పనిచేస్తూ సైన్స్ సబ్జెక్టు పట్ల అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. రెండుసార్లు జాతీయస్థాయిలో కృష్ణాజిల్లా ప్రాజెక్టులను పంపారు. 2022లో జిల్లాస్థాయిలో, 2023లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆయన ఎంపికయ్యారు.

ఆటోలకు పోలీసు నంబర్లు

- స్టేషన్ల వారీగా నంబర్లు కేటాయింపు
- 31లోగా వివరాలు అందజేయాలి : సీపీ



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : నగరంలో ఎటుచూసినా ఆటోలే కనిపిస్తున్నాయి. ఏ ఆటో నగరం పరిధిలో ఉన్నదో, ఏ ఆటో బయట జిల్లాల నుంచి వచ్చిందో తెలియని పరిస్థితి. రద్దీగా ఉన్న రహదారులపై సరిగ్గా కూడళ్లకు మధ్యలో ఈ ఆటోలు ఆగుతాయి. ముందు వెళ్లవు. వెనుక వాహనాలకు దారి ఇవ్వవు. ఇదీ నగరంలో ఉన్న పరిస్థితి. దీంతోపాటు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ఆటోలకు నంబరింగ్ విధానాన్ని తీసుకొచ్చారు. నగరంలో ప్రయాణికులతో రాకపోకలు సాగించే ప్రతి ఆటోకు ప్రత్యేకంగా ఒక నంబర్‌ను ఇవ్వాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు నిర్ణయించారు. విజయవాడలో మొత్తం 30వేల ఆటోలు ఉన్నాయి. ఇవి కాకుండా కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ఆటోలు నగరంలో తిరుగుతున్నాయి. దీంతో ఇక్కడ ఆటోల సంఖ్య పెరగడంతోపాటు ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరుగుతోంది. ఇప్పటికే నగరంలో ఉన్న ట్రాఫిక్ సమస్యలతో అధికారులు తలలు పట్టుకుంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలకు బ్రేక్ వేయడం ద్వారా ట్రాఫిక్ తలనొప్పులను కొంత వరకు తగ్గించుకోవచ్చన్న అభిప్రాయంలో ఉన్నారు. దీనికి నంబర్లు కేటాయించడమే మేలన్న భావనలో ఉన్నారు. విజయవాడలో ఆటోలను నడుపుతున్న వాళ్లంతా ఆధార్‌కార్డు, ఆర్సీ బుక్ ఫొటోస్టాట్ కాపీలను సంబంధిత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలి. ఈ ధ్రువీకరణపత్రాలను 31వ తేదీలోగా అందజేయాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. దీని ద్వారా ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని ఆటోలు ఉన్నాయో తెలుస్తుంది. వాటికి ట్రాఫిక్ పోలీసులు ఒక నంబరును కేటాయిస్తారు. ఈ నంబరు గల ఆటోలను మాత్రమే నగరంలో తిరిగేందుకు అనుమతిస్తారు. ఈ నంబర్ లేని ఆటోలు నగరంలోకి ప్రవేశిస్తే పోలీసులు జరిమానా విధిస్తారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న సీపీఐ రామకృష్ణ

ప్రజారోగ్య పరిరక్షణకే పాదయాత్ర

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఎ.కొండూరు, ఆగస్టు 27 : ప్రభుత్వం ఎ.కొండూరు కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్రను ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎ.కొండూరు మండలం మరో ఉద్దానంగా మారుతోందని, కృష్ణా నది అతీ సమీపంలో ఉన్నా తాగడానికి గుక్కెడు నీటిని ప్రభుత్వాలు ఇవ్వలేకపోతున్నాయన్నారు. మండలంలో కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. వైసీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు.

ఎమ్మెల్యే సంఘీభావం : నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వారికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. సీపీఐ పాదయాత్రకు ఆయన సంఘీభవ తెలిపారు.



కిడ్నీ వ్యాధికి మరొకరు బలి

గంపలగూడెం : కిడ్నీ వ్యాధితో మరో మహిళ మృతిచెందింది. అనుముల్లంక దళితవాడకు చెందిన వేల్పుల కోటమ్మ (70) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటోంది. వ్యాధి తీవ్రత పెరిగి మంగళవారం మృతి చెందింది. నెల రోజుల్లోనే గ్రామంలో కిడ్నీ వ్యాధితో నలుగురు మృత్యువాత పడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు గ్రామంలో సుమారు 50 మంది వరకు ఉన్నారు.


కలెక్టర్ బాలాజీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న బండి రామకృష్ణ

సెప్టెంబరు 2న 40 వేల మొక్కల పంపిణీ

» జనసేన నేత బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 27 : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నియోజక వర్గంలో 40 వేల మొక్కలు పంపిణీ చేయనున్నట్టు జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబరు 2వ తేదీన మొక్కలు నాటేందుకు ఒక రోజు ముందుగా హిందూ కళాశాల ఆవరణలో మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని విద్యాసంస్థల ఉపాధ్యాయులు తమ ఆవరణలో మొక్కలు ఎన్ని కావాలో లేఖలు ఇచ్చారన్నారు. ఇంటికో మొక్క నాటే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు పవన్ ఇచ్చిన పిలుపు మేరకు మెగా కార్యక్రమం చేపట్టామన్నారు. సపోటా, బత్తాయి, నారింజ, అరటి, జామ, మామిడి, నేరేడు, కొబ్బరి, నిమ్మ, టేకు, పనస, దబ్బ, గులాబి, మందార, నందివర్ధన, సంపంగి, మల్లి, పారిజాతం, సన్నజాజి, కలబంద, కరివేపాకు మొక్కలను అందిస్తామన్నారు. డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామి సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు గడ్డం రాజు, మాదివాడ రాము పాల్గొన్నారు.


ఆమెరికాలో మీట్ అండ్ గ్రేట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల దంపతులు

అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలి

» ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఆగస్టు 27: 20 ఏళ్ల పాటు వెనుకబడిన గుడివాడ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. మంగళవారం అమెరికాలోని అట్లాంటా నగరంలో జరిగిన మీట్ అండ్ గ్రేట్ పేరుతో ఫ్రెండ్స్ ఆఫ్ రాము ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గుడివాడ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ఎన్ఆర్ఐలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్ పెద్ద మలుపు



రైల్వేస్టేషన్, ఆగస్టు 27 : ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్ పథకం ఓ పెద్ద మలుపు అని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు తాజాగా ప్రకటించిన ఏకీకృత పెన్షన్ పథకం వివరాలను మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరం ఈ ఏకీకృత పెన్షన్ విధానం అమలులోకి వస్తుందని తెలిపారు. ఉద్యోగ జీవితంలో ఇదొక గేమ్ ఛేంజర్ అన్నారు. ద్రవ్యోల్బణ సూచిక డీఏ వెసులుబాటు ఉంటుందని, ఉద్యోగి కుటుంబసభ్యులకు ఇది ఆర్థికభద్రతను కల్పిస్తుందని తెలిపారు. కార్మిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక నిపుణులతో విస్తృత సంప్రదింపులు జరిపిన తరువాతనే ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కొత్త పెన్షన్ స్కీమ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏకీకృత పెన్షన్ విధానంలోకి మారవచ్చునని తెలిపారు. ఈ పథకం ద్వారా దాదాపు 23 లక్షల మంది ఉద్యోగులు లబ్ధిపొందుతారని ఆయన పేర్కొన్నారు. విజయవాడ డివిజన్‌లో 18 వేల మంది ఉద్యోగులకుగాను 14 వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కట్టా ఆనంద్ మాట్లాడుతూ, కొత్త పెన్షన్ విధానం నుంచి ఏకీకృత పెన్షన్ విధానానికి మారే అవకాశం ఉందని, ఒకసారి ఎంపిక చేసుకున్న తరువాత ఇక మరల కొత్త పెన్షన్ విధానానికి వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు. బోనస్, సూపర్ యాన్యుయేషన్ గ్రాట్యుటీ అన్నింటిని ఒకేసారి చెల్లిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కొత్త స్కీమ్‌ల విధివిధానాలను, ఉద్యోగులకు లబ్ధి చేకూర్చే అంశాలను స్థూలంగా వివరించారు. సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ ఆఫీసర్ వై.సందీప్, డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, నుస్రత్ ఎం. మండ్రూపకర్ పాల్గొన్నారు.

బీజేపీలోకి వైసీపీ కార్పొరేటర్

వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మంగళవారం బీజేపీ పార్టీలో చేరారు. విజయవాడ గాయత్రినగర్‌లోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ, విజయవాడ అభివృద్ధి కోసం ఎవరు ముందుకు వచ్చినా కూటమి అండగా ఉంటుందని తెలిపారు. కాగా ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమార్, హర్షద్, మాధురి లావణ్యలు ఎంపీ కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరారు.


కార్పొరేటర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పురంధేశ్వరి, సుజనా చౌదరిలు

మత్తు వదిలించండి

» డ్రగ్స్ పేరు వింటేనే ఉలిక్కిపడాలి
» గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై నిఘా పెట్టండి
» రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 27 : సమాజ శ్రేయస్సు దృష్ట్యా మాదక ద్రవ్యాల వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని, గంజాయి రవాణా, అమ్మకాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపి మాదక ద్రవ్యాల పేరు వింటేనే ఉలిక్కిపడేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సృజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా అణిచివేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం వుందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి నిరంతర నిఘా వుంచాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ నార్కోటిక్ క్లబ్‌లు ఏర్పాటు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేసే పెడ్లర్స్‌ను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతటి వారైనా కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమన్నారు. పోలీసు, రెవెన్యూ, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మండలస్థాయిలో బృందాలుగా ఏర్పడి గ్రామాలలోని పాఠశాలలు, కళాశాలల పరిసరాలలో బడ్డీకొట్లు, దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి గంజాయి, మాదక ద్రవ్యాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి మత్తు పదార్థాలను సేవించే 136 హాట్‌స్పాట్‌లను గుర్తించడం జరిగిందన్నారు. కమిషనరేట్ పరిధిలో 1900 సీసీ కెమేరాలు ఏర్పాటు చేయగా వీటిలో 1300 మాత్రమే పని చేస్తున్నాయన్నారు. కళాజాతాల ద్వారా గ్రామాలలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా మాదక ద్రవ్యాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధించే అవకాశం వుంటుందని సీపీ తెలిపారు. సమావేశంలో డీసీపీలు గౌతమి శాలి, కె.ఎం.మహేశ్వరరావు, కె.చక్రవర్తి, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు, విజయవాడ, తిరువూరు, నందిగామ ఆర్డీవోలు బీహెచ్.భవానీశంకర్, కె.మాధవి, ఎ.రవీంద్రరావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.మహేష్, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, డీఈవో యు.వి.సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, ఎక్సైజ్ డీపీఈఓ బి.శ్రీనాథుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి కె.నాగమణెమ్మ, ఉద్యానవన అధికారి బాలాజీ కుమార్, డి ఎడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎస్ఎల్ రాజు, అరవ రమేష్, డాక్టర్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు, హాజరైన వివిధ శాఖల అధికారులు

చవితి పందిళ్లకు ఆన్‌లైన్ అనుమతి

కృష్ణలంక : వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందాలని, రసాయన రహిత విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులకు సూచించారు. చవితి పందిళ్ల నిర్వహణ, విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ మంగళవారం సీపీ రాజశేఖర్‌బాబుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకొనేందుకు చవితి పందిళ్లను ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పోలీసు అనుమతి తీసుకోవాల్సి వుంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పోలీసు, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు అనుమతి మంజూరు చేయాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసుకొనేందుకు కనీసం ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసుకొని వారి వివరాలు గుర్తింపు కార్డులను అందచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ స్థలమైతే స్థల యజమాని నుంచి, ప్రభుత్వ స్థలం అయితే సంబంధిత పంచాయతీ, మున్సిపల్ అధికారుల అనుమతి పొందవలసి వుంటుందన్నారు. విగ్రహం ఎత్తు, బరువు, నిమజ్జనం మార్గం, ఉపయోగించే వాహన వివరాలను ముందుగానే పొందుపరచాలన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య మాత్రమే సౌండ్ బాక్సులను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత మేరకు మట్టి విగ్రహాలు లేదా రసాయన రహిత విగ్రహాలను ఏర్పాటు చేసుకొనేలా నిర్వాహకులు ప్రోత్సహించాలన్నారు. పందిళ్ల వద్ద ఎటువంటి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. షార్ట్ సర్క్యూట్‌లకు తావులేకుండా తనిఖీలు నిర్వహించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా వుంచాలని మత్స్యశాఖ అధికారులను, ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా మండపాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రదేశాలలో క్రెయిన్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

తోటకూర గోపీచంద్‌కు అభినందన

పెనమలూరు, ఆగస్టు 27 : అంతరిక్ష ప్రయాణం చేసిన మొట్టమొదటి సివిలియన్ ఆస్ట్రోనాట్ తోటకూర గోపీచంద్‌ను మంగళవారం మంత్రి పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో అంతరిక్షయాన సాహసయాత్ర చేయడం, అదీ విజయవాడకు చెందిన వ్యక్తి ఈ ఘనతకు కారణం కావడం మనకు గర్వకారణమన్నారు.



గోపీచంద్ నేపథ్యం..

విజయవాడ పోరంకికి చెందిన తోటకూర గోపీచంద్(30)అంతరిక్ష యాత్ర చేపట్టిన మొట్టమొదటి ఇండియన్ సివిలియన్ ఆస్ట్రోనాట్‌గా చరిత్రలోకి ఎక్కారు. గోపీచంద్ ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలో స్కూలింగ్ చేసి యూఎస్‌లో ఎంబ్రీ రిడిల్ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశారు. ఆయన ఎన్నో ఎమర్జెన్సీ, మెడికల్ ఫ్లైట్స్‌లో ప్రయాణం చేశారు. గత మేలో బ్లూ ఆరిజిన్ కంపెనీ నిర్వహించిన ఒక మిషన్‌లో భాగంగా మన భారతదేశ ప్రతినిధిగా అంతరిక్షానికి వెళ్లి వచ్చారు.

నూజివీడులో రైళ్లు ఆపాలి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 27 : నూజివీడు స్టేషన్‌లో మరో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని బాపులపాడు మాజీ జడ్పీటీసీ సభ్యుడు టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వేగిరెడ్డి పాపారావు ఎంపీ వల్లభనేని బాలశౌరిని కోరారు. మంగళవారం గన్నవరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎంపీకి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వినతి పత్రం అందజేశారు. హైదారాబాద్, మద్రాసు, షిర్డీ నగరాలకు వెళ్లేందుకు నూజివీడు స్టేషన్‌లో గోదావరి, హౌరామెయిల్, షిరిడిసాయి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉందని ఎంపీకి వివరించారు. ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే విజయవాడ, ఏలూరు, స్టేషన్ల నుండి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. గోదావరి, హౌరా చెన్నై మెయిల్, షిరిడిసాయి రానుపోను ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నూజివీడు స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తే హనుమాన్‌జంక్షన్, నూజివీడు, గుడివాడ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పాపారావు ఎంపీని కోరారు.

100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళిక



కృష్ణలంక, ఆగస్టు 27 : విస్తృత ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు, ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి శాఖా 100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలను ఖరారు చేసి, లక్ష్యాలను చేరుకొనేందుకు నిబద్ధతతో కృషి చేయాలని కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సృజన, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావులతో కలిసి జిల్లాస్థాయిలో శాఖలు 100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. ఇప్పటికే రూపొందించిన ముసాయిదా ప్రణాళికలపై శాఖల వారీగా చర్చించి చేర్చాల్సిన అంశాలపై మార్గనిర్దేశనం చేశారు. 100 రోజుల్లో పూర్తిచేసే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతో పాటు ఏడాదిలో చేపట్టే పనులకు సంబంధించి ప్రతిపాదనలు, లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో డాక్యుమెంట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొంటూ నిర్దేశించుకొన్న లక్ష్యాలను ప్రణాళికాయుతంగా సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరక్టర్ జి.మహేశ్వరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఈవో యు.వి.సుబ్బారావు, డీవీవో ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు చేయండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిహద్దులతో కూడిన భూమి సర్వే ధృవీకరణ పత్రాలను అందజేయాలని కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో మంగళవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రెవెన్యూ విభాగంలో అర్జీలపెండింగ్, నీటితీరువా వసూళ్లు, భూమి మ్యుటేషన్, కౌలురైతులకు గుర్తింపుకార్డులజారీ, జిల్లాలో చౌకధరల దుకాణాలలో ఉన్న ఖాళీల భర్తీ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మీకోసం కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీలు అధికంగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యల పరిష్కారంపై సరైన ఎండార్స్‌మెంట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. భూమి సమస్యలపై అర్జీలు మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో రెవెన్యూ సదస్సులు జిల్లావ్యాప్తంగా నిర్వహించాల్సి ఉందని, ఈ సదస్సులలో భూమి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వివాదాలులేని భూములకు సంబంధించి సబ్‌డివిజన్ సక్రమంగా చేయాలని సూచించారు. వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకునేందుకు దరఖాస్తులు వస్తే క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు. అనధికార లేఅవుట్లను గుర్తించి ప్లాన్ అప్రూవల్ అధికారులకు, రిజిస్ట్రేషన్ విభాగం అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఈ అంశంపై ఆర్డీవోలు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఓటర్లజాబితాల సవరణ-2025ను షెడ్యూలు ప్రకారం చేయాలన్నారు. అక్టోబరు 18వతేదీలోగా ఇంటింటికీ తిరిగి ఓటర్లజాబితాల పరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. బందరుపోర్టు, డీఆర్‌డీవో, ఏపీఐఐసీ, వివిధ పరిశ్రమలకు భూముల కేటాయింపు తదితర అంశాలలో అధికారులు దృష్టి సారించాలని అన్నారు.


మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

నీటి తీరువాను వసూలు చేయండి

జిల్లాలో నీటితీరువాను వసూలు చేసేందుకు రెవెన్యూసిబ్బంది చొరవ చూపాలని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. కౌలురైతులకు గుర్తింపుకార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె అన్నారు. ఈ-క్రాప్‌తోపాటు, ఈకేవైసీనికూడా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. డీఆర్వో శ్రీదేవి, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం వాణి, పద్మావతి, డి.రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ తోట సతీష్, కలెక్టరేట్ ఏవో సీహెచ్ ఆంజనేయులు, తహసీల్దార్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బదిలీల జాతర!

» సి'ఫార్సు'లకోసం నేతలచుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణ

పామర్రు : కూటమి ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపడంతో ఉద్యోగుల్లో సిఫార్సుల టెన్షన్ మొదలైంది. ఈ మేరకు బదిలీలకోసం తమవంతు ప్రయత్నాలు ప్రారంభించేశారు. ఉద్యోగులు వారు కోరుకున్న చోటకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో జిల్లావ్యాప్తంగా రాజకీయ పైరవీలు ఊపందుకున్నాయి. ఉద్యోగులు, సిబ్బంది ఎవరిస్థాయిలో వారు ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. తమ బదిలీ దరఖాస్తులతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫార్సుల లేఖలను జతచేసి ఇచ్చే పనిలోపడ్డారు. ప్రజా ప్రతినిధులు కూడా తమకు అనుకూలంగా ఉండే వారిని తెచ్చుకుంటే సహాయకులుగా ఉపయోగపడతారనే అభిప్రాయంతో ఉన్నారు. అవసరమైన వారికి తక్షణమే సిఫార్సు లేఖలను అందిస్తున్నారు. బదిలీల్లో ఎటువంటి ఫిర్యాదులు, ఆరోపణలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శంగా వ్యవహరించాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. గడువు తక్కువ ఉండటంతో సిఫార్సులకోసం ఉద్యోగులు, అధికారులు హైరానా పడుతున్నారు. బదిలీలా జాతరలో ఎవరి ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వెచిచూడాలి. ఉద్యోగుల బదిలీల వ్యవహారం కూటమి నేతలకు పెద్ద తలనొప్పిగా మారిందనే వాదన వినవస్తోంది. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన వారికి సైతం సిఫార్సులు చేస్తున్నారని నేతల్లో భేదాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయం కూలీలు.. రాత్రి వేళ దొంగలు!



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 27 : వారంతా వ్యవసాయ కూలీలు.. కూలీ పని చేస్తూనే మరోవైపు జల్సాల కోసం దొంగతనాలు చేస్తుంటారు. పంటలు సాగుకు బావులు, వాగులు, చెరువులపై ఏర్పాటుచేసిన మోటార్లను ఉదయం పూట గమనించి రాత్రికి ఎత్తుకెళ్తుంటారు. ఈ ముఠాను తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.

» ఉదయం చూస్తారు.. రాత్రికి ఎత్తుకెళ్తారు
» వ్యవసాయ మోటార్ల చోరీ ముఠా అరెస్ట్
» నిందితుల్లో ఎన్టీఆర్ జిల్లా వాసి
» రూ.10 లక్షల నగదు, 31 మోటార్లు స్వాధీనం

ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీసులు మండలం కల్మలచెర్వు రోడ్డులో పరెడ్డిగూడెం వద్ద వాహనాల తనిఖీల సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన కూలీపని చేసే ఉప్పతల వాసు, మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన వేముల కోటేశ్వర్‌రావు కలిసి బైక్‌పై మఠంపల్లి వైపు నుంచి గరిడేపల్లి వైపు వెళ్తున్నారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.5లక్షలు లభించాయి. స్టేషన్‌కు తరలించి తమదైనశైలిలో విచారించగా ఏడాదిగా వారితో పాటు మఠంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన కూలీ పని చేసే ఆకారపు వెంకటి, మఠంపల్లి మండలం సుల్తాన్‌పురతండాకు చెందిన కూలీ పనిచేసే అజ్మీర మంత్రియలతో కలిసి హుజూర్‌నగర్, చిలుకూరు, గరిడేపల్లి, పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెర్వు మండలాల పరిధిలో బావులు, చెరువులు, కుంటలు, వాగులపై ఏర్పాటుచేసిన వ్యవసాయ మోటార్లను చోరీ చేస్తున్నట్టు అంగీకరించారు. అదేవిధంగా మోటార్లను ఎత్తుకెళ్లే వీలులేనిచోట్ల మోటార్లలో కాపర్ వైర్‌ను చోరీ చేసి వాటిని ఆటోలో మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన పాత ఇనుము వ్యాపారం చేసే గడగంట్ల శ్రీనుకు వద్ద విక్రయిస్తుంటారు. కాపర్ వైరు విక్రయించగా వచ్చిన రూ.10లక్షలను నలుగురు వ్యక్తులు పంచుకున్నారు. ఇలా తమ వాటాగా వచ్చిన రూ.5 లక్షలు తీసుకుని వెళ్తుండగా పట్టుబడినట్టు ఎస్పీ తెలిపారు. వారిచ్చిన సమాచారంతో పోలీసులు ఆకారపు వెంకటి, అజ్మీర మంత్రియలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3.81లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన పాత ఇనుము వ్యాపారి శ్రీను వద్ద రూ.1.20లక్షల నగదుతో పాటు రూ.4.34లక్షల విలువైన 31 విద్యుత్ మోటార్లను, ఒక ఆటో, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫైఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్టు వెల్లడించారు. కాగా నిందితుల్లో ఉప్పతల వాసుపై ఆంధ్రప్రదేశ్‌లోని వత్సవాయి పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం తరలింపు కేసు, ఆకారపు వెంకటిపై మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు, గడగంట్ల శ్రీనుపై రేషన్ బియ్యం అక్రమంగా తరలించే కేసులు గతంలో నమోదైనట్టు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు, గరిడేపల్లి ఎస్ఐలు చలగంటి నరేష్, ఈట సైదులు, సిబ్బంది నాగరాజు, రామారావు, శంభయ్య ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న మోటార్లు

దర్జాగా కబ్జా!

» ప్రభుత్వ స్థలంలో టిఫిన్ సెంటర్..
» స్థానిక వైసీపీ నేత చేతివాటం

విద్యాధరపురం : ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తారు. ప్రభుత్వ స్థలాన్ని సొంతం చేసుకున్న ఓ వైసీపీ నేత సదరు స్థలంలో ఏకంగా టిఫిన్ సెంటర్ పెట్టించి సొమ్ము చేసుకోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా టిఫిన్ సెంటర్

వివరాలలోకి వెళితే.. విద్యాధరపురం, రావిచెట్టు సెంటర్, జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్థానిక వైసీపీ నేత కబ్జా చేశాడు. సదరు స్థలంలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసి అద్దెకు ఇవ్వడం వివాదాస్పదమైంది. కృష్ణా పుష్కరాలను పురస్కరించుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు చేపట్టింది. దీనిలో భాగంగా నష్టపోయిన స్థల యజమానులకు పరిహారం చెల్లించింది. అయితే రావిచెట్టు సెంటర్ సమీపంలో సుమారు 45 గజాల ప్రభుత్వ స్థలంలో ఉన్న నిర్మాణాన్ని వైసీపీ నేత ఆక్రమించడమేకాక గత ఎన్నికల సమయంలో అందులో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశాడు. కోడ్ సందర్భంగా స్థానికులు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయటంతో కార్పొరేషన్ అధికారులు కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. ఈ క్రమంలో సదరు భవనాన్ని హోటల్‌కి అద్దెకు ఇచ్చాడు. సుమారు రూ.50 లక్షల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే సంబంధిత అధికారులు చోద్యంచూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకుని డివిజన్ ప్రజల అవసరాల నిమిత్తం వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.95

వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ



గవర్నర్‌పేట: కార్మిక నాయకుడు అప్పల నరసయ్య 27వ వర్ధంతిని పురస్కరించుకుని మహంతి అప్పలనరసయ్య, మహాలక్ష్మి (ఎంఏఎం) ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సీతారామపురంలోని ట్రస్ట్ కార్యాలయం వద్ద వృద్ధులకు, కార్మికులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు కుటుంబ సభ్యులు వెంకట గౌతమి, తేజ, ట్రస్ట్ సభ్యులు దూండీ రాంప్రసాద్, దాలినాయుడు పాల్గొన్నారు. 100 మంది పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేసినట్లు మహంతి వాసు తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● బొండా ఉమాకు టీఎన్‌టీయూసీ వినతి



బొండా ఉమాకు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 27 : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెంట్రల్ టీఎన్‌టీయూసీ నేతలు మంగళవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ఉమాను కలసిన నేతలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. వారి సమస్యలపై స్పందించిన బొండా ఉమా రవాణా శాఖ డీటీ, నగర పోలీసు కమిషనర్‌లకు ఫోన్ చేసి ఆటో డ్రైవర్లపై భారాలు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు టీఎన్‌టీయూసీ నేతలు తెలిపారు. బొండా ఉమాకు వినతిపత్రం అందజేసిన వారిలో గరిమెళ్ల చిన్నా, కరణం సుబ్రహ్మణ్యం, ముని అప్పలస్వామి, దండూరి శ్రీను, భీమన ఆంజనేయులు, ఎన్. అప్పలనాయుడు, ఎన్. రవి, పార్థు నాయుడు, పాపిశెట్టి శివయ్య, హరిప్రసాద్, హరీష్, విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే టిడ్కో గృహాలను అందిస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రామలింగేశ్వరనగర్, ఆగస్టు 27: 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన టిడ్కో గృహాలను త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం 17వ డివిజన్‌లో పర్యటించిన ఆయన స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమకు టిడ్కో గృహాలు ఎప్పుడిస్తారని అడుగగా అందుకు స్పందించిన ఆయన మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో టిడ్కో గృహాలకు పట్టిన గ్రహణం వీడనుందని, త్వరలోనే గృహాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి వాటిని అందజేస్తామని తెలిపారు. డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, ముని పోలిపల్లి, మొకర వెంకటరమణ, సునాభి తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న గద్దె రామ్మోహన్

రాగూర్ రోడ్డులో గద్దె పర్యటన

ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాలు చూపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ రాగూర్ రోడ్డులో పర్యటించిన ఆయన స్థానికంగా ఉన్న డ్రెయినేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రెయినేజీ సమస్యపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి పరిష్కారిస్తామని, అపార్టుమెంట్ ప్లాట్ల సమస్యలపై కూడా కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. గాదిరెడ్డి అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



చరిత్రశాఖ విభాగాధిపతి డాక్టర్ ప్రకాశం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు

భారతీనగర్, ఆగస్టు 27: ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. చరిత్రశాఖ విభాగాధిపతి డాక్టర్ ప్రకాశం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పద్మనాభం, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాన్ సుకుమార్, అధ్యాపకులు డాక్టర్ కొల్లేటి రమేష్, ఉమా తరంగిణి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయ విధానంపై రైతులకు వర్క్‌షాప్

పటమట, ఆగస్టు 27 : వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు, సమీకృత వ్యవసాయ విధానంపై రైతులకు స్టెల్లా కళాశాల వ్యవసాయక్షేత్రంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సిస్టర్ కులరేఖలు మంగళవారం ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా లీనా మాట్లాడుతూ నూతన వ్యవసాయ విధానం ద్వారా నూతన వంగడాలు, పనిముట్లు, ఎరువులు గురించి చిన్నకారు, సన్నకారు రైతులకు సమీకృత వ్యవసాయం ఏ విధంగా తోడ్పడుతుందో తెలియజేయడానికి ఈ వర్క్‌షాపు ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ, గ్రామీణశాఖాధిపతి డాక్టర్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ పెద్ద పెద్ద పెట్టుబడులు పెట్టలేని చిన్న, సన్నకారు రైతులు ఈ సమీకృత లేదా మిశ్రమ వ్యవసాయం ద్వారా ఒకేసారి దిగుబడి పెరగడమే కాకుండా ఆదాయం కూడా అధిక మొత్తంలో పొందవచ్చునన్నారు. సాగు పద్ధతులను వివరించారు. ఈ వర్క్‌షాప్‌కు రైతులు, వ్యవసాయ అధికారులు, సిస్టర్ ఇన్నాసియా, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషా కుమారి, ఇంటర్ వైస్‌ప్రిన్సిపాల్ స్వప్న పాల్గొన్నారు.



వరి చేలో నాట్లు వేస్తున్న స్టెల్లా విద్యార్థినులు

స్విమ్మింగ్‌లో మానసకు పతకాలు



చిట్టినగర్, ఆగస్టు 27: పల్నాడు జిల్లాలో ఇటీవల జరిగిన 10వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్-2024 స్విమ్మింగ్ పోటీల్లో కేఎల్ రావు పార్కు స్విమ్మింగ్ పూల్ విద్యార్థిని మానస ఫ్రీ స్టైల్ విభాగంలో రెండు బంగారు, ఒక వెండి మెడల్ సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం కేఎల్ రావు పార్కు స్విమ్మింగ్ పూల్‌లో మానసను పలువురు తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు, కోచ్ రఫీ అభినందించారు.

లయోలాలో వ్యవస్థాపక నైపుణ్యంపై అవగాహన సదస్సు

భారతీనగర్, ఆగస్టు 27: లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కళాశాల సెమినార్ హాల్‌లో వ్యవస్థాపక నైపుణ్యం అంశంపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో లయోలా కళాశాల పూర్వ విద్యార్థి, ఏఎన్‌కె, ఏహెచ్‌ఏ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొడక్ట్ మేనేజర్ డి.రాహుల్ కిరణ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు వ్యవస్థాపక నైపుణ్యం ఏవిధంగా పెంపొందించుకోవాలో, స్టార్టప్‌లు ఎలా ప్రారంభించాలో, దానికి కావాల్సిన వనరులు ఎలా సమీకరించుకోవాలనే అంశాలను వివరించారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజి రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ఎంబీఏ విభాగాధిపతి విజయ్‌కుమార్, ఎన్ఏఏసీ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ క్యాండీ డి కన్నా, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్టి కొట్టే పోటీల్లో సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఫస్ట్

మొగల్రాజపురం, ఆగస్టు 27: ఇస్కాన్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొట్టే పోటీల్లో సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. వరుసగా మూడో సంవత్సరం కూడా ప్రథమ బహుమతి సాధించి హ్యాట్రిక్ కొట్టినందుకు విద్యార్థులను కళాశాల పీడీ వినయ్‌శేఖర్‌ను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్వేతలను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కళాశాల సిబ్బంది అభినందించారు.

ఈసెట్‌పై అవగాహన

లబ్బీపేట, ఆగస్టు 27: నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఈసెట్‌పై సంస్థ ప్రాంగణంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిమేధా విద్యా సంస్థ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ మాట్లాడుతూ ఈసీఈ, సీఎస్ఈ, సివిల్ బ్రాంచ్‌లలో 98శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, పేదవిద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ క్లాసులు చెప్పడమే కాకుండా స్టడీ మెటీరియల్స్ కూడా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెటీరియల్స్ అందజేశారు.

నవీన్ కుమార్‌కు క్రైస్తవ రత్న అవార్డు



అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 27: నగరానికి చెందిన నేషనల్ క్రిస్టియన్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి. నవీన్‌కుమార్ క్రైస్తవ రత్న అవార్డు అందుకున్నారు. నేషనల్ క్రిస్టియన్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 22న ఢిల్లీలో నిర్వహించిన జాతీయ క్రిస్టియన్ ఎంట్రప్రెన్యూర్ అండ్ ఇన్వెస్టర్స్ మీట్ సదస్సులో కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రామ్‌దాస్ అథేవాలే చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని నేషనల్ క్రిస్టియన్ బోర్డు కార్యాలయంలో అవార్డు గ్రహీత నవీన్‌కుమార్‌ను పలువురు క్రైస్తవ పాస్టర్స్ ఘనంగా సత్కరించారు. బోర్డు రాష్ట్ర కోశాధికారి వై. శేఖర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ఏ. చింతయ్య, బి. సందుర్‌పాల్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

పాయకాపురం, ఆగస్టు 27 : మత్తు పదార్థాలతో యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్. జాకబ్ రాజు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్-3లో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న మహిళలు

భారతీనగర్, ఆగస్టు 27: ఎన్టీఆర్ కాలనీలోని శ్రీకోదండ సీతారామాంజనేయస్వామి, శ్రీవిజయ కార్య సిద్ధి గణపతి ఆలయంలో రామాయణం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధినేత రామాయణం నాగసత్యం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి కాలనీలోని యువతీ, యువకులు ఈ వేడుకలలో పాల్గొని కృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టి మహోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాయణం నాగసత్యం శ్రీకృష్ణాష్టమి ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో మొవ్వా నరేంద్రబాబు, చనుమోలు సురేష్, గోలి రవీంద్ర, మండవ వెంకటేశ్వరరావు, సుంకర రాజేష్, నల్లూరిసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

● శ్రీరామచంద్ర నగర్ కాలనీలోని శ్రీ రామ ధ్యాన మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కాలనీ పెద్దలు సీతారామయ్య చౌదరి, కోటేశ్వర రావు, కొండయ్య, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 27 : వడ్డెర కాలనీకి చెందిన వివాహిత గుంజా భూలక్ష్మి సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల ప్రకారం సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన గుంజా భూలక్ష్మి(23), గుంజా శ్రీనివాస్‌కు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. గత కొంత కాలంగా శ్రీనివాస్ మద్యానికి బానిసై భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా భర్త వేధింపుల కారణంగానే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



వన్‌టౌన్, ఆగస్టు 27: అనారోగ్యంతో మరణించిన టీడీపీ కార్యకర్త ఎర్రరాజు కుటుంబానికి పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది 51వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎండీ జాహిద్‌తో కలిసి మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు కూటమి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీనియర్ నేషనల్ పవర్ లిఫ్టింగ్‌లో చంద్రకళకు పతకాలు



విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 27 : కోల్‌కతాలో ఇటీవల జరిగిన ఇంటర్ స్టేట్ సీనియర్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన పవర్ లిఫ్టర్ బొలినేని చంద్రకళ నాలుగు పతకాలతో సత్తా చాటారు. సీనియర్ కేటగిరి వెయిట్ ఫ్లస్ 84 కేజీల విభాగంలో స్క్వాట్‌లో రజతం, 110 కిలోల బెంచ్ ప్రెస్‌లో (నాలుగోస్థానం), డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోల బరువెత్తి కాంస్యం, ఓవరాల్‌గా 547 కిలోల బరువెత్తి కాంస్యం చంద్రకళ సాధించింది. ఇంటర్ స్టేట్‌లో రజతం వశం చేసుకొంది. దీంతో రెండు రజతాలు, రెండు కాంస్యాలను ఆమె సాధించారు. చంద్రకళను కోచ్, జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ నరేంద్ర, సౌత్ ఇండియా పవర్‌లిఫ్టింగ్ సెక్రటరీ ఎస్. కోటేశ్వరరావులు అభినందించారు.



హెల్మెట్ ధరించాలంటూ పాదయాత్ర చేస్తున్న డీసీపీ హరికృష్ణ, పశ్చిమ ఇన్‌చార్జి ఏసీపీ, సీఐలు



హెల్మెట్ ధరించి వాహనాలపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ పాదయాత్ర

వన్‌టౌన్, ఆగస్టు 27: వాహనదారుడు హెల్మెట్ ధర్మించటం రక్షణ కవచం వంటిదని డీసీపీ టి. హరికృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం డీసీపీ టి.హరికృష్ణ ఆధ్వర్యంలో భవానీపురం స్వాతిరోడ్డులో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ హరికృష్ణ మాట్లాడుతూ వాహనదారుడు క్షేమంగా గమ్యస్థానానికి చేరాలంటే హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అనంతరం స్వాతి రోడ్డులో పోలీసు అధికారులు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. వెస్ట్ ఇన్‌చార్జి ఏసీపీ రాజారావు, సీఐలు ఉమామహేశ్వరరావు, గురుప్రకాష్, బాల రాజాజీ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీలో ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీజీ కోర్సుల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



అర్హత వివరాలు: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. పీజీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక వివరాలు: ఐకార్ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)/ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్(ఏఐసీఈ) స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏఐఈఈఏ స్కోర్‌కు 70%, అకడమిక్ ప్రతిభకు 30% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం అకడమిక్ ప్రతిభకు 30%; ఏఐఈఈఏ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు 70% వెయిటేజీ ఇస్తారు.
- డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ మార్కులకు 10%, పీజీ మార్కులకు 30%, ఐకార్ ఏఐసీఈ స్కోర్‌కు 50%, ఇంటర్వ్యూకి 10% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** సెప్టెంబరు 18 నుంచి 23 వరకు
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 24
- **పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు:** సెప్టెంబరు 24 నుంచి 27 వరకు
- **ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** అక్టోబరు 8
- **ఫిజికల్ కౌన్సెలింగ్:** అక్టోబరు 9
- **వెబ్‌సైట్:** angrau.ac.in

దిక్సూచి

Adani Gyan Jyoti

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility: Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only. Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.

- Applicants must have passed their higher secondary/pre-university/ intermediate/ CBSE/ ISC or equivalent board exams after 2023.
- Admission must be based on the merit rank from state or national-level entrance exams.
- Family income must not exceed INR 4,50,000 per annum from all sources.

Prizes & Rewards: Up to INR 3,50,000 (tuition fee) annually.
Last Date to Apply: 07-10-2024
Application mode: Online application only
Short Url: www.b4s.in/aj/AGSP5

Reliance Foundation Postgraduate

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility:

- Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences
- Must have secured 550 to 1,000 in the GATE examination

OR

- Must have scored 7.5 or above in their undergraduate CGPA (or 7.5% normalized to CGPA) [If students have not attempted GATE]
- Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree
Last Date to Apply: 06-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RFS10

SCHOLARSHIP ALERT

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the postgraduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000
Last Date to Apply: 04-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/HDFC54

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PlPo4nXలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

'అమ్మ' అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా

- నటి రేవతిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సిద్ధిఖీ
- మీడియా ఆజ్యం పోస్తోంది కేంద్రమంత్రి సురేశ్ గోపి

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో మలయాళ చిత్రసీమ మరింత వేడెక్కుతోంది. ఆరోపణలతో మొదలై విమర్శలు, ఖండనలు, రాజీనామాలను దాటి వ్యవహారం కేసుల దాకా వెళ్లింది. మంగళవారం మరికొందరు నటీమణులు 'మీటూ' అంటూ ముందుకొచ్చారు. మల్లూవుడ్‌లో తాము ఎదుర్కొన్న వేధింపులను వారు బయటపెట్టగా, ఆధారాలు చూపాలంటూ వారిపై ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు ఎదురుదాడికి దిగారు. ఈ పరిణామాలతో కీలక స్థానాల్లో ఉన్న సినీ ప్రముఖులు సైతం ఆరోపణలకు సమాధానం చెప్పలేక తమ పదవులను త్యజిస్తున్నారు. ఇన్నాళ్లూ చక్కటి అభిరుచితో సినిమాలను తెరకెక్కిస్తూ జాతీయ స్థాయిలో ఖ్యాతిని కూడగట్టుకున్న మలయాళ సినిమా ఇప్పుడు మహిళలపై వేధింపులతో వార్తలతో అపఖ్యాతి మూటగట్టుకుంటోందనేది సగటు ప్రేక్షకుడి ఆవేదన.







మూవీ ఆర్టిస్ట్ అసోషియేషన్ రద్దు

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ నేపథ్యంలో నటుడు మోహన్‌లాల్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమ్మ(అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కీలక వ్యక్తులపై లైంగిక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నైతిక బాధ్యతగా ఆయనతో పాటు మరో 17 మంది సభ్యులు తమ పదవులకి రాజీనామా చేశారు. అలాగే, ఈ చిత్రమండలిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, లైంగిక ఆరోపణల నేపథ్యంలో.. ఇటీవలే దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవి నుంచి వైదొలిగారు. నటుడు సిద్ధిఖీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. తన పరువుకు భంగం కలిగించారని నటి రేవతిపై ఆయన కేరళ డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. మలయాళ చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర మంత్రి సురేశ్ గోపి స్పందించారు. "చిత్ర సీమలో వస్తున్న లైంగిక ఆరోపణల గురించి మీడియా చేస్తున్న ప్రచారం ప్రజలని తప్పుదోవ పట్టిస్తోంది. స్వలాభం కోసం మీడియా ఇలా వాస్తవాలు తెలియకుండా ప్రచారం చేయడం సరికాదు" అని ఆయన అభిప్రాయపడ్డారు.

ముఖం చూపించి మాట్లాడు

నటుడు, 'అమ్మ' జాయింట్ సెక్రటరీ బాబూరాజ్‌పై ఓ జూనియర్ ఆర్టిస్ట్ ఇటీవలే లైంగిక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను ఆయన మంగళవారం ఖండించారు. "ఎవరైతే నాపై ఆరోపణలు చేశారో.. ముఖం చూపించి మాట్లాడాలని సవాలు విసురుతున్నాను" అని పేర్కొన్నారు. అయితే ఇటీవలే ఓ జూనియర్ ఆర్టిస్ట్ బాబూరాజ్‌పై ఆరోపణలు చేశారు. "బాబూరాజ్.. నన్ను ఓ సినిమాలో ఎంపిక చేశానని.. నా పాత్ర కోసం చర్చించడానికి దర్శకులు, నిర్మాతలు వస్తున్నారని.. తన ఇంటికి పిలిచాడు. తన మాటలు నమ్మి నేను వెళ్లాను. కాసేపటికి ఆయన.. సినిమాలో నీ పాత్ర కోసం చర్చలు జరుగుతున్నాయి.. కాసేపు విశ్రాంతి తీసుకోమ్మని ఓ రూమ్ చూపించారు. నేను రూమ్‌లో ఉండగా బాబూరాజ్ బలవంతంగా లోపలికి దూసుకొచ్చి నాపై లైంగిక దాడి చేశారు" అని ఆ జూనియర్ ఆర్టిస్ తన పేరు వెల్లడించకుండా సోషల్ మీడియాలో ఆరోపించారు.

బెంగాలీ ఇండస్ట్రీలోనూ...

మలయాళ పరిశ్రమలోనే కాదు బెంగాలీ చిత్రసీమలోనూ మహిళలపై వేధింపులు ఉన్నాయని నటి రితాభరి చక్రవర్తి ఆరోపించారు. "నాతోటి నటీమణులు, దర్శక, నిర్మాతలు, హీరోల చేతిలో వేధింపులను ఎదుర్కొన్నారు. బెంగాలీ చిత్రసీమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. జస్టిస్ హేమ కమిటీలాంటిదే ఇక్కడా ఏర్పాటు చేయాలి" అని రితాభరి సోషల్‌మీడియాలో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు.

నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలి



'ఇంతకుముందు ప్రమోషన్స్‌కు కూడా సమయం కేటాయించాలనే ఆలోచన ఉండేది కాదు. కంటెంట్ సినిమాను చూసుకుంటుందని అనుకొనేవాణ్ణి. అది నిజమే అయినా సినిమాను ప్రేక్షకుల దగ్గరకు చేర్చడం మన బాధ్యత. రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవారికి సినిమా గురించి ఆటోమేటిక్‌గా తెలుస్తుంది. రెగ్యులర్‌గా ఫాలో కాని వారు, ఇతర పనుల్లో బిజీగా ఉండేవారికి కూడా సినిమా సమాచారాన్ని అందించాలంటే ప్రమోషన్స్ పెద్ద స్థాయిలో చేయాలి. సినిమాను చూడాలనే ఆలోచన వారికి కలిగించాలి' అన్నారు నాని. ఆయన హీరోగా నటించిన 'సరిపోదా శనివారం' చిత్రం గురువారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నాని మీడియాకు వెల్లడించిన చిత్ర విశేషాలివి.

- ఈ సినిమాలో పాయింట్ చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది. సాధారణంగా నా సినిమాలన్నింటిలో తెలియని బరువుని నేనే మోస్తుంటాను. కానీ ఈ సినిమాలో ఎస్.జె. సూర్య, వివేక్ ఆ బరువు మోశారు. నేను కొంచెం బ్యాక్‌సీట్ తీసుకున్నా. పెర్ఫార్మెన్స్ పరంగా సూర్య, ప్రియాంక, మురళీశర్మ.. ఇలా అందరిపై భారం ఉంది.
- ఈ సినిమాలో సూర్య పోషించిన పాత్రకు ఆయన తప్ప మరో ఛాయిస్ లేదు. అద్భుతంగా నటించారు. నా ప్రతి సినిమాకూ దర్శకుడి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌లా పని చేస్తాను. నా నిర్మాతలందరూ హ్యాపీగా ఉండాలని కోరుకుంటాను. సినిమా రిలీజైన తర్వాత అందరూ హ్యాపీగా ఉన్నారని తెలిస్తే సక్సెస్ అయ్యానని ఫీలవుతా.
- ఈ సినిమాకు 'సరిపోదా శనివారం' అని పేరు పెట్టడానికి ఎమోషనల్ రీజన్ ఉంది. నా ఫేవరేట్ మూమెంట్ అది. సినిమా ప్రారంభమైన ఐదు నిముషాలకు వస్తుంది. స్క్రీన్‌ప్లే, నేరేషన్ చాలా ఎక్సయిటింగ్‌గా ఉంటుంది.

ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం



రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మించారు. దర్శకుడు మారుతి సమర్పకుడు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'శివసాయి సినిమాను డీల్ చేసే విధానం అద్భుతంగా ఉంది. నిర్మాత కిరణ్ ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో సపోర్ట్ చేశారు. మారుతితో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో తీరింది. ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం ఇది' అన్నారు. 'వినాయకచవితి రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. పొద్దున్నే పూజ చేసుకుని సాయంత్రం సినిమాకి వచ్చేయండి' అని కోరారు దర్శకుడు శివసాయి. మంచి సినిమా చూశామనే నమ్మకం ఉందనీ, అందరికీ నచ్చుతుందని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

ఆ కళలో ఆరితేరలేదు



నా సినిమాలకు విస్తృత ప్రజాదరణ లభించేలా ప్రచారం చేసే కళలో నేను నిష్ణాతుణ్ణి కాను అని జాతీయ ఉత్తమ నటుడు, కన్నడ హీరో రిషబ్ శెట్టి అన్నారు. ఆయన స్వీయ నిర్మాణంలో రూపొందిన చిత్రం 'లాఫింగ్ బుద్ధ'. ఈ చిత్రం శాటిలైట్, ఓటీటీ బిజినెస్ పూర్తిగా నిరాశపరిచిందని ఆయన చెప్పారు. 'లాఫింగ్ బుద్ధ' ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ గురించి రిషబ్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. 'కన్నడ చిత్ర పరిశ్రమలో ప్రీ రిలీజ్ బిజినెస్ ఆశాజనకంగా లేదు. పెద్ద సినిమాలకు సైతం ఈ విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు, కొన్ని చేదు అనుభవాల దృష్ట్యా కన్నడ సినిమాలను కొనేందుకు ఓటీటీ వేదికలు ముందుకు రావడం లేదు. 'లాఫింగ్ బుద్ధ' చిత్రానికి ప్రీ రిలీజ్ బిజినెస్ జీరో' అని ఆయన చెప్పారు.

కొత్తగా..

వినోదం పంచే ప్రేమగాథ



నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన 'సుందరకాండ' చిత్రం టీజర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ మంగళవారం నిర్వహించింది. తన స్వప్న సుందరి కోసం అన్వేషించే క్రమంలో ఆయన పండించిన వినోదం అలరించింది. నారా రోహిత్ మాట్లాడుతూ 'ఇదొక వినూత్న ప్రేమగాథ, నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది' అన్నారు. ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని మా చిత్రం ఇస్తుంది అని దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి చెప్పారు.

దసరాకు సూపర్ హీరో



సుధీర్‌బాబు కథానాయకుడిగా అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. తండ్రీ కొడుకుల ప్రేమ, అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి కావొచ్చింది. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. దసరాకు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

తల్లి మనసుకు అద్దం పట్టే సినిమా



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజ్, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రధారులు. షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు దర్శకుడు శ్రీనివాస్ (సిప్పి) చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్‌ను పూర్తి చేస్తామని నిర్మాత ముత్యాల కిశోర్ తెలిపారు.

ఐదు భాషల్లో కొటేషన్ గ్యాంగ్



జాకీ ష్రాఫ్, ప్రియమణి, సన్నీ లియోన్, సారా అర్జున్ ప్రధాన పాత్రలు పోషించిన 'క్యూజీ' చిత్రం ఈ నెల 30న ఐదు భాషల్లో విడుదల కానుంది. తెలుగు వరల్డ్ వైడ్ హక్కుల్ని వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రసన్నకుమార్, దామోదర ప్రసాద్ హాజరయ్యారు. ఇది మాస్ మసాలా కమర్షియల్ ఎంటర్‌టైనర్ అని వేణుగోపాల్ చెప్పారు. అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని చిత్ర సమర్పకుడు ఎన్టీఆర్ శ్రీను చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో కళింగ



ధ్రువ వాయు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కళింగ'. ప్రజ్ఞా నయన్ హీరోయిన్. సెప్టెంబర్ 13న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ధ్రువ వాయు మాట్లాడుతూ 'తెలుగులో ఇంతవరకూ రాని కాన్సెప్ట్‌తో 'కళింగ' రూపుదిద్దుకుంది. ఇది రెగ్యులర్ మూవీ కాదు' అన్నారు. ఈ సినిమాను చాలా వరకూ అవుట్‌డోర్‌లో, ఫారెస్ట్‌లో తీశామనీ, సినిమా అద్భుతంగా వచ్చిందని నిర్మాతలు పృథ్వీ యాదవ్, దీప్తి కొండవీటి చెప్పారు.

నిరుద్యోగి ప్రేమకథ



విప్లవ్ ప్రధాన పాత్ర పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఈసారైనా'. ఉద్యోగం కోసం వెదుక్కుంటున్న ఓ యువకుడు ప్రేమలో పడడం, చివరకు ఉద్యోగాన్ని పొందాడా, ప్రేమలో విజయం సాధించాడా అనేది ఆసక్తికరమని దర్శకుడు విప్లవ్ చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో అశ్విని అయలూరు హీరోయిన్. సంకీర్త్ కొండ సహ నిర్మాత.

ట్రావెలింగ్

ప్రయాణాల్లో కులాసాగా...

స్వదేశీ ప్రయాణాలైనా, విదేశీ ప్రయాణాలైనా మనతో పాటు మన కుటుంబ సభ్యుల ఆరోగ్యం నిక్షేపంగా ఉండేలా చూసుకోవాలి. అందు కోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించండి.



కారు ప్రయాణాల్లో...

మోషన్ సిక్‌నెస్: కొందరికి కారు ప్రయాణాలు సరి పడవు. వాంతులు వేధిస్తాయి. ఈ సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి రెండు గంటల ముందే తేలికపాటి ఆహారం తీసుకోవాలి. వాంతులను ఆపే మందులతో పాటు, నీళ్లు దగ్గర పెట్టుకోవాలి.

చేతులు శుభ్రం: రెస్ట్ స్టాప్‌లు, పెట్రోల్ బంకులు, రెస్టారెంట్ల దగ్గర ఆగుతూ ఉంటాం. కాబట్టి అంటువ్యాధులు సోకకుండా చేతులను తరచూ శుభ్రం చేసుకుంటూ ఉండాలి. లేదంటే హ్యాండ్ శానిటైజర్ ఉపయోగిస్తూ ఉండాలి.

ఫుడ్ సేఫ్టీ: వాంతులు, విరోచనాలు లాంటి జీర్ణసంబంధ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం బయటి భోజనాలకు బదులుగా పండ్లు, ప్రొటీన్ బార్స్, ఇంట్లో తయారు చేసుకుని వెంట తెచ్చుకున్న స్నాక్స్ మీదే ఆధారపడాలి.



విశ్రాంతి: గంటల తరబడి నిరంతరంగా ప్రయాణించకుండా ప్రతి రెండు గంటలకూ స్వల్ప విరామం తీసుకుంటూ వెళ్లాలి. ప్రయాణంలో మత్తును కలిగించే మందులు వేసుకోకూడదు.

విమాన ప్రయాణాల్లో...

విశ్రాంతి: ప్రయాణానికి ముందు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా సరిపడా నీళ్లు తాగాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

బాడీ ఫెటీగ్: తేలికపాటి బరువులనే హ్యాండ్ లగేజ్‌గా వాడుకోవాలి. మోయలేని బరువును భుజానికి, వీపుకు తగిలించుకోవడం వల్ల భుజం, వెన్ను నొప్పి వేధిస్తాయి. అలాంటి బరువైన బ్యాగులను చెకిన్‌కు పరిమితం చేయాలి.

స్ట్రెచింగ్: రెండు గంటలకు మించి విమాన ప్రయాణం చేసేవారు తరచూ స్ట్రెచింగ్ చేసుకోవడం అవ



సరం. అరికాళ్లు వాచిపోకుండా ఉండడం కోసం కాలి గిలకలను గుండ్రంగా తిప్పుతూ ఉండాలి. సీట్ బెల్ట్ సైన్ ఆగిపోయిన సమయంలో విమానంలోనే అటూ ఇటూ నడిచే ప్రయత్నం చేయాలి.

హెయిర్ బ్యాండ్: వెంట్రుకలు బిగుతుగా వెనక్కి లాగి కట్టేసే హెయిర్ బ్యాండ్స్ వల్ల తలనొప్పులు వేధిస్తాయి. కాబట్టి సాధ్యమైనంత వరకూ వెంట్రుకలను వదిలేసి ఉంచాలి.

విదేశీ ప్రయాణాల్లో...

మందులు సరిపడా: దైనందిన ప్రిస్క్రిప్షన్లకు తగ్గట్టు సరిపడా మందులను వెంటబెట్టుకెళ్లాలి. ప్రయాణానికి ముందు వైద్యులు సూచించే టీకాలు వేయించుకోవాలి.

వ్యాధులు: వెళ్లబోతున్న దేశంలో ప్రబలి ఉన్న వ్యాధుల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి. వ్యాధుల లక్షణాలు, ముందు జాగ్రత్త చర్యల గురించి కూడా అవగాహన ఏర్పరుచుకోవాలి.



ఆరోగ్య రక్ష: సన్‌స్క్రీన్స్, ఇన్‌సెక్ట్ రిపెల్లెంట్స్ వెంట తీసుకువెళ్లాలి. ఆహార జాగ్రత్తలు పాటించాలి. కొత్త పదార్థాలను తినేటప్పుడు అలర్జీలకు గురయ్యే అవకాశాలుంటాయనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరాలకు సంబంధించిన సాధారణ మందులతో పాటు పెయిన్ కిల్లర్స్, అలర్జీ మందులు వెంట తీసుకువెళ్లాలి.

హంగు, హోదా దుస్తుల్లోనూ ప్రతిబింబించే సంక్లిష్టమైన ఎంబ్రాయిడరీలు సగటు మహిళలకు అందుబాటులో ఉండవనుకుంటే పొరపాటు. దశాబ్దాలుగా బంగారు, వెండి తీగల అల్లిక పనితనంతో ఆదరణ పొందుతూ వచ్చిన ప్రపంచప్రఖ్యాత జర్దోసి ఎంబ్రాయిడరీ దుస్తులు, ఇప్పుడు సెక్విన్లు, మోటిఫ్‌ల అలంకరణతో మహిళలందరికీ అందుబాటులోకొచ్చాయి. ఆ రకం జర్దోసి దుస్తుల ఫ్యాషన్ గురించి తెలుసుకుందాం!

జబర్దస్త్ 'జర్దోసి'

ఫ్యాషన్



మొఘలుల మనసును మెప్పించి...

పర్షియా భాషలో జర్దోసికి బంగారు ఎంబ్రాయిడరీ అని అర్థం. క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలో మెసపటోమియాలో రూపం పోసుకున్న ఈ పనితనం, కాలక్రమంలో భారతదేశానికి చేరుకుంది. మరీ ముఖ్యంగా 16, 17వ శతాబ్దపు మొఘల్ చక్రవర్తులు ఈ పనితనానికి ముగ్ధులై, తమదైన శైలిని జోడించి జర్దోసికి కొత్త రూపురేఖలను జోడించారు. జర్దోసి కళాకారులు దుస్తుల ఎంబ్రాయిడరీని సృష్టించడం కోసం మూడు రకాల పద్ధతులను అవలంబించేవారు. అవేంటంటే...

- **ఫ్లాట్ జర్దోసి:** వస్త్రం మీద బంగారం, వెండి, రాగి తీగలతో డిజైన్లను కుట్టడం
- **ఎంబెలిష్‌మెంట్:** ఎంబ్రాయిడరీకి అదనపు హంగులను జోడించడం కోసం సెక్విన్లు, జాతి రాళ్లు, పూసలను జోడించడం
- **ఆర్ల్ వర్క్:** సంక్లిష్టమైన పనితనంతో కొక్కెన్ని పోలిన సూదులను ఉపయోగించి సంక్లిష్టమైన ఆకృతులను సృష్టించడం

నచ్చిన డిజైన్, నచ్చిన ఫ్యాబ్రిక్

జర్దోసి ఎంబ్రాయిడరీకి నేర్పు, ఓర్పు కలిగి ఉండాలి. సునిశిత దృష్టి, నైపుణ్యం కూడా మెండుగా కలిగి ఉండాలి. ఇంతటి శ్రమతో తయారైన జర్దోసి డిజైనర్ దుస్తులు కంటికింపుగా, మెరుపులు వెదజల్లుతూ ఎంతో హుందాగా ఉంటాయి. కాబట్టే బంగారం తీగల జర్దోసి వర్క్‌తో వెడ్డింగ్ లెహంగాలను రూపొందిస్తున్నారు. సున్నితమైన పువ్వుల మోటిఫ్స్‌తో చీరలను తయారుచేస్తున్నారు. జామెట్రీ ఆకృతులను కలిగిన షేర్వాణీలను కూడా తయారుచేస్తున్నారు. ధరించదగిన కళాకృతిలా దుస్తులను మలచడానికి తోడ్పడుతున్న జర్దోసి ఎంబ్రాయిడరీ నేడు బంగారం, వెండిలను మరిపించే చవకైన మెటీరియల్స్‌తో కూడా రూపొందుతున్నాయి. నచ్చిన డిజైన్, నచ్చిన రంగు, నచ్చిన ఫ్యాబ్రిక్‌ను ఎంచుకుని డిజైనర్ల సహాయంతో మనసుకు నచ్చే జర్దోసి వర్క్‌ను డిజైన్ చేసుకోగలిగే వెసులుబాట్లు కూడా అందుబాటులోకొచ్చాయి. అయితే పట్టు, వెల్వెట్, బ్రొకేడ్ మెటీరియల్స్ మాత్రమే బరువైన జర్దోసి పనితనాన్ని మోయగలుగుతాయి. కాబట్టి మెటీరియల్ ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలి.



నాకూ అమ్మా నాన్నా ఉంటే బాగుండేది... పెరిగే వయసులో **యోజన ఘూరత్** ఈ మాట అనుకోని క్షణం లేదు. ఇప్పుడామెకు నూట పాతికమందికి పైగా తల్లితండ్రులు... వేలాది మంది నిస్సహాయ వృద్ధులను ఆమె దత్తత తీసుకున్నారు. వారికి దూరమైన ఆదరణను అందిస్తూ... తను కోల్పోయిన ప్రేమను పొందుతున్నారు.



అభాగ్యులకు కన్న బిడ్డలా

"నేను తల్లితండ్రులెవరో తెలియని అనాథను. నాకు ఊహ తెలిసేసరికి కోల్‌కతాలోని 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'లో ఉన్నాను. మదర్ థెరిసా సంరక్షణలో పెరిగాను. అక్కడి నన్స్ నాలాంటి అనాథలను ఆప్యాయంగా చూసుకొనేవారు. మా అవసరాలను కనిపెట్టి తీర్చేవారు. కానీ ఎక్కడైనా తల్లితండ్రులతో కలిసి వెళుతున్న పిల్లలు కనిపించినప్పుడు నా మనసెంతో బాధపడేది. నాకూ అమ్మా నాన్నా ఉంటే బాగుండేదని ఎప్పుడూ అనుకొనేదాన్ని. "మీరు వెళ్ళిన ప్రతి చోటా ప్రేమను వ్యాప్తి చెయ్యండి. మీ దగ్గరకు వచ్చినవారు ఎవరైనా... వారిలో సంతోషం నింపకుండా వెనక్కి పంపకండి" అని మదర్ థెరిసా చెప్పిన మాటలు నాలో బలంగా నాటుకున్నాయి. చదువు పూర్తి కాగానే... నాలాంటివారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నాను. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి వివిధ ప్రాంతాల్లో పని చేశాను. ఆ సమయంలోనే... దిక్కులేని వృద్ధులు ఎందరినో చూశాను. 'నా



తల్లితండ్రులు ఇలాంటివాళ్ళే అయి ఉంటారా? నన్ను పోషించే శక్తి లేక వదిలేసి ఉంటారా? ఇప్పుడు వాళ్ళు ఎక్కడో ఇదే పరిస్థితిలో ఉన్నారా?' అని ఆలోచించేదాన్ని.

ఇది అంత తేలిక కాదు...

దాదాపు పదేళ్ళకు పైగా ఎన్నో స్వచ్ఛంద సంస్థల్లో కొనసాగిన తరువాత... వృద్ధుల కోసం నేనే సొంతంగా పని చెయ్యాలనుకున్నాను. 2010లో మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా బోయ్‌సార్‌లో 'స్మిట్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నాను. రైల్వే స్టేషన్లు, బస్టాండులు, ఆలయాల దగ్గర, వంతెనల కింద, ఆసుపత్రుల బయట నిస్సహాయంగా ఉండే వయోధికులకు ఆహారం, వసతి, వైద్యం అందించడంతోపాటు వారిలో నైరాశ్యాన్ని తొలగించి మానసిక స్థైర్యాన్ని నింపేదాన్ని. దీనికోసం ఎందరో ఉదారంగా ఎన్నో రూపాల్లో సాయం చేసేవారు. క్రమంగా వృద్ధుల సంఖ్య పెరిగింది. బోయసార్‌లో కొన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో ఠాణే జిల్లాలోని భివాండికి మారాం. మా సంస్థను 2017లో 'స్మిట్ ఓల్డేజ్ హోమ్ అండ్ కేర్ ఫౌండేషన్'గా రిజిస్టర్ చేశాను. నా కార్యక్రమాలను గమనించి... స్వచ్ఛందంగా సేవలు అందించడానికి చాలామంది ముందుకు వచ్చారు. అనాథలు, పేదలు, పిల్లలు వదిలేసినవారు, శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతున్నవారు... ఇలా అవసరంలో ఉన్న వృద్ధులకు నిరంతరాయంగా సేవలు కొనసాగిస్తున్నాను. ఇప్పటివరకూ 10,700 మందికి మా సంస్థ సేవలు అందించింది. 7,300 మందికి పైగా వివిధ దశల్లో ఆశ్రయం ఇచ్చింది. 5,200 మందిని నేను దత్తత తీసుకొని, వారి బాగోగులు చూస్తున్నాను. వారిలో 3,800 మందికి మా సంస్థ ద్వారా వివిధ పనుల్లో శిక్షణ అందించి... సాధికారత కల్పించాం. పూర్తిగా కోలుకున్నాక... కొందరు తమ కుటుంబాల దగ్గరకు తిరిగి వెళ్ళారు. మరికొందరు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న వృద్ధాశ్రమాలలో చేరారు. ఇలాంటి ఒక సంస్థను నడపడం తేలికైన విషయం కాదు. కనీస అవసరాల కోసం నెలకు పన్నెండు లక్షలకు పైగా ఖర్చవుతోంది. దాతల నుంచి, సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ సంస్థలు అందించే మొత్తాల నుంచి దాన్ని సమకూర్చుకోవాల్సి వస్తోంది.

సమాధానం దొరికింది...

ప్రస్తుతం మా హోమ్‌లో 126 మంది శాశ్వతంగా ఆశ్రయం పొందుతున్నారు. వారంతా దాదాపుగా మంచం మీద నుంచి కదలలేనివారే. ఆహారం తినిపించడం, కాలకృత్యాల్లో సాయపడడం, డైపర్లు మార్చడం... ఇలా ప్రతి పనీ నేను, మా వాలంటీర్లు చేస్తాం. అందరూ నన్ను తమ కూతురులా భావిస్తారు. కష్టసుఖాలు చెప్పుకొంటారు. తమ జీవితానుభవాలు వివరిస్తూ ఉంటారు. నేను ఎరుగని నా కన్నవారిని వాళ్ళలో నేను చూసుకుంటున్నాను. నిస్సహాయత, ఒంటరితనం అంటే ఏమిటో నాకు తెలుసు. వారికి కావలసింది మూడు పూటలా ఆహారం, నిద్రపోవడానికి ఒక మంచం మాత్రమే కాదు... వృద్ధాప్యంలో ఆరోగ్యపరమైన, భావోద్వేగపరమైన సమస్యలుంటాయి. తమతో కొంత సమయం గడిపి, తాము చెప్పేది వినేవారు కావాలని వారు కోరుకుంటారు. జీవితంలో అన్నీ కోల్పోయామనే నిరాశలో ఉంటారు. వారిలో నైతిక స్థైర్యం నింపడానికి నేను, మా వాలంటీర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. 'హోమ్‌లో ఉన్న వారందరూ ఒకే కుటుంబం' అనే భావన కలిగేలా చూస్తాం. వారిలో స్నేహభావాన్ని పెంపొందిస్తాం. ఓపిక, ఉత్సాహం ఉన్నవారిని చిన్న చిన్న పనుల్లో భాగస్వాముల్ని చేస్తాం. దివ్యాంగులు, ఇళ్ళ నుంచి తప్పిపోయిన పిల్లలకు కూడా హోమ్‌లో చోటు కల్పిస్తున్నాం. నారీ శక్తి ప్రతిభా సన్మాన్, సామాజిక్ సేవా పురస్కార్, సమాజ్ రత్న పురస్కార్, బెస్ట్ సోషల్ వర్కర్ ఆదర్శ మహారాష్ట్ర మహిళా సన్మాన్, సావిత్రి బాయి పూలే సన్మాన్... ఇలా అనేక పురస్కారాలను, గౌరవాలను అందుకున్నాను. ఇప్పుడు మా అమ్మాయిలు వర్షాలి, మయూరి కూడా ఫౌండేషన్ బాధ్యతలను పంచుకుంటున్నారు. ఇప్పటికీ మా సంస్థ అద్దె భవనంలోనే నడుస్తోంది. కనీసం మూడు వేలమందికి ఏకకాలంలో సరిపోయే సొంత భవనం నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఒకప్పుడు 'అమ్మా, నాన్నా ఎలా ఉంటారు? వాళ్ళను ఎక్కడ వెతకాలి?' అనే ప్రశ్నలు నన్ను వేధించేవి. నేను ఎంచుకున్న మార్గంలో వాటికి సమాధానం దొరికింది."

బ్యూటీ

ఓపెన్ పోర్స్ ఇలా మాయం

చర్మంలో తయారయ్యే స్వేదం, నూనెలు బయటకు వెళ్లిపోవడానికి ఓపెన్ పోర్స్ ఉపయోగపడతాయి. అయితే జిడ్డు, దుమ్ము, మృత చర్మకణాలు, అవసరానికి మించి నూనెలు స్రవించడం మూలంగా ఈ చర్మ రంధ్రాలు మరింత పెద్దవిగా మారిపోయి, ముఖ చర్మం మీద స్పష్టంగా కనిపించడం మొదలుపెడతాయి. అలాంటప్పుడు వీటిని కుంచించుకుపోయేలా చేసే చిట్కాలు పాటించాలి. అవేంటంటే....

అలోవేరా ఇలా....

అలోవేరా ఆకుల అంచులను తొలగించి, పైనున్న తోలును తొలగించి, కత్తితో గాట్లు పెడితే చిక్కని అలోవేరా ఆకులో నుంచి బయటకొస్తుంది. దీన్ని గిన్నెలోకి వంపుకుని, వేళ్లతో ఒత్తి గుజ్జుగా చేసుకుని ముఖానికి పట్టించాలి. 15 నిమిషాల తర్వాత, గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు క్రమం తప్పక చేస్తే ఫలితం ఉంటుంది.

బొప్పాయి భలే

బొప్పాయిలో పపెయిన్ అనే యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది చర్మం మీద మచ్చలు, డాగులను చర్మంలో కలిసిపోయేలా చేస్తుంది. అలాగే చర్మరంధ్రాలు కూడా శుభ్రపడతాయి. కాబట్టి తాజా బొప్పాయి



ముక్కను నేరుగా గుజ్జుగా చేసి ముఖానికి అప్లై చేసుకోవాలి. గుజ్జును అప్లై చేయడానికి కాటన్ బాల్ ఉపయోగించడం మరింత మంచిది. ఇలా అప్లై చేసుకున్న తర్వాత 20 నిమిషాలు ఆగి, చల్లనీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయాలి.

పెరుగు ప్రయోజనం

పెరుగులో లాక్టిక్ యాసిడ్, ప్రొబయాటిక్స్ ఉంటాయి. పెరుగు చర్మానికి సహజసిద్ధ తేమను కూడా అందిస్తుంది. ఓపెన్ పోర్స్‌ను కూడా అరికడుతుంది. కాబట్టి తాజా పెరుగును చిలికి, ముఖం మీద ఒక పొరలా అప్లై చేసుకుని, 15 నిమిషాల తర్వాత చల్లనీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారానికోసారి చేస్తే సరిపోతుంది.

అంగవైకల్యం ఉన్నవారి పట్ల సమాజంలో చిన్న చూపు ఉంటుంది. ముఖ్యంగా మరగుజ్జులైతే ఆ వివక్ష మరింత ఎక్కువగా కనిపిస్తుంది. ఆ వివక్షలన్నింటినీ దాటుకొని- ఒక ప్రముఖ సంస్థకు క్రియేటివ్ హెడ్‌గా పనిచేస్తున్న **దిశ** కథ అందరికీ స్ఫూర్తిదాయకం.

ఊహలకు రెక్కలు తొడిగి..



"అంగవైకల్యం నేను కోరుకున్నది కాదు. నాకు అదొక శాపం. కానీ శాపాన్ని కూడా వరంగా మార్చుకోగలిగినప్పుడే మనం పరిపూర్ణమానవులం అవుతాం" అంటారు దిశ. ముంబైలో నివసించే 39 ఏళ్ల దిశకు చిన్నతనం నుంచి కాళ్లు, చేతులు ఎదగటం మానేసాయి. స్కూలుకు వెళ్తే పిల్లలు గేలి చేసేవారు. దిశకు స్కూల్లో ఎప్పుడూ మంచి మార్కులే వచ్చేవి. కానీ ఆమెకు తగినంత గౌరవం లభించేది కాదు. "మన దేశంలో మరగుజ్జులను జోకర్స్‌లా చూస్తారు. వారికీ ఒక జీవితం ఉంటుందనే విషయాన్ని ఎవరూ పట్టించుకోరు" అంటారు దిశ. స్కూలులోనే కాదు కాలేజీలో కూడా దిశకు మంచి మార్కులే వచ్చాయి. కాలేజీ తర్వాత ఆమెకు ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేయాలనే ఆశ ఉండేది. "ప్రతి కార్పొరేట్ కంపెనీకి కొన్ని విధివిధానాలు ఉంటాయి. అంగవైకల్యం ఉన్నవారిని వారు చేర్చుకోవటానికి ఇష్టపడరు. అంగవైకల్యం ఉన్న వారు తమ వద్ద చేరితే వర్క్ కల్చర్ పాడైపోతుందనుకుంటారు. ఈ విషయం నాకు ముందు తెలియదు. అందుకే నా క్వాలిఫికేషన్స్‌కు తగిన ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో అనేక కంపెనీలకు అప్లై చేసేదాన్ని" అంటారు దిశ. అప్లై చేసిన తర్వాత ఇంటర్వ్యూలకు పిలిచేవారు. ఆమెను చూసిన తర్వాత... ఉద్యోగాన్ని ఇచ్చేవారు కారు. ఇలా ఒకటి రెండు కాదు.. 17 ఉద్యోగాలు రాలేదు. 'మీరు ఎంపిక కాలేదు.' అని వచ్చే మెయిల్‌ను చూసినప్పుడల్లా విపరీతమైన నిరాశ కలిగేది. అయితే స్థైర్యం మాత్రం ఎప్పుడూ కోల్పోలేదు. నేను ఏ తప్పూ చేయలేదు. నా అంగవైకల్యం నా తప్పు కాదు.." అంటారు దిశ. ఇలా కొద్ది కాలం గడిచిన తర్వాత ఒక గ్రాఫిక్ డిజైనింగ్ సంస్థలో దిశకు ఉద్యోగం దొరికింది. "ఆ రోజు నా ఆనందానికి హద్దులు లేవు. నన్ను నేను నిరూపించుకుంటానని ఆ రోజు శపథం చేశా. అదృష్టవశాత్తు అంతా మంచిగానే జరిగింది" అంటారామె. ఉద్యోగంలో చేరిన కొద్దికాలానికే ఆమె అంచెలంచెలుగా ఎదగటం మొదలుపెట్టారు. ప్రస్తుతం ఓ ప్రముఖ సంస్థలో క్రియేటివ్ హెడ్‌గా పనిచేస్తున్నారు.

నాలాగా ఎందరో...

మన దేశంలో లక్షల మంది మరగుజ్జులు ఉంటారు. వారిలో ఎక్కువ మంది జీవనోపాధి లేక అనేక కష్టనష్టాలను అనుభవిస్తున్నవారే! వీరందరికీ సాయం చేసే సంస్థలు ఏమి లేవు. వీరందరి కోసం దిశ ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ద లిటిల్ పీపుల్ ఆఫ్ ఇండియా' అనే సంస్థను స్థాపించారు. ప్రస్తుతం ఈ సంస్థలో 650 మంది సభ్యులు ఉన్నారు. "వీరికి వృత్తిపరంగా.. వైద్య పరంగా సాయం అందించటమే మా లక్ష్యం. మరగుజ్జుల పట్ల వివక్ష అంత త్వరగా పోదు. అందువల్ల వారికి తగిన చేయూత ఇవ్వటానికి ప్రయత్నిస్తాం." అంటారు దిశ. ఈ లక్ష్యాలతో పాటుగా- వివాహం చేసుకొని స్థిరపడాలనుకొనే వారికి చేయూత ఇవ్వడం అనేది తమ మరో లక్ష్యమంటారామె! "చాలామంది వివాహం చేసుకోవాలనుకుంటారు. కానీ ఎవరిని సంప్రతించాలో తెలియదు. వారి కోసం ఒక వివాహ వేదికను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం" అంటారు దిశ. సమాజంలో వివక్షకు గురైన ఒక వర్గం కోసం ఆమె చేస్తున్న ప్రయత్నాలు స్ఫూర్తిదాయకం.

> నా ఎత్తుకు హద్దు ఉందేమో... కానీ నా సామర్థ్యానికి కాదు.





ఈ ఉంగరాలు స్మార్ట్

మీరు వ్యాయామం చేస్తున్నప్పుడు హార్ట్‌బీట్ ఎంత ఉందో తెలుసుకోవాలనుకుంటున్నారా? రాత్రి ఎంత సేపు ప్రశాంతంగా నిద్రపోయారో తెలుసుకోవాలనుకుంటున్నారా? ఇప్పటిదాకా ఇలాంటి విషయాలు తెలుసుకోవాలంటే స్మార్ట్ వాచీలే మనకు దిక్కు. ఇప్పుడు చేతికి ఉంగరాలు మాదిరిగా పెట్టుకొనే కొత్తరకం ఫిట్‌నెస్ బ్యాండ్‌లు అందుబాటులోకి వచ్చేసాయి. ప్రస్తుతం అనేక మంది సెలబ్రిటీలు వీటినే వాడుతున్నారు. చూడటానికి చాలా ఫ్యాషన్‌బుల్‌గా ఉండే ఈ స్మార్ట్ రింగ్స్ వెనక ఉన్న కథేమిటో చూద్దాం.



అంటే ఏమిటి?

ఇవి మన వేళ్లకు పెట్టుకొనే ఉంగరాల మాదిరిగానే ఉంటాయి. మన మొబైల్ ఫోన్లకు అనుసంధానమై ఉంటాయి. మన మొబైల్స్‌కు ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపుతూ ఉంటాయి.

ఏఏం చేయవచ్చు?

- ఒక రోజులో ఎన్ని అడుగులు వేశామో తెలుస్తుంది..
- హార్ట్‌బీట్ రేట్ ఎలా ఉందో తెలుస్తుంది..
- నిద్రలో ఎన్నిసార్లు లేచామో తెలుస్తుంది..
- కొన్ని అత్యాధునిక స్మార్ట్ రింగ్స్ ద్వారా రుతుస్రావం ఎప్పుడు అవుతుందో ముందే కనుగొనవచ్చు
- కొన్ని స్మార్ట్ రింగ్స్ ద్వారా డిజిటల్ పేమెంట్స్ కూడా చేయవచ్చు

నష్టాలేమిటి?

- చూడ్డానికి ఫ్యాషనబుల్ ఉంగరంలా ఉండే ఈ స్మార్ట్ బ్యాండ్‌లో సమాచారాన్ని నేరుగా చూడలేము. మొబైల్‌కు అనుసంధానించాలి.
- బ్యాటరీ లైఫ్ కూడా తక్కువగా ఉంటుంది.
- ఇతర ఫిట్‌నెట్ ట్రాకర్స్‌తో పోలిస్తే వీటి ఖరీదు ఎక్కువ.

ఐసీసీకి జై షా



చైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నిక
డిసెంబరు ఒకటిన బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: బీసీసీఐ కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక య్యాడు. ప్రస్తుత చీఫ్ గ్రెగ్ బార్క్‌లే (న్యూజిలాండ్) మూడోసారి పోటీపడకూడ దని నిర్ణయించుకున్న నేపథ్యంలో..జై షా ఒక్కడే పోటీలో మిగలడంతో అతడి ఎన్నిక ఏక గ్రీవం అయ్యింది. దాంతో జై షా (35) ఐసీసీకి చిన్న వయసులో చైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తిగా రికార్డు సృష్టించాడు. వచ్చే డిసెంబరు ఒకటిన బార్క్‌లే నుంచి అతడు బాధ్యతలు చేపట్టను న్నాడు. 2019 అక్టోబరు నుంచి బీసీసీఐ కార్య దర్శిగా కొనసాగుతున్న షా..జనవరి 2021 నుంచి ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నాడు. జగ్‌మోహన్ దాల్మి యా, శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాం క్ మనోహర్ తర్వాత ఐసీసీ చైర్మన్‌గా బాధ్య తలు చేపట్టనున్న ఐదో భారతీయుడు జై షా.

క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం..: క్రికెట్‌ను ప్రపంచం నలుమూలలకు విస్తరింపజేసి ఆటకు మరింత ప్రాచుర్యం కల్పిస్తామని కొత్త చైర్మన్ జైషా చెప్పాడు. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడం ఆ దిశగా కీలక ముందడుగుగా అతడు పేర్కొన్నాడు.

ఎన్నిక ఇలా..

చైర్మన్ పదవికి నామినేషన్ల దాఖలుకు మంగళవారం చివరిరోజు. ప్రపంచ క్రికెట్‌లో బలమైన సభ్య దేశాలు 'సెనా' (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)లలో ఒక బోర్డు జై షా నామినేషన్‌ను ప్రతిపాదిస్తే..మరో క్రికెట్ బోర్డు సమర్థించినట్టు తెలిసింది. మరెవరూ నామినేషన్ వేయకపోవడంతో జై షా ఎన్నిక ఏకగ్రీవమైంది. టెస్టులు ఆడే దేశాలు 12, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, అసోసియేట్ సభ్య దేశాలు నామినేట్ చేసే ఇద్దరు, ఒక స్వతంత్ర మహిళా డైరెక్టర్ కలిపి..ఐసీసీలో మొత్తం 17 ఓట్లున్నాయి.

మహిళల టీ20 వరల్డ్‌కప్ జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలో 15 మంది సభ్యుల మహిళల టీ20 ప్రపంచకప్ జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఉమా చెత్రి మినహా ఆసియా కప్‌లో ఆడిన 14 మందికి జట్టులో చోటు లభించింది. వికెట్ కీపర్ బ్యాటర్ యాస్తిక బాటియా, స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ టీమ్‌లోకి పునరాగమనం చేశారు.



విధి వంచించినా.. తలవంచని ధైర్యం.. వైకల్యం సవాళ్లు విసిరినా.. అచంచల ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమిస్తూ.. వినువీధిలో గెలుపు గీతం వినిపిస్తూ.. అణువణువునా స్ఫూర్తిని నింపే విశ్వక్రీడా సంరంభం.. పారాలింపిక్స్‌కు నేడు తెరలేవనుంది. తమ మనోబలం ఎంత గొప్పదో చాటి చెప్పేందుకు పారా ఒలింపియన్లు ఈ క్రీడలను వేదికగా చేసుకోబోతున్నారు. వారి దేశాలకు గర్వకారణంగా నిలవాలన్న లక్ష్యంతో ఆకాశమే హద్దుగా చెలరేగేందుకు సిద్ధమైన ఈ క్రీడాకారులకు ఎవరైనా సలాం కొట్టాల్సిందే.





ఆకాశమే హద్దు!

నేటి నుంచి పారాలింపిక్స్

భారత్ నుంచి 84 మంది బరిలోకి..

పారిస్: వందేళ్ల తర్వాత వినూత్నరీతిలో సమ్మర్ ఒలింపిక్స్‌ను నిర్వహించిన పారిస్ నగరంలో మరో క్రీడా సందడి. బుధవారం నుంచి సెప్టెంబరు 8 వరకు ఈ ఫ్యాషన్ నగరిలో పారాలింపిక్స్ సందడి నెలకొనబోతోంది. 22 క్రీడాంశాలు, 549 విభాగాల్లో 180 దేశాల నుంచి 4400 మంది పారా అథ్లెట్లు పతకాల కోసం బరిలోకి దిగబోతున్నారు. రాత్రి 11.30కు మొదలయ్యే పారాలింపిక్స్ ఆరంభోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. గతానికి భిన్నంగా నగరం మధ్యలో ఓపెన్ ఎయిర్‌లో చారిత్రాత్మక డి ల కాంకర్డ్, చాంప్స్-ఎలీసీలో బుధవారం రాత్రి ఆరంభ వేడుకలను నిర్వహించనున్నారు. మార్చ్ పాస్ట్‌లో పాల్గొనే 100 మంది సభ్యుల భారత బృందానికి జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ పతాకధారులుగా ముందుండి నడిపించనున్నారు. సుమారు 65 వేల మంది ఈ కార్యక్రమ వీక్షణకు హాజరవుతారని అంచనా. పోటీలు గురువారం మొదలవుతాయి.

జంబో బృందంతో..

పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు ఆరు మెడల్స్‌కే పరిమితమ య్యారు. కానీ ఆ లోటును భర్తీ చేసేందుకు దేశ పారా అథ్లెట్లు సిద్ధమవుతున్నారు. ఎందుకంటే రియో పారా గేమ్స్‌లో నాలుగు పతకాలే సాధించిన భారత్.. తమ పారాలింపిక్స్ చరిత్రలోనే తొలిసారిగా టోక్యోలో 19 మెడల్స్‌తో మెరిసింది. ఐదు స్వర్ణాలు, 8 రజతాలు, ఆరు కాంస్యాలతో పట్టికలో 24వ స్థానంతో ఆకట్టుకుంది. అందుకే రెట్టించిన ఉత్సాహంతో ఈసారి 84 మంది బృందం..12 క్రీడాంశాల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అదే టోక్యో క్రీడలకు 54 మందే వెళ్లడం గమనార్హం. మరోవైపు ఈసారి పారాగేమ్స్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు అథ్లెట్లు కూడా ప్రాతినిధ్యం వహించబోతున్నారు.

టార్గెట్ 25

ఇటీవలి అంతర్జాతీయ పోటీల్లో భారత అథ్లెట్లు రాణిస్తున్న తీరుతో సర్వత్రా పారా గేమ్స్ పతకాలపై అంచనాలు పెరిగాయి. కనీసం 25 నుంచి 30 మెడల్స్ లక్ష్యంగా బరిలోకి దిగబోతున్నారు. ముఖ్యంగా ఆర్చరీ, అథ్లెటిక్స్, షూటింగ్‌లో ఎక్కువగా ఆశిస్తున్నారు. స్టార్ హైజంపర్ మరియప్పన్ తంగవేలు, టోక్యోలో రెండు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన మహిళా షూటర్ అవని లేఖారాతో పాటు మరో షూటర్ నర్వాల్, షట్లర్ కృష్ణ నాగర్, మనోజ్ సర్కార్, సుహాస్, జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ మరోసారి పోడియం ఎక్కాలని భావిస్తున్నారు. అయితే వరల్డ్ చాంపియన్ షట్లర్ ప్రమోద్ భగత్ స్వర్ణ ఆశలు గల్లంతయ్యాయి. డోపింగ్ నిబంధనలు పాటించకపోవడంతో అతడిపై వేటు పడింది.

టీనేజ్ సెన్సేషన్

తొలిసారి పారాలింపిక్స్ ఆడనున్న 17 ఏళ్ల ఆర్చర్ శీతల్ దేవిపై అందరి దృష్టి ఉండబోతోంది. రెండు చేతులూ కోల్పోయినా ఆమె కాళ్లతోనే బాణాలను సంధిస్తూ గతేడాది వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో రజతం అందుకుంది. అలాగే 2022 ఆసియన్ పారాగేమ్స్‌లో రెండు స్వర్ణాలు, రజతం సాధించింది. మహిళల పారా కాంపౌండ్ ఓపెన్ కేటగిరీలో తనే వరల్డ్ నెంబర్‌వన్. తాజాగా మహిళల కాంపౌండ్ ఓపెన్, మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఓపెన్‌లో పాల్గొంటున్న శీతల్‌పై స్వర్ణ ఆశలే ఉన్నాయి.

'గ్లోబల్' జోరు

ఏ దేశానికి చెందిన క్రీడాభిమానులనైనా ఆకర్షించే గ్లోబల్ స్టార్లు వారంతా. ప్రస్తుత పారాగేమ్స్‌లోనూ సత్తా చాటాలనుకుంటున్నారు. ఇటలీకి చెందిన పారా స్విమ్మర్ సిమోన్ బర్లామ్ తన స్వర్ణాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్నాడు. ఇక డచ్‌కు చెందిన వరల్డ్‌నెంబర్ వన్ వీల్‌చెయిర్ టెన్నిస్ ప్లేయర్ డీడె డి గ్రూట్ టోక్యోలో సింగిల్స్, డబుల్స్‌లోనూ స్వర్ణ పతకాలు ఖాతాలో వేసుకుంది. అలాగే పారా అథ్లెటిక్స్‌లో మార్సెల్ హగ్ (స్విస్), మార్కస్ రెహ్మ్ (జర్మనీ), ట్రయాథ్లాన్‌లో అలెక్సిస్ (ఫ్రాన్స్), స్విమ్మర్ మోర్గాన్ స్టిక్నీ (యూఎస్ఏ), లెజెండరీ స్విమ్మర్ జెస్సికా లాంగ్ (అమెరికా), మరో స్విమ్మర్ అలీ ట్రూవిట్ (అమెరికా), రన్నర్ హంటర్ ఉడ్‌హిల్ (అమెరికా), సైక్లింగ్‌లో ఒక్సానా మాస్టర్స్ (అమెరికా) బరిలోకి దిగబోతున్నారు.

ఎనిమిది మందితో శరణార్థి జట్టు

సమ్మర్ ఒలింపిక్స్ మాదిరే పారాగేమ్స్‌లోనూ శరణార్థి జట్టు బరిలోకి దిగబోతోంది. ఈసారి గేమ్స్ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది మంది ఈ టీమ్‌లో ఉన్నారు. వీరితో పాటు ఇద్దరు గైడ్ రన్నర్స్ కూడా సహాయకంగా పాల్గొంటారు. ఆరు దేశాలకు చెందిన వీరు అథ్లెటిక్స్, పవర్‌లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, ట్రయాథ్లాన్, వీల్‌చెయిర్ ఫెన్సింగ్‌లో సత్తా చూపబోతున్నారు. ఇందులో నలుగురికి గతంలో పారాలింపిక్స్‌లో ఆడిన అనుభవం ఉంది.

జొకో, గాఫ్ సులువుగా..

యూఎస్ ఓపెన్



న్యూయార్క్: నొవాక్ జొకోవిక్ యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో సునాయాసంగా గెలుపొందాడు. మంగళవారం జరిగిన మొదటి రౌండ్‌లో..రెండో సీడ్ జొకోవిచ్ 6-2, 6-2, 6-4తో అల్బాట్ (మాల్డోవా)ను చిత్తు చేశాడు. ఫ్లషింగ్ మెడోస్‌లో జొకోకిది 89వ విజయం. తద్వారా ఈ టోర్నీలో ఫెడరర్ అత్యధిక విజయాల రికార్డును నొవాక్ సమం చేశాడు. మహిళల మొదటి రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కొకొ గాఫ్ (అమెరికా) 6-2, 6-0తో గ్రచేవాను, టాప్ సీడ్ స్వియటెక్ 6-4, 7-6 (6)తో రఖిమోవాను, రెండో సీడ్ సబలెంకా 6-3, 6-3తో హాన్‌ను, 8వ సీడ్ క్రెజికోవా 7-6 (3), 6-3ను ఓడించారు.

నగాల్ తొలి రౌండ్‌తోనే..: భారత స్టార్ సుమిత్ నగాల్ మొదటి రౌండ్‌తోనే తిరుగుముఖం పట్టాడు. హాలెండ్‌కు చెందిన టల్లోన్ గ్రీక్స్‌పూర్‌తో జరిగిన మ్యాచ్‌లో 1-6, 3-6, 6-7 (8)తో సుమిత్ వరుస సెట్లలో ఓటమిపాలయ్యాడు. ఇక నిషియోకా (జపాన్)తో కలిసి నగాల్ డబుల్స్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు.



ఏఐ క్యాపిటల్‌గా హైదరాబాద్

» సెప్టెంబరు 5-6 తేదీల్లో గ్లోబల్ ఏఐ సమ్మిట్
» తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌ను ఏఐ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)కు పెరిగిపోతున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సెప్టెంబరు 5,6 తేదీల్లో హైదరాబాద్‌లో తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మిట్‌లో దాదాపు 2,000 మంది నిపుణులు పాల్గొననున్నారని మంత్రి తెలిపారు. అలాగే ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం.. నాస్కామ్, హైసియా వంటి పరిశ్రమ ప్రతినిధులతో కలిసి పని చేస్తోందన్నారు.

పీపీపీ విధానంలో ఏఐ సిటీ : కాగా కొత్తగా అభివృద్ధి చేయనున్న ఫోర్త్ సిటీలో భాగంగా ముచ్చర్లలో 200 ఎకరాల్లో 'ఏఐ సిటీ'ని ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)లో దీన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో తీసుకున్న చర్యలు, చర్చల అనంతరం ఏఐ సిటీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే దానిపై స్పష్టత వస్తుందన్నారు.

సామ్‌సంగ్ నుంచి కొత్త ఏఐ వాషింగ్ మెషిన్లు

బెంగళూరు: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ మంగళవారం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పని చేసే 10 భారీ వాషింగ్ మెషిన్లను మార్కెట్లో విడుదల చేసింది. 12 కిలోల సామర్థ్యం గల ఈ వాషింగ్ మెషీన్లన్నీ భారీ పరిమాణంలో దుస్తులు ఉతికేందుకు ఉపయోగపడతాయి. వీటి ప్రారంభ ధర రూ.52,990 కాగా గరిష్ఠ ధర రూ.74,990. ఏఐ వాష్, ఏఐ ఎనర్జీ మోడ్, ఏఐ కంట్రోల్, ఏఐ ఇకోబబుల్ వంటి ఫీచర్లు వాటాలో ఉన్నాయి. ఇతర వాషింగ్ మెషిన్లతో పోల్చితే ఇవి విద్యుత్తును పొదుపుగా వాడుకుంటాయి. వాషింగ్ కాలపరిమితి కూడా 39 నిమిషాలకు తగ్గుతుంది. వీటి ద్వారా వినియోగదారులకు 70 శాతం వరకు విద్యుత్ ఆదా అవుతుందని కంపెనీ సీనియర్ డైరెక్టర్ సౌరబ్ బైశాఖియా తెలిపారు. ప్రీమియం సెగ్మెంట్‌లో మార్కెట్ అగ్రగామి కావడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ప్రస్తుతం వాషింగ్ మెషీన్ల మార్కెట్లో తమ వాటా 20 శాతం ఉన్నదని ఆయన అన్నారు

తెలుగులో ఎయిరిండియా ఐవీఆర్ సిస్టమ్

న్యూఢిల్లీ: కస్టమర్ సర్వీస్ సేవలను మరింతగా విస్తరించే ప్రయత్నంలో భాగంగా ఎయిరిండియా మరో ఏడు ప్రాంతీయ భాషలను ఐవీఆర్ సిస్టమ్‌కు జోడించింది. ప్రస్తుతం ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఇది అందుబాటులో ఉండగా కొత్తగా జోడించిన భాషల్లో బెంగాలీ, కన్నడ, మలయాళం, మరాఠీ, పంజాబీ, తమిళ్, తెలుగు ఉన్నాయి. వినియోగదారుని మొబైల్ నెట్‌వర్క్ ద్వారా ఐవీఆర్ సిస్టమ్ కస్టమర్ భాషా ప్రాధాన్యతను గుర్తుపట్టగలుగుతుందని ఎయిరిండియా తెలిపింది.

హైదరాబాద్ జీసీసీల్లో జీతాలు అదుర్స్



జీతాలపరంగా దేశంలో మూడో స్థానం
ఢిల్లీ, ముంబై, పుణె, కోల్‌కతా కంటే ఎక్కువ

టీమ్‌లీజ్ డిజిటల్ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ జాబ్స్ ముఖచిత్రం మారిపోతోంది. నిన్నమొన్నటి వరకు ఐటీ, ఫార్మా రంగాల్లోనే అత్యధిక ఉద్యోగాలు ఉండేవి. ఇప్పుడు బహుళ జాతి సంస్థల (ఎంఎన్‌సీ)కు చెందిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఈ విషయంలో ఐటీ కంపెనీలతో పోటీపడుతున్నాయి. ఐటీ సేవల కంపెనీలతో పోలిస్తే 12 నుంచి 20 శాతం అధిక జీతాలు ఇస్తూ నిపుణులైన ఎంట్రీ, మిడ్ లెవల్, సీనియర్ ఉద్యోగులను ఎగిరేసుకుపోతున్నాయి. దేశంలో అత్యధిక జీతాలు ఇచ్చే జీసీసీల పరంగా చూస్తే, హైదరాబాద్ ప్రస్తుతం మూడో స్థానంలో ఉందని టీమ్‌లీజ్ డిజిటల్ రూపొందించిన నివేదిక వెల్లడించింది. ఢిల్లీ, ముంబై, పుణె, కోల్‌కతా వంటి నగరాలతో పోలిస్తే ప్రస్తుతం హైదరాబాద్‌లోని జీసీసీలే అధిక జీతాలు ఇస్తున్నాయి.

అధిక డిమాండ్ వీరికే..

హైదరాబాద్‌లోని మౌలిక సదుపాయాలు, నిపుణులైన ఉద్యోగుల లభ్యత అనేక ఎంఎన్‌సీలను ఆకర్షిస్తున్నాయని టీమ్‌లీజ్ డిజిటల్ బిజినెస్ హెడ్ కృష్ణ విజ్ వెల్లడించారు. అమెరికా, యూరప్ దేశాలతో పోలిస్తే భారత్‌లో జీసీసీ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులు తక్కువ కావటంతో ఎంఎన్‌సీలు హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డేటా సైన్స్, డేటా ఇంజనీరింగ్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ రంగాల్లో నైపుణ్యాలు ఉన్న ఐటీ నిపుణులను ఈ జీసీసీలు అధిక జీతాలతో తన్నుకుపోతున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు సైతం ఈ కేంద్రాలు రూ.9.5 లక్షల నుంచి రూ.11.1 లక్షల వార్షిక జీతాలు ఇస్తున్నాయి. ఇక మంచి అనుభవం ఉన్న మిడ్ అండ్ సీనియర్ ఉద్యోగులకైతే రూ.16.1 లక్షల నుంచి రూ.21.1 లక్షల వరకు ఆఫర్ చేస్తున్నాయి.

1,600కు పైగా జీసీసీలు

ప్రస్తుతం మన దేశంలో 1,600కు పైగా జీసీసీలు ఉన్నాయి. 2030 నాటికి వీటి సంఖ్య 2,400కు చేరనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 180 జీసీసీలు ఉన్నాయి. దేశంలోని జీసీసీల్లో ఇది 13 శాతం. 2030 నాటికి మరో 800 జీసీసీలు ఏర్పాటు కానున్నాయి. అప్పటికి జీసీసీల్లో హైదరాబాద్ వాటా 26 శాతానికి చేరుతుందని అంచనా. దేశవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో ప్రస్తుతం 16 లక్షల మందికి పైగా పని చేస్తున్నారు. వీరిలో 14 శాతం మంది హైదరాబాద్ జీసీసీల్లో పని చేస్తున్నారు. ఇక దేశవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో పని చేసే ఉద్యోగుల్లో 25 శాతం మంది మహిళలు ఉన్నారు. వచ్చే రెండు మూడేళ్లలో ఇది 35 శాతానికి పెరగనుంది. అనేక ఎంఎన్‌సీలు తమ వ్యూహాత్మక విస్తరణలో భాగంగా, మన దేశంలో తమ జీసీసీలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ కేంద్రాల్లో ఐటీ ప్రొడక్ట్స్, సర్వీసెస్ నిపుణులకూ డిమాండ్ పెరుగుతోంది. దీంతో 2026 నాటికి ఈ రెండు రంగాలే 1.4 కోట్ల మంది ఉద్యోగులతో మన జీడీపీలో 8 శాతం వరకు సమకూరుస్తాయని అంచనా.

కొరవడిన నైపుణ్యాలు

ఐటీ రంగంలో డిజిటల్ నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అయితే మన దేశ ఇంజనీర్లలో కృత్రిమ మేధ (ఏఐ)పై పట్టున్న ఇంజనీర్లు పట్టుమని 2.5 శాతానికి మించి లేరు. ప్రోగ్రామింగ్‌లోనూ ఇదే పరిస్థితి. ఐటీ రంగంలో పని చేస్తున్న ఇంజనీర్లలో కేవలం 5.5 శాతం మందికి మాత్రమే బేసిక్ ప్రోగ్రామింగ్‌లో నైపుణ్యాలు ఉన్నట్టు టీమ్‌లీజ్ డిజిటల్ నివేదిక తెలిపింది. దీంతో దాదాపు 86 శాతం కంపెనీలు ఈ రంగాల్లో తమ ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకు రీస్కిల్లింగ్ చేపట్టాయి.

యూఏఈ నుంచి 160 టన్నుల బంగారం దిగుమతి

న్యూఢిల్లీ: దేశంలోని ఆభరణాల తయారీదారులు, వర్తకులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి రాయితీ ధరలకు 160 టన్నుల బంగారం దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం నోటిఫై చేసింది. 2022 మే 1 తేదీ నుంచి ఉభయ దేశాల మధ్య అమలులోకి వచ్చిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సెపా) కింద ఈ బంగారాన్ని దిగుమతి చేసుకుంటారని ఒక అధికార ప్రకటనలో తెలిపారు. సెపాకు అనుబంధంగా కుదిరిన టారిఫ్ రేట్ కోటా (టీఆర్‌క్యూ) కింద ఒక శాతం రాయితీ ధరకు యూఏఈ నుంచి ఏటా 200 టన్నుల బంగారం దిగుమతి చేసుకునేందుకు భారత్ అంగీకరించింది. ఇందుకు అనుగుణంగానే గత ఏడాది 140 టన్నుల బంగారం దిగుమతికి ప్రభుత్వం నోటిఫై చేయగా ఈ ఏడాది 160 టన్నులకు నోటిఫై చేసింది. జీటీఆర్ఐ నివేదిక ప్రకారం యూఏఈ నుంచి దేశానికి బంగారం దిగుమతులు 2023 ఆర్థిక సంవత్సరంలో 147.6 శాతం పెరిగి 300 కోట్ల డాలర్ల నుంచి 2024 ఆర్థిక సంవత్సరంలో 760 కోట్ల డాలర్లకు చేరాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,030 ▲	66,940 ▲	93,500 ▲
ముంబై	71,762 ▼	65,734 ▼	85,962 ▼

ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ

ముంబై: పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో మంగళవారం ఈక్విటీ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లతో ట్రేడయింది. గత కొద్ది రోజుల ర్యాలీలో సూచీలు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న కారణంగా ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పరుగులు తీశారు. టెలికాం, టెక్నాలజీ, ఐటీ షేర్లు గణనీయంగా లాభపడినా మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకారం సూచీల జోరుకు కళ్లెం వేసిందని విశ్లేషకులంటున్నారు. ఇంత ఆటుపోట్ల వాతావరణంలో కూడా నిఫ్టీ 7.15 పాయింట్ల స్వల్ప లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 25,017.75 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ 13.65 పాయింట్ల లాభంతో 81,711.76 వద్ద క్లోజయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ గరిష్ఠంగా 81,919.11, కనిష్ఠంగా 81,600.51 పాయింట్ల మధ్యన కదలాడింది.

భారత్‌లో మరో 5లక్షల ఉద్యోగాలు: యాపిల్

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్ కంపెనీ భారత్‌పై మరింత దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా వచ్చే నెల 9న విడుదల చేసే ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ మోడల్స్‌ను భారత్‌లో తయారు చేసేందుకు సిద్ధమవుతోంది. దీనివల్ల ఈ ఆర్థిక సంవత్సరం చివరికి ప్రత్యక్షంగా రెండు లక్షలు, పరోక్షంగా మూడు లక్షల కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని అంచనా. కొత్త ఉద్యోగాల్లో 70 శాతం వరకు మహిళలే ఉంటారని భావిస్తున్నారు. తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ వద్ద ఉన్న ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో ఈ ఐఫోన్లు తయారవుతాయని సమాచారం. ఫాక్స్‌కాన్ ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్టు తెలుస్తోంది.

కొత్త సీఎఫ్‌ఓగా కేవన్ పరేఖ్: మరోవైపు భారత సంతతికి చెందిన కేవన్ పరేఖ్‌ను కొత్త సీఎఫ్‌ఓగా నియమిస్తున్నట్టు యాపిల్ కంపెనీ ప్రకటించింది. ఆయన వచ్చే ఏడాది జనవరి 1న బాధ్యతలు స్వీకరిస్తారు. పరేఖ్ గత 11 ఏళ్లుగా యాపిల్ ఫైనాన్షియల్ ప్లానింగ్, అనాలసిస్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు.

బిజినెస్

ఇంట్రానాసల్ కొవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధి: ఐఐఎల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) మరో ఘనత సాధించింది. ముక్కు ద్వారా (ఇంట్రానాసల్) తీసుకునే కొవిడ్-19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఆస్ట్రేలియాకు చెందిన గ్రిఫిత్ యూనివర్సిటీతో కలిసి ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్టు తెలిపింది. దీంతో కొవిడ్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా ఇంజెక్షన్ లేకుండా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవచ్చు. ప్రస్తుతం కొవిడ్ వ్యాప్తి చాలా వరకు తగ్గినా ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వారానికి దాదాపు 1,700 మంది ఈ వైరస్‌తో చనిపోతున్నారు. ఇంజక్షన్ రూపంలో కొవిడ్ వ్యాక్సిన్ తీసుకునేందుకు భయపడేవారికి ఐఐఎల్-గ్రిఫిత్ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడనుంది.

వన్‌మనీలో కేశవ్ రెడ్డి పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పని చేసే అకౌంట్స్ అగ్రిగేటర్ స్టార్టప్ కంపెనీ 'వన్‌మనీ'లో మరో స్టార్టప్ కంపెనీ ఈక్వల్ వ్యూహాత్మక పెట్టుబడి పెట్టింది. అయితే పెట్టుబడి మొత్తం ఎంత? అనే విషయాన్ని రెండు కంపెనీలు వెల్లడించలేదు. ఈక్వల్ స్టార్టప్ కంపెనీని జీవీకే గ్రూప్ వైస్ చైర్మన్ సంజయ్ రెడ్డి కుమారుడు కేశవ్ రెడ్డి ప్రమోట్ చేశారు. ఈ కంపెనీ ప్రస్తుతం అనేక కంపెనీలకు ఐడెంటిటీ వెరిఫికేషన్ సేవలు అందిస్తోంది. వన్‌మనీ, ఈక్వల్ ప్రస్తుతం 250కుపైగా బీఎఫ్ఎస్ఐ కంపెనీలకు కేవైసీ సేవలు అందిస్తున్నాయి. తాజా భాగస్వామ్యంతో రెండు సంస్థలు 97 శాతం సక్సెస్ రేటుతో నెలకు 5.5 కోట్ల లావాదేవీలూ పూర్తి చేస్తాయని భావిస్తున్నారు.

కాకినాడ ప్లాంట్‌కు పెట్టుబడులు రెడీ

ఏఎం గ్రీన్ అమ్మోనియా

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ఏర్పాటు చేసే గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ పెట్టుబడులను గ్రీన్‌కో గ్రూప్ ఖరారు చేసింది. అయితే ఈ పెట్టుబడి ఎంత అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఏఎం గ్రీన్ అమ్మోనియా బీ.వీ పేరుతో గ్రీన్‌కో గ్రూప్ ఈ ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. గత ఏడాది టేకోవర్ చేసిన ఒక యూరియా ప్లాంట్‌లో కొన్ని మార్పులు చేసి.. దాన్ని ఏటా 10 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసే ప్లాంట్‌గా మార్చాలని గ్రీన్‌కో భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28 వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	495
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	108
వరంగల్	109	గుంటూరు	105
కరీంనగర్	109	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	98
కర్నూలు	109	నెల్లూరు	98
విశాఖపట్నం	104	అనంతపురం	105
గోదావరి	108		

రాష్ట్రంలో ఏడు నూతన విమానాశ్రయాలు..!

● అక్టోబరులో సీ ప్లేన్ డెమో.. ప్రకాశం బ్యారేజి నుంచి శ్రీశైలం వరకు

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 7 కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపై పరిశీలన జరుపుతున్నామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. 'శ్రీకాకుళం, అన్నవరం, తాడేపల్లిగూడెం, నాగార్జున సాగర్, కుప్పం, ఒంగోలు- నెల్లూరు, అనంతపురంలో ఏర్పాటుపై పరిశీలన, సర్వే జరుగుతోంది. సీ ప్లేన్ కార్యకలాపాలు త్వరలో రాష్ట్రంలో ప్రారంభం కానున్నాయి. మొట్టమొదటి సీ ప్లేన్ డెమోను అక్టోబరులో రాష్ట్రంలో నిర్వహిస్తాం. విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి శ్రీశైలం వరకూ దీనిని నిర్వహిస్తాం. ఈ రెండు చోట్లా సీ ప్లేన్ లాండింగ్, టేకాఫ్ రెండూ నీళ్లలోనే జరుగుతుంది. మామూలు విమానాశ్రయాల నిర్మాణానికి వేల ఎకరాల్లో భూమి అవసరం. కాని సీ ప్లేన్‌కు ఒక పెద్ద రిజర్వాయర్ ఉంటే చాలు. భూ సమస్యకు పరిష్కారంగా సీ ప్లేన్ విధానాన్ని ప్రోత్సహించాలన్నది మోదీ ప్రభుత్వ ఆలోచన. సీ ప్లేన్‌ను వైద్యం, పౌర రవాణాకు కూడా ఉపయోగపడేలా నిబంధనలు సడలిస్తున్నాం' అని వివరించారు. విజయవాడ విమానాశ్రయం నుంచి మరిన్ని ప్రాంతాలకు విమానాలు నడపడానికి చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రయాణ అవసరాల కోసం తెప్పిస్తున్న హెలికాప్టర్ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరుగుతోందన్నారు.

సామాన్యుడి కోసమే రెవెన్యూ సదస్సులు

సామాన్యుడికి ప్రభుత్వం అండగా ఉంటుందన్న నమ్మకం కలిగించడానికే సెప్టెంబరు నుంచి రెవెన్యూ సదస్సులు పెడుతున్నామని రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ప్రజా దర్బార్ సత్ఫలితాలు ఇస్తోందని కేంద్ర మంత్రి అన్నారు.

జగన్ పాలనలో విద్యుత్ వ్యవస్థ నాశనం

● వైసీపీ హయాంలో భారీగా పెరిగిన అప్పులు : మంత్రి గొట్టిపాటి

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి పాలనలో విద్యుత్ వ్యవస్థ సర్వనాశనం అయిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. 'జగన్ పనితీరు, ఆలోచనా విధానం కారణంగా డిస్కమ్‌ల పనితీరు దారుణంగా పడిపోయింది. గడిచిన ఐదేళ్ల కాలంలో డిస్కమ్‌ల అప్పులు పెరిగిపోయాయి. వాటిని చూపించి కరెంటు బిల్లులను పెంచేశారు. విద్యుత్తు బిల్లుల పేరిట జగన్ ప్రజల రక్తం తాగారు. తన ఐదేళ్ల కాలంలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచేశారు. పోతూ పోతూ ట్రూ అప్ చార్జీల భారం రూ.18,000 కోట్లను వదిలేసి వెళ్లారు. జగన్ హయాంలో అప్పులు 79 శాతం పెరిగాయి. బాకీలన్నీ తీర్చాలంటే అప్పులు చేయాల్సిందే' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

రైతును మోసం చేస్తే ఉపేక్షించం: మంత్రి నాదెండ్ల

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదని ఎరువుల తయారీదారులు, డీలర్లను మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందుల తయారీదారులు, డీలర్లతో మంగళవారం ఆయన సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ... 'ఎరువులు, పురుగుమందుల అమ్మకాల విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. తూకం, ఎమ్మార్పీల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. యూరియా, డీఏపీ ధరలు, కొలతల్లో తేడాలు ఉన్న విషయం ఇటీవల తూనికలు, కొలతల శాఖ తనిఖీల ద్వారా బయటకి వచ్చింది. వీటిపై 252 కేసులు నమోదు చేశారు. కొత్తగా అమల్లోకి వచ్చిన యూనిట్ ప్రైస్ విధానాన్ని తయారీదార్లు తప్పకుండా అమలు చేయాలి. రాష్ట్రంలో ఎరువుల కొరత ఎక్కడా లేదు. ఉద్దేశపూర్వకంగా ఎవరిపైనా కేసులు పెట్టబోం. చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటాం' అని మనోహర్ స్పష్టం చేశారు.

ఫేక్ ప్రచారాలే వైసీపీ సిద్ధాంతం: ఎంపీ శబరి

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): 'ఫేక్ ప్రచారాలే వైసీపీ సిద్ధాంతం. అవే ఆ పార్టీ కొంప ముంచినా... కుక్కతోక వంకరలా జగన్‌రెడ్డి బుద్ధి మారలేదు. వై నాట్ 175 అంటూ ప్రగల్భాలు పలికి, 11 సీట్లకే పరిమితమైనా.. జగన్ రెడ్డి తీరులో మార్పు రాలేదు' అని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి విమర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'జగన్ ఫేక్ ప్రచారాలనే నమ్ముకున్నారు. అన్న క్యాంటీన్లపై విషం కక్కుతున్నారు. ఇంకా సమీక్ష దశలోనే ఉన్న అమ్మకు వందనంపై కూడా ఫేక్ ప్రచారానికి తెరదీశారు. భారతీరెడ్డి పత్రికలో సత్యమేవ జయతే అనే క్యాప్షన్‌ను అసత్యమేవ జయతే అని మార్చుకుంటే బాగుంటుందేమో? ఈసారి 11 సీట్లు కూడా రాక పార్టీనే మూసేసే పరిస్థితి వస్తుంది' అని ఎంపీ శబరి హెచ్చరించారు.

జగన్ విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి

● ఐదేళ్ల కాలానికి కొత్త పాస్‌పోర్ట్ జారీచేయాలని ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న ఏపీ మాజీ సీఎం జగన్ విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతించింది. పాస్‌పోర్ట్ గడువు ముగియడంతో పిటిషనర్ దరఖాస్తు మేరకు ఐదేళ్ల కాలానికిగాను కొత్త పాస్‌పోర్ట్ జారీచేయాలని పాస్‌పోర్ట్ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. సెప్టెంబర్ 3 నుంచి 25 వరకు కుమార్తె పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకునేందుకు యూకే వెళ్లడానికి పలు షరతులతో అనుమతిస్తున్నట్లు పేర్కొంది. ఏయే ప్రాంతాలకు వెళ్తున్నారనే వివరాలు, మొబైల్, ల్యాండ్ లైన్, ఈ-మెయిల్, ఫ్యాక్స్, కాంటాక్ట్ వివరాలు సమర్పించాలని పేర్కొంది.

మేం వద్దన్నా ఆ హెలికాప్టర్ పంపారు

● రాష్ట్ర ప్రభుత్వ అధికార వర్గాల వ్యాఖ్య

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): తాము వద్దని చెప్పినా వినకుండా గ్లోబల్ వెక్ట్రా కంపెనీ అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్‌ను పంపిందని, అది మార్గమధ్యంలోనే కూలిపోయిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వినియోగం కోసం ఈ కంపెనీ పంపిన హెలికాప్టర్ పుణెలో కూలిపోయిన వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సంబంధిత ప్రభుత్వ వర్గాలు మంగళవారం కొన్ని కీలక విషయాలు తెలిపాయి. 'చంద్రబాబు సీఎం హోదాలో బెల్ కంపెనీ తయారీ హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నారు. అగస్టా హెలికాప్టర్ కన్నా ఇది ధర తక్కువ. దాని అద్దె కూడా తక్కువే. బెల్ హెలికాప్టర్ తన ప్రయాణానికి సౌకర్యంగా ఉందని సీఎం చంద్రబాబు దానినే వాడుతున్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న హరియాణాలో బీజేపీ తమ ఎన్నికల ప్రచారం కోసం గ్లోబల్ వెక్ట్రా కంపెనీ వద్ద బెల్ హెలికాప్టర్‌ను అద్దెకు మాట్లాడుకొంది. దీంతో ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు వినియోగిస్తున్న బెల్ హెలికాప్టర్‌ను హరియాణాకు పంపి దాని బదులు అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ ఇస్తామని గ్లోబల్ కంపెనీ ప్రతిపాదన పంపింది. దాన్ని మేం ఒప్పుకోలేదు. అయినా వినకుండా అగస్టా హెలికాప్టర్‌ను పంపారు' అని ప్రభుత్వ వర్గాలు వివరించాయి.

కూటమి గెలుపుపై అనుమానాలను తీర్చండి

▸▸ సీఈవో వివేక్ యాదవ్‌కు వైసీపీ వినతి

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి గెలుపుపై అనుమానాలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేయండి' అని వైసీపీ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో సీఈవో వివేక్ యాదవ్‌కు ఆ బృందం వినతిపత్రం అందజేసింది. అనంతరం మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ... 'ఎన్నికల ఫలితాలపై మాకు ఉన్న అనుమానాలు రోజురోజుకు బలపడుతున్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉంది. ఓటింగ్ శాతంపై ఈసీ చేసిన భిన్న ప్రకటనలతో మా అనుమానాలు బలపడ్డాయి. దీనిపై మరోసారి ఈసీని కలిశాం' అని అన్నారు.

మాకు నామినేటెడ్ పోస్టులు పెంచండి

● చంద్రబాబును కోరిన ఏపీ బీజేపీ పెద్దలు

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఓ కొలిక్కి వస్తోంది. ఇప్పటికే కూటమి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు జనసేనకు 30 శాతం, బీజేపీకి 10 శాతం పదవులు ఇవ్వడానికి సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ సహ సంఘటనా కార్యదర్శి(ఆర్గనైజేషన్) శివప్రకాశ్.. ఉండవల్లి చంద్రబాబు నివాసానికి వెళ్లారు. టీటీడీ బోర్డులో కనీసం మూడైనా తమకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు స్పందిస్తూ... 'కేంద్రంలో పెద్దలు ఇప్పటికే కొన్ని పదవులు అడిగారు. కూటమి ఒప్పందం మేరకు పది శాతం ఇచ్చేందుకు కృషి చేస్తా' అని చెప్పినట్లు తెలిసింది.



సీఎం చంద్రబాబుతో ఆయన నివాసంలో భేటీ అయిన బీజేపీ జాతీయ నేత శివప్రకాశ్, ఎంపీ పురందేశ్వరి

అర్చకులకు శుభవార్త

● నెలవారీ వేతనం రూ.15 వేలకు పెంపు

● దేవదాయ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష



దేవదాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తదితరులు

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాల్లో పూజాదికాలు నిర్వహిస్తున్న అర్చకుల వేతనాలను భారీగా పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. నెలనెలా రూ.10 వేలు వేతనం పొందే అర్చకులకు ఇకపై రూ.15 వేలు ఇవ్వనున్నారు. ఈ నిర్ణయం ద్వారా 1,683 మంది లబ్ధిపొందనున్నారు. అలాగే ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. వేద విద్య చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారికి నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలని సూచించారు. నాయీబ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆత్మార్పణ చేసుకున్న రోజును దేవదాయ శాఖ పరంగా గుర్తించి అధికారికంగా నిర్వహించాలని కూడా నిశ్చయించారు. ఆర్యవైశ్య సంఘాల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో దేవదాయ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని దేవాలయాల ట్రస్టు బోర్డుల్లో అదనంగా మరో ఇద్దరు సభ్యులకు అవకాశమివ్వనున్నారు. రూ.20 కోట్లు కంటే ఎక్కువ ఆదాయం ఉండే ఆలయాల బోర్డుల్లో ప్రస్తుతం 15 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పుడు 17కి పెంచనున్నారు. బోర్డులో ఒక బ్రాహ్మణుడు, ఒక నాయీబ్రాహ్మణుడు తప్పకుండా ఉండేలా చూస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు సభ్యుల సంఖ్య పెంచి అవకాశం కల్పించనున్నారు.

ఆలయాల్లో పరిశుభ్రత..

దేవాలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరియాలని, అపచారాలకు చోటు ఉండకూడదని చంద్రబాబు సమీక్షలో స్పష్టం చేశారు. 'భక్తుల మనోభావాలకు, ఆగమశాస్త్ర నిబంధనలకు అత్యంత ప్రాధాన్యతం ఇచ్చేలా దేవదాయ శాఖ అధికారులు పని చేయాలి. భక్తులు ప్రశాంతత కోసం, తమ బాధలు దేవుడితో చెప్పుకోవడం కోసం గుళ్లకు వస్తారు. వారికి మంచి దర్శనం, చక్కటి వాతావరణం కల్పించాలి. దేవాలయాల్లో పరిశుభ్రత, ప్రసాదంలో నాణ్యత, ప్రశాంత వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకోవాలి. ఏ కుటుంబమైనా పుణ్యక్షేత్రానికి వస్తే ఒకట్రెండు రోజులు అక్కడే ఉండే వాతావరణం కల్పించాలి. సులభతర దర్శనం, నాణ్యమైన సేవలు, బస చేయడానికి అనువైన కాటేజీలు, గదులు ఉండాలి. వారి జేబులు ఖాళీ చేసేలా కాకుండా.. వారు ఇష్టంగా అక్కడ గడిపే పరిస్థితి ఉండాలి. టెంపుల్ టూరిజంకు మన దగ్గర అనేక అవకాశాలున్నాయి. వాటి అభివృద్ధికి ప్రణాళికలతో రావాలి' అని సూచించారు. మతపరమైన టూరిజం ప్రోత్సాహానికి దేవదాయ, అటవీ, పర్యాటక శాఖల మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా బలవంతపు మత మార్పిడులు ఉండకూడదని, పటిష్ఠ చర్యలతో వాటిని అడ్డుకోవచ్చని, ఆ దిశగా కార్యక్రమాలు అమలు చేయాలని సీఎం ఆదేశించారు. అదే విధంగా దేవాలయాల్లో అన్య మతస్థులు ఉండకూడదని చెప్పారు.

సీజీఎఫ్, శ్రీవాణి పనులు నిలిపివేత..

కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్), శ్రీవాణి ట్రస్టు నిధులతో గత ప్రభుత్వం కొన్ని పనులు ప్రతిపాదించింది. అందులో కొన్ని పట్టాలెక్కగా, కొన్ని ప్రారంభం కాలేదు. ఇప్పటికే మొదలైన పనులను పూర్తిచేయాలని సీఎం సూచించారు. మొదలే కాని పనులను నిలిపివేసి మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. సీజీఎఫ్ కింద 243 పనులు ప్రారంభం కాలేదని, శ్రీవాణి ట్రస్టు కింద 1,797 దేవాలయాల పనులు ప్రారంభం కాలేదని అధికారులు వివరించారు. శ్రీవాణి ట్రస్టు కింద చేపట్టే దేవాలయాలు, ఇతర నిర్మాణాలపై చర్చించి.. అవసరమైతే నిధులు పెంచి పనులు ప్రారంభిద్దామని ఆయన చెప్పారు. గతంలో పల్లెల్లో, వాడల్లో శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు ఇచ్చేవారని, ఈ మొత్తంతో ఆలయాల నిర్మాణాలు సాధ్యం కావడం లేదని అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని పెంచడానికి, రెట్టింపు చేసి ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతి వాడలో దేవాలయం ఉండేలా చూడాలన్నారు. దేవాలయ ఆస్తుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ హారతులు మళ్లీ నిర్వహించాలన్నారు. ప్రతి దేవాలయంలో ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని, అన్ని సర్వీసులు ఆన్‌లైన్ ద్వారా అందాలని చెప్పారు. గుడికి వచ్చే భక్తులు దర్శనం చేసుకుని వెళ్లడమే కాకుండా ప్రత్యేక పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని.. అవసరమైతే ప్రైవేటు భాగస్వామ్యంతో హోటళ్ల నిర్మాణం చేపట్టి వసతులు కల్పించాలని ఆదేశించారు. దేవాలయాలకు విరాళాలిచ్చే వారిని ప్రోత్సహించాలని, వారి పేర్లు ప్రకటించాలని సూచించారు. గతంలో ఆలయాల్లో జరిగిన పలు ఘటనలపై లోతుగా విచారణ జరపాలని, రానున్న రోజుల్లో స్పష్టమైన మార్పులు కనిపించాలని తేల్చిచెప్పారు. సమీక్షలో దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్ర వల్లే జైలుకెళ్లా

● జగన్, భారతీరెడ్డి, అవినాశ్‌రెడ్డి అనేక ఇబ్బందులు పెట్టారు: దస్తగిరి



కడప (మారుతీనగర్), ఆగస్టు 27: "తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే.. అది నాకైనా... ఇతరులకైనా..." అని వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో అప్రూవర్ దస్తగిరి అన్నారు. వైసీపీ కుట్రవల్లే తాను జైలుకి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో తననూ, తన కుటుంబాన్ని అనేక రకాలుగా వేధించారని ఆరోపించారు. అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన భార్య భారతీరెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి, వివేకా హత్యకేసులో ఏ-5 నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తనను ఇబ్బందులకు గురిచేశారన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప సెంట్రల్ జైలులో ఉన్న తన వద్దకు 2023 నవంబరు 28న మెడికల్ క్యాంపు పేరుతో శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి వచ్చి బెదిరించారన్నారు. ఆ విషయం వైసీపీకి తొత్తుగా వ్యవహరిస్తున్న అప్పటి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. చైతన్యరెడ్డి ఆ రోజు తన బ్యారక్ వద్దకు వచ్చి బెదిరించిన సంగతిని తన తోటి ఖైదీలను, లేదా సంబంధిత అధికారులను విచారించినా సాక్ష్యం చెబుతారన్నారు. ఆ రోజున అదే జైలులో మరో బ్యారక్‌లో టీడీపీ నేత బీటెక్ రవి కూడా ఉన్నారన్నారు. ఆయనను విచారించినా నిజాలు బయటకు వస్తాయన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా మెడికల్ క్యాంపు జరిగిందని, ఆ రోజున చైతన్య రెడ్డి తనవద్దకు వచ్చి బెదిరించే సమయానికి అక్కడి సీసీ కెమెరాలు సైతం పనిచేయకుండా చేశారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో వివేకా హత్య కేసులో న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. తనకు, తన కుటుంబానికి వైసీపీ నాయకుల వల్ల జరిగిన అన్యాయాలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి ఫిర్యాదు చేస్తానన్నారు. అలాగే వైసీపీ నాయకులు తన పట్ల చేసిన ఆగడాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా త్వరలోనే వారిని కలుస్తానన్నారు.

కవితకు బెయిల్

● ఢిల్లీ మద్యం కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అయిదు నెలలకు పైగా తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు విముక్తి లభించింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి నమోదైన మనీలాండరింగ్, అవినీతి కేసుల్లో ఆమెకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. విచారణ సందర్భంగా.. కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీల తీరును అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. నిందితుల్లో ఇష్టానుసారంగా కొందరిని ఎంపిక చేసుకొని అప్రూవర్లుగా మార్చుకోవటం ఏమిటని ప్రశ్నించింది. అలాగే, మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 45(1) కింద మహిళలకు బెయిల్ మంజూరు చేసే నిబంధనను.. కవిత రాజకీయ నాయకురాలు అయినందున వర్తింపజేయలేమన్న ఢిల్లీ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఏ స్థానంలో ఉన్నా మహిళ.. మహిళేనని పేర్కొంది. ఈ మేరకు, బెయిల్ ఇవ్వటానికి నిరాకరిస్తూ హైకోర్టు జూలై 1వ తేదీన ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. కవిత ఈ రెండు కేసుల్లోనూ రూ.10 లక్షల చొప్పున పూచీకత్తులు సమర్పించాలని, పాస్‌పోర్టును విచారణ కోర్టు న్యాయమూర్తి వద్ద డిపాజిట్ చేయాలని, సాక్షులను ప్రభావితం చేయడం కానీ బెదిరించడం కానీ చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు విచారణలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని పేర్కొంది. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో, స్థానిక ఢిల్లీ కోర్టు జైలు నుంచి కవిత విడుదలకు అనుమతిస్తూ రిలీజ్ వారెంట్లను జారీ చేసింది. దీంతో తిహాడ్ జైలు నుంచి కవిత విడుదలయ్యారు.

కవితపై దర్యాప్తు పూర్తయింది!

జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం కవితకు బెయిల్ ఇచ్చేందుకు గల కారణాలను వివరించింది. ఢిల్లీ మద్యం కేసులో కవితకు సంబంధించి ఈడీ, సీబీఐ దర్యాప్తు ఇప్పటికే పూర్తి చేశాయని గుర్తు చేసింది. కాబట్టి, ఆమె ఇంకా కస్టడీలో ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కేసుపై ఢిల్లీ స్థానిక కోర్టులో జరుగుతున్న విచారణను ప్రస్తావిస్తూ.. కేసులో మొత్తం 493 మంది సాక్షులున్నారని, 50 వేల పేజీల పత్రాల ఆధారాలు ఉన్నాయని.. అంతమంది సాక్షులను విచారించి, ఆయా ఆధారాలను కింది కోర్టు పరిశీలించి విచారణను పూర్తి చేయటం సమీప భవిష్యత్తులో సాధ్యమయ్యేది కాదని తేల్చి చెప్పింది. కాబట్టి బెయిల్ మంజూరు చేస్తున్నామని తెలిపింది. సీబీఐ, ఈడీ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. కేసులో కొందరు అప్రూవర్లు కవితకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చారని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'మీరు నిజాయితీగా ఉండాలి. కేసులో నిందితుడైన వ్యక్తినే సాక్షిగా మారుస్తున్నారు. రేపు ఎవరినైనా మీ ఇష్ట ప్రకారం ఎంచుకుని అప్రూవర్‌గా తీసుకోవచ్చు. ఇతరులను నిందితులుగా పేర్కొనవచ్చు. ఇదేం పద్ధతి' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. అంతకుముందు, కవితను ప్రశ్నించటానికి సమన్లు జారీ చేసినప్పుడే ఆమె తన సెల్‌ఫోన్‌లో కాల్ రికార్డులను, ఫేస్‌టైమ్ డాటాను తొలగించి ఫార్మాట్ చేశారని ఎస్వీ రాజు తెలిపారు. దీనిపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ.. ఫోన్ అనేది ప్రైవేటు ఉపకరణమని, ఎవరైనా ఫోన్‌లోని వివరాలు ఇతరులతో పంచుకుంటారా అని ప్రశ్నించారు. మెసేజీలను తొలగించడం మామూలేనని, తనకు కూడా ఆ అలవాటు ఉందన్నారు.



తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద టీడీపీ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

సీఐ సారీ చెప్పాల్సిందే!

▸▸ తాడిపత్రిలో ఇసుక అక్రమ రవాణాపై ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి నిరసన

▸▸ కేసు నమోదు చేయాలని సీఐపై ఒత్తిడి

▸▸ మాట వినలేదని స్టేషన్ వద్ద స్వయంగా ధర్నా

▸▸ ఉన్నతాధికారుల సూచనతో సీఐ క్షమాపణ..

▸▸ అధికారపార్టీ ఎమ్మెల్యే దూకుడుపై విమర్శల వెల్లువ

తాడిపత్రి, ఆగస్టు 27: ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో సీఐ సారీ చెప్పాల్సిందేనని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి భీష్మించారు. అనుచరులతో కలిసి పోలీసు స్టేషన్ వద్ద స్వయంగా ధర్నాకు దిగారు. చివరికి ఉన్నతాధికారుల ఒత్తిడితో సీఐ సారీ చెప్పడంతో శాంతించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో మంగళవారం ఉద్రిక్తతకు దారితీసిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తాడిపత్రి మండలం ఆలూరు, సజ్జలదిన్నె, వీరాపురం సమీపంలోని పెన్నా పరీవాహక ప్రాంతం నుంచి సోమవారం రాత్రి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎమ్మెల్యే బృందం అడ్డుకుంది. దీంతో టిప్పర్ యజమానులు, ఇసుక తరలింపుదారులు వారితో వాగ్వాదానికి దిగి దాడికి దిగడంతో ఎమ్మెల్యే అనుచరులు ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నాలుగు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. అయితే ఇసుక టిప్పర్లను సీజ్ చేయకుండా సీఐ లక్ష్మీకాంతరెడ్డి వదిలిపెట్టారని, తమపై దాడి జరిగినా కేసు నమోదు చేయలేదని మంగళవారం ఉదయం అనుచరులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో సీఐకి ఎమ్మెల్యే ఫోన్ చేసి ఇసుక అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేయాలని కోరారు. అయితే సీఐ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, మధ్యలోనే ఫోన్ కట్ చేశారని ఆగ్రహించిన ఎమ్మెల్యే.. నేరుగా రూరల్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి ధర్నాకు దిగారు. డీఎస్పీ జనార్దన్‌నాయుడు, పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ వచ్చి ఎమ్మెల్యేకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో ఎస్పీ జగదీశ్‌కు ఫోన్ చేసి మాట్లాడించారు. అయినా ఎమ్మెల్యే పట్టు వీడకపోవడంతో పోలీసు ఉన్నతాధికారులు సీఐతో మాట్లాడారు. దీంతో సీఐ వీడియో కాల్ చేసి ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పడంతో ఆయన ఆందోళన విరమించారు. కాగా, ధర్నా జరుగుతున్న సమయంలోనే యల్లనూరు రోడ్డులోని సీఐ ఇంటిని ముట్టడించేందుకు టీడీపీ శ్రేణులు వెళ్లాయి. సెక్యూరిటీ అడ్డుకోవడంతో అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశాయి. మరోవైపు.. ఏదైనా సమస్య వస్తే ఉన్నతాధికారులకు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాల్సిన అధికార పార్టీ ఎమ్మెల్యేనే నేరుగా పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగడంపై విమర్శలు వినిపించాయి.

4ఎకరాలు.. 30 లక్షలు!

మేం చెప్పిందే ధర.. ఇస్తావా.. చస్తావా?

● ఎమ్మెల్యే గళ్లా మాధవి భర్త రామచంద్రరావు దందా

● బాధితుడు కమ్మ వెంకట్రావు ఆరోపణ

గుంటూరు, ఆగస్టు 27: 'నాలుగెకరాలకు రూ.30 లక్షలిస్తాం.. ఆ పొలం అమ్మేయ్.. లేకుంటే బైక్‌తో ఢీకొట్టి చంపేస్తాం' అంటూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి భర్త గళ్లా రామచంద్రరావు బెదిరిస్తున్నారని క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన కమ్మ వెంకట్రావు వాపోయారు. బెదిరించడమే కాదు.. తనను, తన కొడుకును బైక్‌తో ఢీకొట్టి, కిందపడిపోయిన తమపై తీవ్రంగా దాడి చేశారని, పోలీస్ స్టేషన్‌కు వెళితే ఫిర్యాదే తీసుకోలేదని వాపోయారు. ఎమ్మెల్యే భర్త రామచంద్రరావు నుంచి తమకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ మంగళవారం బాధితులు గుంటూరు కోర్టుకు వచ్చారు. టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన కమ్మ వెంకట్రావు పిడుగురాళ్ల సమీపంలో 8 ఎకరాల పొలం కొన్నారు. గతేడాది భ్రమరా టౌన్‌షిప్ అధినేత గళ్లా రామచంద్రరావు 4.90 ఎకరాల పొలాన్ని కొనేందుకు ఒప్పందం చేసుకున్నాడని వెంకట్రావు తెలిపారు. ఎకరం రూ.48 లక్షల చొప్పున అమ్మేందుకు గతేడాది ఏప్రిల్ 4న అగ్రిమెంట్ రాసుకున్నామని, రామచంద్రరావు 18 లక్షల చొప్పున 3 చెక్కులు, ఐదు లక్షల నగదు ఇచ్చాడని తెలిపారు. వీటిలో ఒక చెక్కు మాత్రమే చెల్లిందని, మిగిలిన రెండూ బౌన్స్ అయ్యాయయని తెలిపారు. దీంతో తనకు మొత్తంగా రూ.23 లక్షలు మాత్రమే ముట్టాయని చెప్పారు. ఒప్పందం చేసుకున్న 4.90 ఎకరాలతో పాటు రోడ్డు ఫేసింగ్‌లో ఉన్న 3.07 ఎకరాల పొలాన్ని కూడా ఆక్రమించేందుకు రామచంద్రరావు ప్రయత్నించాడని చెప్పారు. తాను ఒప్పందం చేసుకున్న పొలంలో నిర్మాణాలు కూడా ప్రారంభించాడన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే అందులో షెడ్డు నిర్మించడంతో తాను గురజాల కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నానని, కోర్టు ఉత్తర్వులను వారికి అందజేయడానికి వెళితే ఎమ్మెల్యే భర్త అనుచరులు తన వెంట పడ్డారని వెంకట్రావు వాపోయారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రామచంద్రరావు ఈ ఏడాది ఫిబ్రవరి 23న అగ్రిమెంట్ చేసుకున్న 4.90 ఎకరాలకుగాను 3.90 ఎకరాలకు పూర్తి సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. ఆపై రోడ్డు ఫేసింగ్‌లో ఉన్న మూడెకరాలతోపాటు ఒప్పందం చేసుకున్న దానిలో మిగిలిన ఎకరం కూడా తనకే విక్రయించాలని రామచంద్రరావు అడిగాడని, అయితే సొమ్ము పూర్తిగా చెల్లిస్తేనే భూమి రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పానన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఆయన భార్య గళ్లా మాధవి ఎమ్మెల్యేగా పోటీ చేసి, గెలిచారు. ఎన్నికలు పూర్తయ్యాక మొత్తం సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటానని చెప్పిన రామచంద్రరావు.. తన భార్య ఎమ్మెల్యే అయ్యాక.. తాను చెప్పిన ధరకే మిగిలిన నాలుగెకరాలు రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరిస్తున్నాడని తెలిపారు.

బర్త్ డే గిఫ్ట్‌గా ఇచ్చెయ్!

రామచంద్రరావు అనుచరులు తనను కలిసి.. రూ.30 లక్షలు తీసుకుని 4 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరిస్తున్నారని వెంకట్రావు వాపోయారు. అందుకు తాను ఒప్పుకోకపోవడంతో గుండా సుబ్బారావు, కొల్లి సాంబిరెడ్డి, మురళి తదితరులు రూ.30 లక్షలకే పొలం అమ్మాలని తనపై ఒత్తిడి చేశారని చెప్పారు. ఎమ్మెల్యే భర్త చెప్పినా వినకపోవడం ఏమిటని బెదిరించారన్నారు. ఒకటి రెండు సార్లు రామచంద్రరావు కూడా నెట్ కాల్‌లో ఫోన్ చేసి బెదిరించాడన్నారు. నీపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టిస్తామని రామచంద్రరావు అనుచరులు బెదిరించారన్నారు. ఇటీవల రామచంద్రరావు పుట్టిన రోజును పురస్కరించుకొని బర్త్‌డే గిఫ్టుగా భూమి ని రిజిస్ట్రేషన్ చేస్తావా లేదా? అని తీవ్రంగా బెదిరించారన్నారు. తాను ఒప్పుకోకపోవడంతో.. బైక్‌తో ఢీకొట్టి చంపేస్తామని హెచ్చరించారని తెలిపారు. 4 రోజుల కిందట తన కుమారుడు హరికృష్ణతో కలిసి క్రికెట్ పాయింట్‌కు వెళ్లి వస్తుండగా విద్యానగర్ మూడో లైన్‌లో బైక్‌పై వచ్చి ఢీ కొట్టారని, కిందపడిపోయిన తమపై విచక్షణా రహితంగా దాడి చేశారని వెంకట్రావు తెలిపారు. తన బైక్‌ను కూడా వాళ్లే తీసుకుపోయారని చెప్పారు. ఆతర్వాత తాము న్యాయవాది మాగులూరి హరిబాబును సంప్రదించగా ఆయన ఐజీని కలసి ఫిర్యాదు చేశారన్నారు. వెంకట్రావుపై దాడి చేసి కొట్టినవారే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తప్పుడు ఫిర్యాదు చేస్తే అట్రాసిటీ కేసు నమోదు చేశారని హరిబాబు తెలిపారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

చెరువు భూమిని ఆక్రమించి లేఅవుట్!

● వైసీపీ మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిపై ఫిర్యాదు

● అందులో అమలాపురం ఆర్డీవోకూ వాటా?

● టీడీపీ నేత చంద్రశేఖర్ వెల్లడి

● కేంద్ర కార్యాలయంలో వినతుల వెల్లువ

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో భూ ఆక్రమణలు, కబ్జాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఆమదాలచెరువుకు సంబంధించిన ఐదెకరాల భూమిని వైసీపీ కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆక్రమించి లే అవుట్ వేశారని రావులపాలెం తెలుగు యువత అధ్యక్షుడు కోట చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. ప్రజా వినతుల కార్యక్రమంలో భాగంగా మంగళవారమిక్కడ టీడీపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి అక్రమ లేఅవుట్‌పై చంద్రశేఖర్ వినతిపత్రం ఇచ్చారు. అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు కూడా ఈ అక్రమ లే అవుట్‌లో భాగస్వామి అని, అందుకే ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండా పోయిందని తెలిపారు. తనకు వారసత్వంగా వచ్చిన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారని, కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా తన భూమిని వదలలేదని తిరుపతికి చెందిన మల్లికార్జునరావు వాపోయారు. కడప జిల్లా కాశినాయన మండలం సావిశెట్టిపల్లి గ్రామంలో దళిత కుటుంబాలకు చెందిన 63 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తమ్ముడు, జడ్పీటీసీ సభ్యుడైన దేవసాని సత్యనారాయణ రెడ్డి, అతని అనుచరులు ఆక్రమించుకున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్తే తన భూమిని ఆక్రమించారని, దానిని తిరిగి తనకు ఇప్పించాలని గుంటూరు జిల్లా కాకుమాను మండలం చల్లగిరి అంకమ్మరావు అభ్యర్థించారు.

నా కొడుకును పోలీసులు కొట్టి చంపారు

వైసీపీ హయాంలో పోలీసులు తన కొడుకును కొట్టి చంపారని అనంతపురం జిల్లా యల్లనూరు మండలం జంగాలపల్లి చెందిన మాదినేని రామాంజనమ్మ ఫిర్యాదు చేశారు. తీసుకున్న అప్పు తిరిగి కడతామని చెప్పినా స్టేషన్లో తీవ్రంగా కొట్టడంతో తన కుమారుడు చనిపోయాడని, కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు..

అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం

- మునిసిపల్ స్థలాలను పరిరక్షిస్తాం
- 'హైడ్రా' తరహా సంస్థను ఇక్కడా ఏర్పాటు చేస్తాం
- భవనాలు నిర్మించుకున్నా వదిలేది లేదు: మంత్రి నారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ. చిత్రంలో ఎంపీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో 123 పురపాలక సంఘాలున్నాయి. వాటికి చెందిన స్థలాలను ఎవరైనా ఆక్రమించుకుంటే తక్షణమే స్వచ్ఛందంగా వదిలేసుకోండి. లేదంటే మేమే వచ్చి కూల్చేస్తాం. ప్రజాపయోగం కోసం ఉద్దేశించిన పార్కులను కూడా ఆక్రమిస్తున్నారు. అలాంటివి ఉపేక్షించేది లేదు. భవనాలు నిర్మించుకున్నామని, ఎలా వదిలేస్తామని ఎవరైనా అనుకుంటే తప్పు. అవసరమనుకుంటే హైదరాబాద్‌లో మాదిరిగా ఏపీలో కూడా 'హైడ్రా' తరహా సంస్థను ఏర్పాటుచేసి చర్యలు చేపడతాం' అని పురపాలక శాఖామంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ఆయన వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. భవనాల నిర్మాణం, లేఅవుట్లకు అనుమతులు మరింత వేగంగా ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందని, ఇవన్నీ నెల రోజుల్లో పూర్తి చేసి, వెంటవెంటనే అనుమతులు వచ్చేలా చేస్తామని చెప్పారు.

విశాఖ మాస్టర్ ప్లాన్‌లో అవకతవకలు

విశాఖలో వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో తప్పులున్నాయని తన దృష్టికి వచ్చిందని, దానిపై చర్చించి, ప్రజల అభీష్టం మేరకు మార్పులు చేస్తామని చెప్పారు. ఒక ప్రాంతంలో పోరంబోకు కాలువ పైనుంచి రహదారిని ప్రతిపాదించారని ఫిర్యాదు వచ్చిందని, అది అధికారులు చేసిన తప్పుగా గుర్తించి, మార్చాలని ఆదేశించామన్నారు. రెరా నుంచి కూడా అనుమతులు రావడం ఆలస్యం అవుతున్నదని విలేకరులు ప్రస్తావించగా టౌన్ ప్లానింగ్ డైరెక్టరేట్‌లో కొన్ని సమస్యలున్నాయని, వారితో మాట్లాడానని చెప్పారు. రుషికొండపై జగన్ ప్రభుత్వం రూ.500 కోట్లతో నిర్మించిన రాజమహల్‌ని ఏమిచేయాలనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వర్గాలతో చర్చిస్తున్నారని మంత్రి వివరించారు. జగన్ ప్రభుత్వం ప్రజావేదికను కూల్చివేసినట్టు కూల్చివేయడం కుదరదని, అది ప్రజాధనంతో నిర్మించినదని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లు

రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో 13 చెత్త నుంచి సంపద సృష్టించే ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారని మంత్రి నారాయణ తెలిపారు. ఆరు నెలల్లో మునిసిపల్ వ్యవస్థను గాడిన పెడతామని చెప్పారు. టీడీఆర్ బాండ్లలో అవినీతిని వెలికితీసేందుకు కమిటీని నియమించామని, సెప్టెంబరు నెలాఖరుకు నివేదిక ఇస్తుందన్నారు. టీడీఆర్ బాండ్ల లెక్క తేలుస్తామన్నారు.

విషజ్వరాలతో ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదు

- సీజనల్ వ్యాధులపై నిపుణుల కమిటీ ఏర్పాటు: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలతో ఎవరూ ప్రాణాలు కోల్పోవడానికి వీల్లేదని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా.. వాటి నియంత్రణ కోసం సలహాలు ఇచ్చేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. వెలగపూడిలోని సచివాలయంలో సీజనల్ వ్యాధులపై ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ కమిషనర్ ఛైర్మన్‌గా, డీహెచ్ కన్వీనర్‌గా కమిటీని కూడా ప్రకటించారు. డెంగీ, చికున్ గున్యా, మలేరియాతో రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదని, జిల్లా కలెక్టర్లు వారానికోసారి జ్వరాలు, సీజనల్ వ్యాధులపై సమీక్షించాలని సూచించారు. కేసుల్ని గుర్తించడం, రిఫర్ చేయడం, చికిత్స అందించడం, తరచూ విజిట్ చేయడం, ఆన్‌లైన్ రిపోర్టింగ్ వంటి పనుల్ని నిపుణుల కమిటీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఇటీవల తాను పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించినప్పుడు వార్డుల్లో జ్వరపీడితులు ఉండడాన్ని గమనించినట్లు చెప్పారు. విషజ్వరాల్ని కట్టడి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అనేకసార్లు సమీక్షించినా పెద్దగా పురోగతి కనిపించడంలేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా చికున్ గున్యా!



రాష్ట్రంలోని 9 జిల్లాల్లో పరిస్థితి తీవ్రం.. మంచం పట్టిన పల్లెలు

- ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తున్న జ్వరాలు
- జ్వరం, కీళ్ల నొప్పులు, ఒంటిపై ర్యాష్‌తో రోగుల ఇబ్బందులు
- చికున్ గున్యాగా నిర్ధారించిన పుణె ల్యాబ్

గుంటూరు మెడికల్, ఆగస్టు 27: చికున్ గున్యా జ్వరాలు రాష్ట్రంపై దండెత్తాయి. పలు జిల్లాల్లో చికున్ గున్యా లక్షణాలున్న జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జ్వరం, కీళ్ల నొప్పులు, కీళ్లు బిగుసుకుపోయి నడవలేకపోవడం వంటి లక్షణాలతోపాటు కాళ్లు, చేతుల వాపు, ఒంటిపై ర్యాష్‌తో రోగులు బాధపడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ తరహా జ్వరాలు వెలుగులోకి రావడంతో వైద్య ఆరోగ్య శాఖాధికారులు రోగుల నుంచి సీరం నమూనాలను సేకరించి పరీక్షించారు. ఇక్కడ వ్యాధి నిర్ధారణ పరీక్ష కిట్లలో అవి చికున్ గున్యా జ్వరాలుగా నిర్ధారణ కాలేదు. అనంతరం 12 సీరం నమూనాలను పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపగా అవి చికున్ గున్యా జ్వరాలుగా నిర్ధారణ అయ్యింది. చికున్ గున్యా జ్వరాలు రెండు దశాబ్దాల కిందట తొలిసారి ఉమ్మడి రాష్ట్రంలో వెలుగులోకి వచ్చాయి. జ్వరం, కీళ్ల నొప్పులు, కీళ్లు బిగుసుకుపోయి నడవలేకపోవడం వంటి లక్షణాలతో అప్పట్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అవే లక్షణాలతో చికున్ గున్యా జ్వరాలు మళ్లీ రాష్ట్రంలో విజృంభిస్తున్నాయి.

మంచం పడుతున్న పల్లెలు

చికున్ గున్యా జ్వరాలతో ఊళ్లకు ఊళ్లు మంచానపడుతున్నాయి. తూర్పుగోదావరి, అనంతపురం, పశ్చిమగోదావరి, విశాఖ, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, అల్లూరి, గుంటూరు జిల్లాల్లో ఈ జ్వరాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. మంగళగిరి నియోజకవర్గంలోని తుమ్మపూడిలో 300 మంది ఈ జ్వరాల బారినపడి మంచం పట్టారు. రెండు నెలలుగా ఇక్కడ జ్వరాలు విజృంభిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం అచ్చంపేటలో వందల మంది జ్వరపీడితులు ఉన్నారు. ఇవి వైరల్ ఫీవర్లు కావడంతో ఇంట్లో ఒకరు జ్వరం బారినపడితే.. ఇంటిల్లిపాదీ వీటికి గురౌతున్నారు. బాధితుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరం తగ్గుతున్నా, కొంతకాలం వరకు కీళ్ల నొప్పులు వదలటం లేదు. మెజార్టీ రోగుల్లో 4-6 వారాల పాటు కీళ్ల నొప్పులు వేధిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుత జ్వరాలు ప్రమాదకరం కాదని, సింప్టమ్యాటిక్ ట్రీట్‌మెంట్‌తోనే తగ్గుతున్నాయని వైద్యులు చెప్పడం కాస్త ఉపశమనం. నాలుగు రోజుల్లో జ్వరాలు తగ్గిపోతున్నా.. కీళ్ల నొప్పులు అధికంగా ఉన్న రోగులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాల్సి వస్తోంది.

'స్కిల్' కేరాఫ్ ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే ప్రకటించారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ ఫైలుపైనే ఆయన ఐదో సంతకం పెట్టారు. స్కిల్ వర్సిటీ ఏర్పాటు అంశాన్ని ఇటీవల కడప జిల్లా మైసూరావారిపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో ఓ మహిళ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వర్సిటీ అవసరం, రాష్ట్రంలోని పరిస్థితులపై అధికారులతో ఆయన చర్చించినట్లు సమాచారం. సమగ్ర అధ్యయనం అనంతరం సీఎం దృష్టికి తీసుకెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై కేబినెట్‌లో చర్చించి వర్సిటీ ఏర్పాటుకు అడుగులు వేస్తే రాష్ట్రం నైపుణ్యాభివృద్ధి శిక్షణకు హబ్‌గా మారుతుందని భావిస్తున్నారు.

ఇంటింటా స్కిల్ సెన్సెస్

యువతలోని నైపుణ్యాలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 15 నుంచి 59ఏళ్ల వయసున్న దాదాపు 3.5 కోట్ల మంది నైపుణ్యాలు, వారి ఆసక్తుల సమాచారం సేకరిస్తారు. ఆ తర్వాత వారి నైపుణ్యాలను పెంచడంపై దృష్టి సారిస్తారు. యువత మాత్రమే కాకుండా గృహిణులు, రైతులు, వడ్రంగి, కుమ్మరి తదితర వృత్తుల్లోని వారినీ పరిగణనలోకి తీసుకుంటారు.

దేశంలోనే మోడల్ వర్సిటీ

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. యువతకు అవసరమైన రంగాల్లో శిక్షణను అందిస్తారు. ఈ కేంద్రాలన్నీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ వర్సిటీకి అనుబంధంగా ఉంటాయి. వీటిల్లో శిక్షణ పొందిన యువతకు ఈ వర్సిటీ ద్వారా సర్టిఫికెట్లు అందిస్తారు. అవి ఉన్నవారికి ఉద్యోగాల ఎంపికలో ప్రాధాన్యం ఇస్తారు. దేశంలోనే మోడల్‌గా ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. నైపుణ్య శిక్షణ కోసం కేంద్రం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు భారీగా నిధులు విడుదల చేస్తోంది. విద్యాసంస్థలకు, శిక్షణ సంస్థలకు విడివిడిగా నిధులు ఇవ్వడం వల్ల ఏదో మొక్కుబడిగా ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో ఈ కార్యక్రమం నైపుణ్య వర్సిటీ నేతృత్వంలో చేపడితే మరింత ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతో పాటు ఈ వర్సిటీకి యూజీసీ గ్రాంట్లు సమకూర్చుకునే అవకాశం ఉంటుంది.

ఉద్యోగాలున్నా నైపుణ్యం ఏదీ?

గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో పరిశ్రమలు వచ్చిన దాఖలాల్లేవు. ఉద్యోగాల కొరత కారణంగా యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోవాల్సి వచ్చింది. పైగా స్థానికులకు 70 శాతం ఉద్యోగాలంటూ జగన్ సర్కారు తెచ్చిన చట్టం అమలు కానేలేదు. పైగా దీని దెబ్బకు కొత్తగా పరిశ్రమలు వచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల్లో నిపుణులైన సిబ్బంది లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. యువతలో తగిన నైపుణ్యాలు లేకపోవడంతో ఉద్యోగాలకు ఎంపిక కావడం లేదు. ఈ పరిశ్రమలకు స్కిల్ వర్సిటీ మానవ వనరుల కేంద్రంగా మారే అవకాశం ఉంది.

ఏ విద్యార్హతలకైనా నైపుణ్య శిక్షణ

ఈ వర్సిటీ ద్వారా టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసినవారికి వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ తీసుకునే వారికి ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ సర్వీసుల్లోకి వచ్చేవారికి సైతం నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకునేలా నిబంధనలు రూపొందిస్తారు. దీంతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర వృత్తి కోర్సులను కూడా చేర్చి సంపూర్ణ నైపుణ్యాభివృద్ధి వర్సిటీగా తీర్చిదిద్దాలని యోచిస్తున్నారు. రాష్ట్రంలో ఏ పరిశ్రమలో ఉద్యోగం చేయాలన్నా, ప్రభుత్వ సర్వీసులో పని చేయాలన్నా ఈ వర్సిటీ నుంచి సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. స్కిల్ వర్సిటీకి కేంద్ర సాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులను కూడా వినియోగిస్తారు. పరిశ్రమల నుంచి వసూలు చేసే సెస్ నుంచీ నిధులు సమకూర్చుకునే అవకాశం ఉంది. శిక్షణ ఉచితమే అయినా నామమాత్రపు ఫీజు వసూలు చేయడం ద్వారా వర్సిటీని ఆర్థికంగా పరిపుష్టం చేసే యోచన కూడా ఉంది.

చీకటి చెర వీడింది!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వులు జీవోఐఆర్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. జీవోల స్వభావాన్ని బట్టి జీవో ఎంఎస్, ఆర్‌టీ, పీ నెంబర్లతో విడుదల చేయనున్నారు. కాంపిటెంట్ అథారిటీ సంతకం, లేదా ఆమోదించిన తర్వాతే వెబ్‌సైట్‌లో జీవోలను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈనెల 29 నుంచి అన్ని శాఖలు జీవోలను జీవోఐఆర్ వెబ్ పోర్టల్‌లోనే అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గతం నుంచి ఈ నెల 28 తేదీ సాయంత్రం వరకు మాన్యువల్‌గా ఇచ్చిన జీవోల అన్ని వివరాలను సచివాలయంలోని అన్ని శాఖల ఓపీ విభాగాలు ఐటీ కమ్యూనికేషన్ విభాగానికి అందజేయాలని పేర్కొన్నారు. సచివాలయంలోని అన్ని విభాగాలకు జీవోఐఆర్ వెబ్ పోర్టల్ లాగిన్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. మాన్యువల్‌గా విడుదల చేసిన జీవోల రిజిస్టర్లను ఓపీ సెక్షన్ ఆధ్వర్యంలో సురక్షితంగా ఉంచాలని ఆదేశించారు.

జీవోఐఆర్ వెబ్‌పోర్టల్ చరిత్ర ఇదీ...

2008లో అప్పటి ప్రభుత్వం జీవోఐఆర్‌లో జీవోలను విడుదల చేసే విధానానికి శ్రీకారం చుట్టింది. అంతకుముందు ప్రభుత్వంలోని ప్రతి శాఖ జీవోల విడుదలను మాన్యువల్‌గా అంటే 3 రకాల రిజిస్టర్ల ద్వారా(పుస్తకరూపంలో) విడుదల చేసేది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను జీవోఐఆర్ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన జీవోల ద్వారా సామాన్య ప్రజలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ పారదర్శకతకు వైసీపీ ప్రభుత్వం పాతరేసింది. నాటి ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల వెనుక ఉన్న అసలు వాస్తవాలపై ఎప్పటికప్పుడు మీడియాలో వార్తలు రావడం, ప్రజల్లో చర్చ జరగడం, కోర్టుల నుంచి వ్యతిరేక తీర్పులు రావడం, ప్రజలు వాస్తవాలు తెలుసుకోవడం వంటివి ఇబ్బందిగా భావించిన వైసీపీ సర్కారు 2021 ఆగస్టు 15న జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను నిలిపేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో ఖాళీ పేజీలతో నమోదు చేయడం ప్రారంభించింది. తద్వారా ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఇచ్చిన ఉత్తర్వులు ప్రజలకు, ప్రతిపక్షాలకు తెలియకుండా కప్పిపెట్టింది. కొంత మంది కోర్టు మెట్లు ఎక్కినా జీవోఐఆర్ వెబ్‌పోర్టల్‌ను పునరుద్ధరించలేదు. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురవడంతో ఈ గెజిట్‌లో పెడుతున్నామని హడావుడిగా జీవో నెంబర్ 100 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను టాప్ సీక్రెట్, సీక్రెట్, కాన్ఫిడెన్షియల్, రొటీన్ నేచర్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించినట్టు ఆ జీవోలో చెప్పింది. టాప్ సీక్రెట్, సీక్రెట్, కాన్ఫిడెన్షియల్ జీవోలను ఎట్టి పరిస్థితుల్లోను ఆన్‌లైన్‌లో ఉంచబోమని తెలిపింది. రొటీన్ నేచర్ జీవోలను వారానికొకసారి ఆర్డర్ ఇష్యూ చేసి వారంలోపు ఏపీ ఈ గెజిట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని, అందులో ఏమైనా అర్జంట్ నేచర్ ఉంటే ఎక్స్‌ట్రాఆర్డినరీ గెజిట్‌లో పెడతామని పేర్కొంది. అయితే ఏపీ ఈ గెజిట్‌లోను అరకొరజీవోలనే పెట్టారు. తాజాగా అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం జీవోఐఆర్ వెబ్‌పోర్టల్‌ను పునరుద్ధరించి పారదర్శకతకు తెరతీసింది. జవాబుదారీతనానికి పెద్దపీట వేసింది.

మూడు రకాలుగా అప్‌లోడ్..

జీవోఐఆర్ వెబ్‌పోర్టల్‌లో జీవోలను మూడు రకాలుగా అప్‌లోడ్ చేయనున్నారు.

- **కేటగిరీ-1(జీవోఎంఎస్):** విధాన పరమైన, ఎక్కువ కాలపరిమితి ఉండే ప్రభుత్వ నిర్ణయాలను ఈ కేటగిరీలో విడుదల చేస్తారు.
- **కేటగిరీ-2(జీవోఆర్‌టీ):** నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రభుత్వ నిర్ణయాలను జీవోఆర్‌టీ పేరుతో విడుదల చేస్తారు.
- **కేటగిరీ-3(జీవోపీ):** కేబినెట్ తీసుకున్న కొన్ని నిర్ణయాలను జీవోపీ పేరుతో విడుదల చేస్తారు.

పర్యవేక్షణ లేని పరిశ్రమలు

(మొదటి పేజీ తరువాయి)

ఏషియన్ పెయింట్స్, ఎసెన్షియా వంటి 50కి పైగా పరిశ్రమలు, బ్రాండిక్స్ అపెరల్ సిటీ వంటి భారీ పరిశ్రమలన్నీ అనకాపల్లి జిల్లాలోనే ఉన్నాయి. చిన్న, పెద్ద పరిశ్రమలన్నీ కలిపి 600 వరకు ఉన్నాయి. వీటిని ఏడాదికి ఒకసారి తనిఖీ చేసి, అన్నీ సవ్యంగా ఉన్నాయా? లేదా? లోపాలు ఉంటే సవరించుకోవాలని చెప్పాల్సింది డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఎఫ్). ఆయనకు ఒక కార్యాలయం, తనిఖీల కోసం ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందిని సమకూర్చాలి. చిత్రం ఏంటంటే.. అనకాపల్లి జిల్లాలో ఆ కార్యాలయమే లేదు. వైసీపీ పాలనలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్‌నాథ్ అనకాపల్లి నుంచే శాసనసభకు ఎన్నికయ్యారు. సుమారు రెండేళ్లు మంత్రిగా చేసిన ఆయన తన శాఖకు సంబంధించిన కార్యాలయం జిల్లాలో ఏర్పాటు చేసుకోలేకపోయారు. ఎల్‌జీ పాలిమర్స్ వంటి భారీ దుర్ఘటన జరిగిన తరువాత కూడా నిర్లక్ష్యంగానే వ్యవహరించారు. పరిశ్రమలను పర్యవేక్షించే అధికార విభజన కూడా ఎన్నికలకు రెండు నెలల ముందే చేశారు. విజయనగరంలో పనిచేస్తున్న డీసీఎఫ్ జీవీవీఎస్ నారాయణకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు కేటాయించారు. అయితే, అనకాపల్లిలో కార్యాలయం లేకపోవడంతో విజయనగరం నుంచే రాకపోకలు (ఒకవైపు సుమారు 90 కిలోమీటర్ల దూరం) సాగిస్తూ 600 పరిశ్రమలను చూస్తున్నారు. విశాఖపట్నంలో ఉండే డీసీఎఫ్ సురేశ్‌కు విశాఖతో పాటు విజయనగరం బాధ్యతలు కూడా అప్పగించారు. రాంబాబు అనే మరో డీసీఎఫ్‌కు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం కేటాయించారు. నిత్యం విజయనగరం నుంచి రావడం వల్ల రవాణా బిల్లులే ఎక్కువయ్యాయి. దీంతో పెండింగ్‌లో పెట్టి ఇవ్వడం ఆపేశారు. అయినప్పటికీ డీసీఎఫ్ నారాయణ సొంత డబ్బులతోనే అనకాపల్లి, అప్పుడప్పుడు అల్లూరి జిల్లాల్లో తనిఖీలకు వెళుతున్నారు.

లోపాల పోర్టల్

జగన్ ప్రభుత్వం వచ్చాక పరిశ్రమల తనిఖీలకు కొత్త విధానం తెచ్చింది. ఏ రీజియన్‌కు ఆ రీజియన్‌లో ఎవరు? ఎప్పుడు? ఏ పరిశ్రమను తనిఖీ చేయాలనే విషయాన్ని ఆటోమేటిక్‌గా ఎంపిక చేసేలా 'సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ పోర్టల్' పెట్టారు. ఇది అమరావతిలోనే ఉంటుంది. ఏ నెలలో ఏ తేదీన ఏ డీసీఎఫ్ ఏ పరిశ్రమను తనిఖీ చేయాలో ఆ పోర్టల్‌లో పేర్కొంటారు. దాని ప్రకారం తనిఖీలు నిర్వహించి, నివేదికలను 48 గంటల్లో అప్‌లోడ్ చేయాలి. ఈ విధానం కూడా లోపభూయిష్టంగా మారింది. ఒక్కో డీఎస్ఎఫ్‌కు నెలకు 5 నుంచి 10 పరిశ్రమలను తనిఖీ చేయాల్సిందిగా పోర్టల్ ద్వారా డ్యూటీ వేశారు. అయితే, ఒకేరోజు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 10 పరిశ్రమలను తనిఖీ చేయమని ఈ పోర్టల్‌లో డ్యూటీ వేయడమే విచిత్రం. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న డీసీఎఫ్ సురేశ్‌కు గత నెల జూలై 27న పది పరిశ్రమలను తనిఖీ చేయాల్సిందిగా ఆదేశించారు. అందులో ఒకటి కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ. అది ఇన్నర్ హార్బర్‌లో ఉంది. మరొకటి మ్యాక్స్ వర్థీ ప్లైవుడ్ కంపెనీ. ఇది సబ్బవరం మండలం అసకపల్లిలో ఉంది. ఇంకోటి లైఫ్ లైన్ ఆక్వా కంపెనీ. ఇది పెందుర్తి మండలం చీమలాపల్లిలో ఉంది. మరొకటి ఎఫ్ఎల్ఎస్ మిడ్త్ ప్రైవేటు లిమిటెడ్. ఇది ఆనందపురం మండలం బోయపాలెంలో ఉంది. ఇంకోటి ట్రైటాన్ పెయింట్స్. ఇది గాజువాకలోని ఆటోనగర్‌లో ఉంది. ఇలా పెదగంట్యాడ, పోతినమల్లయ్యపాలెం సంస్థల్లో ఒకేరోజు తనిఖీ చేయాలని డ్యూటీ వేశారు. ఒక అధికారి ఒక రోజు పది సంస్థలకు వెళ్లి లోపాలను గుర్తించడం సాధ్యమా?. అది సవ్యంగా జరిగే పనేనా? అనేది ప్రశ్న. అమరావతిలో కూర్చొని ఈ డ్యూటీలు వేసే అధికారులకే పరిశ్రమల్లో తనిఖీలంటే చిత్తశుద్ధి లేదని అర్థమవుతోంది. అందుకే తనిఖీలు పూజ్యమై, పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి.

అమర్‌నాథ్ అలక్ష్యం

అనకాపల్లి జిల్లాలో భారీ సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. కాబట్టి ఏదైనా ఘటన జరిగితే ప్రాణనష్టం కూడా ఎక్కువగా జరుగుతోంది. అయితే, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు జిల్లా యంత్రాంగానికి తక్షణం తెలిసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా కార్మిక సంఘాలు కోరుతున్నాయి. అయినప్పటికీ.. నాటి పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాని ఫలితంగా ఇప్పుడు తీవ్రనష్టం జరుగుతోంది.

ఒకసారి తప్పితే మళ్లీ ఏడాదే!

ఒక డీసీఎఫ్‌కు ఏదైనా పరిశ్రమను తనిఖీ చేయాలని డ్యూటీ వేసిన తర్వాత అనివార్య కారణాల వల్ల ఆ రోజు తనిఖీ చేయకపోతే.. ఇంకో ఏడాది వరకు ఆ పరిశ్రమను తనిఖీ చేసే అవకాశం ఉండదు. సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ పోర్టల్‌లో ఉన్న ప్రధాన లోపం ఇదే. విశాఖ డీసీఎఫ్ గత నెలలో ఒకేరోజు పది తనిఖీలు చేయమన్నప్పుడు ఎన్ని చేశారో తెలియదు. వాటిలో మిగిలిన వాటికి మరో ఏడాది తర్వాతే తనిఖీకి ఆదేశాలు వస్తాయి. ఈలోగా ఏమైనా జరిగితే కార్మికులు, సిబ్బంది బలి కావాల్సిందేనని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.



'మద్యం ఆస్తుల'పై సీఐడీ కన్ను

- వైసీపీ పెద్దలు.. వాసుదేవరెడ్డి బినామీలపై ఆరా
- జగ్గయ్యపేటలో ఖరీదైన ఆస్తుల గుర్తింపు

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు, సూత్రధారుల ఆట కట్టించేందుకు రాష్ట్ర సీఐడీ పోలీసులు భిన్నకోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి ఇస్తున్న సమాచారంతో మద్యం కమీషన్లతో వైసీపీ పెద్దలు కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలు సేకరిసున్నారు. 'ఎవరెవరు కమీషన్లు తీసుకున్నారు. ఎంత మొత్తంలో లబ్ధి పొందారు. ఆ డబ్బు ఎక్కడ దాచారు. కుటుంబ సభ్యుల పేర్లతో ఆస్తులు కొనుగోలు కొన్నారా? బినామీల పేర్లతో కొన్నారా?' వంటి విషయాలన్నీ రాబడుతున్నారు. వైసీపీలో కీలకంగా వ్యవహరించిన నలుగురు రెడ్లతో పాటు తాడేపల్లి నేతకు వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంతో సంబంధాలున్నట్లు సీఐడీకి ఇప్పటికే స్పష్టమైన ఆధారాలు లభించాయి. అయితే మరింత లోతుగా దర్యాప్తు చేసి పక్కా ఆధారాలతో అరెస్టులకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. దర్యాప్తులో ముందడుగు వేసిన సీఐడీ... కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి కుటుంబ సభ్యుల పేరుతో ఖరీదైన స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించింది. మద్యం సరఫరా కంపెనీల నుంచి వసూలు చేసిన జే టాక్స్ తాడేపల్లి నేతకు చేర్చడంలో కీలకపాత్ర వహించిన వైసీపీ ఎంపీ విథున్ రెడ్డి, జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ విజయ సాయిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ మరికొందరి బినామీలకు సంబంధించి సీఐడీ కూపీ లాగుతోంది. నంద్యాలలో ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, కృష్ణా జిల్లాలోని సెంటినీ బయోప్రొడక్ట్స్ డిస్టిల్లరీస్‌లో జే బ్రాండ్లు తయారుచేయించిన మిథున్ రెడ్డి పొరుగు రాష్ట్రాల్లో ఆస్తులు భారీగా కూడబెట్టినట్లు సీఐడీ అధికారులకు ఫిర్యాదులు అందాయి.

సుగాలి ప్రీతి కేసు సీఐడీకి

- హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.. మీడియాతో ప్రీతి తల్లి పార్వతి

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె సుగాలి ప్రీతి హత్యాచార కేసును సీఐడీకి అప్పగిస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చినట్లు ప్రీతి తల్లి పార్వతీదేవి వెల్లడించారు. ఈ కేసును రీఓపెన్ చేసి, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో విచారణ చేయిస్తామని హోంమంత్రి చెప్పారని ఆమె తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో హోం మంత్రి అనితను ఆమెతోపాటు జనసేన నాయకుడు హర్షద్, ప్రజా సంఘాల నాయకుడు బాలసుందరం కలిసి, కేసు పూర్వా పరాలను వివరించారు. ప్రీతికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం పార్వతీదేవి మీడియాతో మాట్లాడుతూ, 'కర్నూలులో 2017లో నా కుమార్తెను కొందరు అత్యాచారం చేసి అన్యాయంగా చంపేశారు. నిందితులను అప్పట్లో అరెస్టు చేసి జైలుకు పంపినా, కొద్దిరోజులకే విడుదల చేసేశారు. మాకు న్యాయం చేయలేదు. బాధితురాలికి న్యాయం జరగకపోతే రోడ్లపైకి వస్తానంటూ జగన్ సర్కారును హెచ్చరిస్తూ.. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ 2020లో కర్నూలులో నిరసన ర్యాలీ చేశారు. తర్వాత ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు జగన్ ప్రభుత్వం చెప్పినా, తప్పుడు జీవో ఇచ్చి మమ్మల్ని మోసం చేసింది. ఏడేళ్లుగా ఎంతోమంది నేతలను కలిసి న్యాయం కోరినా జరగలేదు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మా కుటుంబానికి న్యాయం చేయాలనే ఆలోచనలో ఉన్నారని హోంమంత్రి భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం' అని చెప్పారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి!

- హైకోర్టును రెండోసారి ఆశ్రయించిన వాసుదేవరెడ్డి

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను చోరీ చేసి.. తరలించారనే ఆరోపణలతో సీఐడీ ఆయనపై కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని సీఐడీ అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఉత్తర్వులు ఇచ్చారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి ఈ ఏడాది జూన్‌లో కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను చోరిచేసి తరలిస్తుండగా తాను చూశానని ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలానికి చెందిన గద్దె శివకృష్ణ ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. వాసుదేవరెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంలో జగన్ పేరు తొలగింపుపై పిల్

విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో అంబేడ్కర్ విగ్రహం దిగువ భాగంలో ఏర్పాటు చేసిన మాజీ సీఎం జగన్ పేరు తొలగింపు ఘటనకు సంబంధించి హైకోర్టులో పిల్ దాఖలైంది. గుంటూరుకు చెందిన పరిశపోగు శ్రీనివాసరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. పేరు తొలగింపు ఘటనకు సంబంధించిన ఎఫ్ఐఆర్ సహా రికార్డులను కోర్టు ముందు ఉంచేలా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించాలని, ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు.

'ఎసెన్షియా' ఫార్మాలో ఉత్పత్తి నిలిపివేత

విశాఖపట్నం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' కంపెనీలో ఉత్పత్తి నిలిపివేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశించింది. కర్మాగారంలో 21న చోటుచేసుకున్న ప్రమాదంలో 17మంది మృతిచెందిన నేపథ్యంలో 23న పీసీబీ సభ్య కార్యదర్శి బి.శ్రీధర్ జారీ చేసిన ఉత్తర్వులు తాజాగా వెలువడ్డాయి. కంపెనీని మూసివేయాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఇప్పటికే ఆదేశించింది. తాజాగా పీసీబీ కూడా తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు కంపెనీలో ఉత్పత్తి నిలిపివేయాలని స్పష్టం చేసింది. ఎసెన్షియా కంపెనీలో పేలుడు సంభవించిన వెంటనే పీసీబీ అధికారులు కర్మాగార పరిసరాలను తనిఖీ చేసి కాలుష్య కారకాల తీవ్రతను అంచనా వేశారు. పరిసర ప్రాంతాల్లో గాలి, నీటి కాలుష్య తీవ్రత పెరిగిందని గుర్తించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- ఏపీ నుంచి ఇద్దరికి అవార్డులు.. 5న రాష్ట్రపతి చేతులమీదుగా స్వీకరణ



మిద్దె శ్రీనివాసరావు



కూనాటి సురేష్

అమరావతి, శ్రీకాళహస్తి, మచిలీపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇద్దరు ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. కృష్ణా జిల్లా గుడివాడలోని ఎస్పీఎస్ మున్సిపల్ హైస్కూల్ టీచర్ మిద్దె శ్రీనివాసరావు, తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ హైస్కూల్ సోషల్ టీచర్ కూనాటి సురేష్ ఈ అవార్డులకు ఎంపికయ్యారని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. అవార్డు గ్రహీతలను మంత్రి లోకేశ్, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అభినందించారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి చెందిన సురేష్ ఊరందూరు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూనే పాఠ్యపుస్తకాలను రూపొందించడం, డిజిటల్ కంటెంట్ క్రియేట్ చేయడం, ఉచిత పాఠ్యాంశాలను బోధించే మొబైల్‌యాప్ అందించడం వంటి సేవలందించారు. మిద్దె శ్రీనివాసరావు గుడివాడ 9, 10వ తరగతుల భౌతిక రసాయన శాస్త్రం, 7వ తరగతి సామాన్య రసాయనశాస్త్రం పాఠ్య పుస్తకాలను రచించారు. వచ్చే నెల 4న ఉత్తమ ఉపాధ్యాయులతో ప్రధాని మోదీ ముఖాముఖి ఉంటుంది. 5న ఉపాధ్యాయుల దినోత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సురేష్, శ్రీనివాసరావు పురస్కారాలు అందుకోనున్నారు.

ఉత్తమ ఇంధన సామర్థ్య రాష్ట్రంగా ఏపీ!

- సబ్సిడీపై ఎనర్జీ ఎఫిషియన్సీ బల్బు, ఫ్యాన్, ఈ-సైకిల్
- ప్రభుత్వ భవనాలన్నింటికీ సౌర విద్యుత్: చంద్రబాబు
- ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ప్రతినిధులతో భేటీ

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఇంధన సామర్థ్య రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగంలో మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) సీఈవో విశాల్ కపూర్ తోపాటు ఆ సంస్థ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఇంధన సామర్థ్యాలను పెంచేందుకు చేపట్టే కార్యాచరణపై చర్చించారు. సీఎంఏపై పథకం కింద అతి తక్కువ విద్యుత్‌ను వినియోగించుకునే బల్బులు, ఫ్యాన్లు సబ్సిడీ ధరలకు అందిస్తామన్నారు. అలాగే, ఈ-సైకిల్, ప్రభుత్వ ఉద్యోగులకు విద్యుత్ పరికరాలూ సబ్సిడీపై అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిక్ సైకిళ్ల మోడళ్లను సీఎం పరిశీలించారు. ఈఈఎస్ఎల్, పంచాయతీరాజ్, గృహనిర్మాణ, గ్రామీణాభివృద్ధి, మునిసిపల్ సహా కీలక విభాగాలతో కలసి ఇంధన పొదుపులో భాగస్వాములయ్యేలా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ఇంధన సామర్థ్యంలో పూర్వవైభవాన్ని తీసుకువస్తామని, ప్రభుత్వ భవనాలన్నింటికీ సౌరవిద్యుత్ అమర్చుతామని చెప్పారు. విద్యుదుత్పత్తితోపాటు పొదుపు కూడా అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. గతంలో రాష్ట్రంలో 25 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలను అమర్చామని గుర్తు చేశారు. మళ్లీ త్వరలోనే ఎల్ఈడీ వీధి దీపాలను అమర్చుతామని సీఎం వెల్లడించారు.

130 పాఠశాలలకు క్రీడా ప్రతిభ అవార్డులు

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ కనబరిచిన 130పాఠశాలలు క్రీడా ప్రతిభ పురస్కారాలకు ఎంపికైనట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. ఆ పాఠశాలలకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బుధవారం అవార్డులు అందజేయాలని ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో 1040 పాయింట్లతో కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రథమ, 1008 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లాలోని నున్న హైస్కూల్ ద్వితీయ, 963 పాయింట్లతో చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూల్ తృతీయ స్థానంలో అవార్డులు సాధించాయని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

మిద్దెతోటపై మక్కువతోట..





మనసుంటే మార్గముంటుందనే మాటకు ఈ చిత్రాలే సాక్ష్యాలు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో పచ్చని చెట్లకు చోటులేకుండా పోయింది. కానీ అక్కడక్కడ కొంత మంది మొక్కలు, ప్రకృతి వనాల ప్రేమికులు తామున్నచోటే తమ ఆకాంక్షను నెరవేర్చుకుంటున్నారు. ఖాళీ ప్లాస్టిక్ డబ్బాల్లో పూలమొక్కలు, కూరగాయ మొక్కలు పెంచుకుంటున్నారు. కనీస స్థలం లేనిచోట కూడా వారు వినూత్నంగా ఆలోచించి తమకు లభించిన కాస్తంత స్థలంలోనే వీటిని ఏర్పాటు చేసి మొక్కలపై తమకున్న ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మిద్దె తోటలతో సొంత ఇంట్లోనే కూరగాయలను పండించుకోవచ్చు. పైగా వాతావరణ కాలుష్యం నుంచి బయట పడొచ్చు. కానూరు మహదేవపురం కాలనీలోని ఒక అపార్టుమెంట్‌లో సన్‌ఫ్లవర్ ప్లాస్టిక్ డబ్బాలతో, వన్‌టౌన్‌లో కేబీఎన్ కళాశాలలోనే కాక నగరంలోని అనేక చోట్ల ఇలాంటి మిద్దెతోటలు అందంగా కనిపిస్తూ పలువురిని ఆకర్షిస్తున్నాయి.



కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడును కలిసిన ఆళ్ల గోపాలకృష్ణారావు

కేంద్ర మంత్రి కృషి అభినందనీయం

● కింజరాపు రామ్మోహన్నాయుడిని కలిసిన ఆళ్ల

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 27: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్నాయుడు తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తేవడానికి విశేషంగా కృషి చేస్తున్నారని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు అన్నారు. మంగళగిరిలోని జాతీయ తెలుగుదేశం పార్టీ ఫిర్యాదుల విభాగానికి కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు మంగళవారం విచ్చేసిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు సమక్షంలో ఆళ్ల మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆళ్ల రంగన్నగూడెంలోని సాగు నీటి సంఘాల సమాఖ్య క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ వల్లభనేని బాలశౌరి సూచనతో ముంబాయికి రెండు ఇండిగో సర్వీసులు ప్రారంభించడం హర్షనీయమన్నారు. వచ్చే నెల నుంచి ఢిల్లీకి రెండు ఇండిగో సర్వీసులు, బెంగుళూరుకు అదనంగా రెండు సర్వీసులు ప్రతిపాదించినందుకు కేంద్రమంత్రికి ఆళ్ల కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు కోగంటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ నేతలు కొండపల్లి వెంకన్న పాల్గొన్నారు.



శశికిరణ్‌కు కళాశాల ఫీజు అందిస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

హ్యాపీఫీట్ వెల్ఫేర్ సంస్థ సేవలు అభినందనీయం

● మచిలీపట్నం ఎంపీ బాలశౌరి

పటమట, ఆగస్టు 27: ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభ కలిగిన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో హ్యాపీఫీట్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ స్థాపించి, సంస్థ ద్వారా విద్యార్థులకు చేస్తున్న సేవలు అభినందనీయమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామానికి చెందిన మేకల శశికిరణ్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలం క్రితం శశికిరణ్ తల్లిదండ్రులు చనిపోగా, కళాశాల ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. విషయం తెలుసుకున్న హ్యాపీఫీట్ సంస్థ సభ్యులు శశికిరణ్‌కు కళాశాల ఫీజు రూ.45వేలను మంగళవారం భారతీనగర్‌లోని ఎంపీ బాలశౌరి క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు. శశికిరణ్ ప్రతిభను ఆధారంగా చదువు పూర్తయ్యే వరకు కళాశాల ఫీజు చెల్లిస్తామని హ్యాపీఫీట్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు గుడిసేవా శ్రావణ్, జి హరీష్, ప్రసాద్, నాగేంద్ర, షఫీ, రాజా, వంశీ తెలిపారు.



నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంకు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న అర్చకులు

దుర్గమ్మ సన్నిధిలో నీతి ఆయోగ్ సీఈవో

వన్‌టౌన్, ఆగస్టు 27: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను మంగళవారం నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. ప్రదోష వేళలో జరిగిన పంచహారతుల్లో పాల్గొని అమ్మవారిని అర్చించారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు డిప్యూటీ ఈవో లీలాకుమార్ శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందచేశారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.



మంత్రి రాంప్రసాద్ రెడ్డికి వినతిప్రతం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

నగర పరిధిలో లేని ఆటోలపై కేసులు వద్దు

● మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఐఎఫ్‌టీయూ వినతి

వన్‌టౌన్, ఆగస్టు 27: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) అనుబంధ నేతలు మంగళవారం రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ప్రతి ఆటో డ్రైవర్ తన ఇంటి నుంచి జిల్లా పరిధితో సంబంధం లేకుండా 60 కిలో మీటర్లు తిరిగేందుకు అవకాశం కల్పిస్తే వారికి న్యాయం చేసినట్లవుతుందని మంత్రిని కోరారు. నగర పరిధిలో లేని ఆటోలపై కేసులు రాయవద్దని విన్నవించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రవాణా శాఖాధికారులు, ఆటో సంఘాలతో ఒక సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, నేతలు ఎ.రవిచంద్ర, డి.శ్రీనివాసరావు, సీహెచ్ పెద్దిరాజు, మునిశంకర్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.





మాట్లాడుతున్న ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు, కేబీఎన్ కళాశాలలో ఇస్రో ప్రదర్శించిన ఉపగ్రహాల నమూనా

తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలు.. ఇస్రో ఘనత

● ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య రామ్మోహన్ రావు

వన్‌టౌన్, ఆగస్టు 27: ప్రపంచంలోనే తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉపగ్రహాలను విస్తృత ప్రయోజనాలను సాధనకు అంతరిక్షంలోకి పంపిన ఘనత ఇస్రోదని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు అన్నారు. కాకరపర్తి భావన్నారాయణ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఇస్రో సాధించిన విజయాలను తెలిపే నమూనాల ప్రదర్శన కాస్మోక్రైజ్ పేరిట నిర్వహిస్తున్నారు. రెండురోజుల ప్రదర్శనలో తొలిరోజు జరిగిన ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఇస్రో పంపిన తొలి ఉపగ్రహం ఆర్యభట్ట నుంచి ఇటీవల పంపిన చంద్రయాన్-3 వరకు ఎన్నో అద్భుతాలను సాధించిందన్నారు. ప్రపంచ మానవాళి వికాసానికి ఉపయోగపడే అనేక ఉపగ్రహాలను ఇస్రో పంపిందన్నారు. విద్యార్థులు వాటి గురించి తెలుసుకుని అబ్దుల్ కలాం స్ఫూర్తితో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ ప్రదర్శన కేబీఎన్‌లో నిర్వహించటం అభినందనీయమన్నారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల పరిపాలన అధికారి డాక్టర్ వి. నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఇస్రో బృందం ఎం.అనిల్, ఎం.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, ఎస్.కిషోర్ బాబు, కళాశాల పాలకవర్గ కోశాధికారి ఎం.హరగోపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ, పి.ఎల్.రమేష్, ఫిజిక్స్ విభాగాధిపతి ఆర్. ఉదయకుమార్ పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు

● వైద్యారోగ్య శాఖ అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశం

గన్నవరం, ఆగస్టు 27: విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో విషజ్వరాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని బ్లీచింగ్, ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్‌లు లాంటివి చేయాలన్నారు. గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించటంతో పాటు ఆరోగ్య కేంద్రం నుంచి రోజువారీ ఫీవర్ కేసుల నివేదికలు ఇవ్వాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. డెంగ్యూ కేసు నమోదైతే వెంటనే డాక్టర్ల బృందం ఆ గ్రామానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో భాగంగా వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. నియోజకవర్గంలో చేసిన సర్వేలో 267 జ్వర కేసులు, 41 టైఫాయిడ్ కేసులుండగా మిగిలినవి విష జ్వరాలుగా గుర్తించామన్నారు. వారందరికీ వైద్యసేవలందిస్తున్నామన్నారు. డాక్టర్ పర్వతనేని శ్రీహర్ష, డాక్టర్ హరి, డాక్టర్ మనోహర్‌రెడ్డి, డాక్టర్ శిరీషా, డాక్టర్ వాణి, డాక్టర్ మంజూష, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ముగ్గురు రైల్వే ఉద్యోగులకు

మాసవారీ భద్రతా అవార్డులు



రైల్వేస్టేషన్, ఆగస్టు 27: రైల్వే డివిజన్‌కు చెందిన దుగ్గిరాల ఆపరేటింగ్ డిపార్టుమెంట్ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు, రాజమండ్రి ఆపరేటింగ్ డిపార్టుమెంట్ గూడ్స్ లోకో పైలట్ కె.శంకరరావు, తణుకు ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ లెవల్ క్రాసింగ్ ట్రాక్ నిర్వాహకుడు టి.చంద్రశేఖర్‌కు మాసవారీ భద్రతా అవార్డులు లభించాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణకుమార్ జైన్ మంగళవారం సికింద్రాబాద్ రైలు నిలయంలో జరిగిన కార్యక్రమంలో రైల్వేలో భద్రతపై సమీక్షించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ నగరం నుంచి పాల్గొనగా, రైల్ నిలయంలోని డిపార్టుమెంట్ల ప్రిన్సిపల్ విభాగాధిపతులు, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల కార్యాలయాల నుంచి అక్కడి డీఆర్‌ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణకుమార్ జైన్ మాట్లాడుతూ రాత్రిపూట తనిఖీలు, సేఫ్టీ డ్రైవ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

గ్యారెంటీ పెన్షన్ విధానంపై హర్షం



రైల్వే స్టేషన్, ఆగస్టు 27: కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ విధానాన్ని ప్రకటించినందుకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ లీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని తమ యూనియన్లు చేపట్టిన పలు రకాల నిరసనలకు ఫలితం దక్కిందన్నారు. ఈనెల 24న అగ్ర నేతలు శివగోపాల్ మిశ్రా, కన్నయ్య, శంకరరావుతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన సమావేశం ఫలితంగా ఉద్యోగులకు గ్యారంటీ పెన్షన్ విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నారన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి గ్యారంటీ పెన్షన్ విధానం అమలులోకి వస్తుందన్నారు 10 ఏళ్లు పూర్తి చేసిన ఉద్యోగులకు కనీస మొత్తం నెలకు రూ.10వేల చొప్పున, 25ఏళ్లు సర్వీసు పూర్తి చేసి పదవీ విరమణ చేసిన వారికి చివరి 12 నెలల జీతం సరాసరి మొత్తంలో సగభాగం పెన్షన్ కింద వస్తుందని పీఎం హామీ ఇచ్చారన్నారు. 12 లక్షల రైల్వే కార్మికులు వారి కుటుంబ సభ్యులు తరపున నేతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.



ఓవరాల్ చాంప్ కైవసం చేసుకున్న స్విమ్మర్లు, అసోసియేషన్ సెక్రటరీ రమేష్

స్విమ్మింగ్‌లో జిల్లాకు ఓవరాల్ చాంప్

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 27: పల్నాడు జి ల్లా నరసరావుపేటలో ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో 25,26న జరిగిన రా ష్ట్ర సీనియర్ (అంతర్ జి ల్లాల) స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా ఓవరా ల్ చాంపియన్‌షిప్ వశం చేసుకుంది. స్విమ్మర్లు సత్తాచాటి 82 పాయింట్లతో జి ల్లాను అగ్రభాగాన నిలిపారు. జిల్లా నుంచి మొత్తం 15 మంది స్విమ్మర్లు బరిలో దిగగా 9 స్వర్ణాలు, 8 రజతాలు, 6 కాంస్యాలతో సత్తా చాటారు. స్విమ్మర్లను డివిజన్ రైల్వే ఆఫీసర్ సీ గౌతమ్, స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం ఓబుల్‌రెడ్డి, వీఎంసీ కోచ్‌లు ఎం మాల్యాద్రి, లక్ష్మణ్, ఎస్‌కే రఫీ అభినందించారు.

జాతీయ పోటీలకు 8 మంది ఎంపిక

రాష్ట్ర పోటీల్లో సత్తా చాటిన 8మంది స్విమ్మర్లు ఎం తీర్థసమదేవ్, జి.సంపత్ కుమార్ యాదవ్, ఎన్. దేవ గణేష్, ఎన్ శరత్, యూ ప్రేమామృత, కొంగర శాన్వి, యానా జైన్ మంగుళూరులో సెప్టెంబరు 17, 18న జరిగే జాతీయ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఐ రమేష్ తెలిపారు.



జాతీయ రెజ్లింగ్‌కు పీబీ సిద్ధార్థ క్రీడాకారులు

తిరుపతిలోని రేణిగుం ట జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 26న ముగిసిన 4వ రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ పో టీల్లో మొగల్రాజపురంలో ని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల క్రీడాకారులు వనం సింహాద్రి (బీకాం రెండో), యర్రంశెట్టి ఠాగూర్ సన్నీ (బీఎస్సీ రెండో) విద్యార్థులు బంగారు పతకాలతో స త్తా చాటారు. దీంతో వీరిద్దరూ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల ప్రెసిడెంట్ పి.నాగేశ్వరరావు, సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ సింహాద్రి, ఠాగూర్‌సన్నీని అభినందించినట్టు పీడీ డాక్టర్ టీవీబీ కృష్ణారెడ్డి తెలిపారు.

దసరా మహోత్సవాలకు

విస్తృత ఏర్పాట్లు

● భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదు: ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్: దుర్గామల్లేశ్వరస్వామి దేవాలయంలో అక్టోబర్‌లో జరిగే దసరా మహోత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశించారు. కానూరులోని తన నివాస గృహంలో మంగళవారం ఆయన దుర్గగుడి ఈవో రామారావు, అర్చకులు, ఇంజనీరింగ్ అధికారులతో దసరా మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు ఇంద్రకీలాద్రిపై విజయదశమి మహోత్సవాలు జరుగుతాయని ఈవో, అర్చకులు ఆయనకు వివరించారు. రోజుకో అలంకారంలో దుర్గమ్మ అలరిస్తారని, అక్టోబర్ 9వ తేదీన మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారని ఈవో వివరించారు. దసరా మహోత్సవాలతో పాటు మూలా నక్షత్రం రోజున భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. దేవస్థానం అధికారులు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని దసర మహోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన సూచించారు. దేవస్థానం ఈఈ రమాదేవి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రచయితల సంఘం సారథ్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్-శంకరం వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు ఈనెల 29న గురువారం ఉదయం 10 గంటలకు నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరగనున్నాయి. తెలుగు భాషా పరిరక్షణపై కవి సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గిడుగు జాతీయ భాషా సాహిత్య కళా సేవా రంగాల పురస్కారాల ప్రదానం చేయనున్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, ఆంధ్రప్రభ సంపాదకుడు వైఎస్సార్ శర్మ, తెలుగు వన్ వ్యవస్థాపకుడు కంఠంనేని రవిశంకర్, సాహితీవేత్త జెల్లి విద్యాధరరావు, గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ చైర్మన్ క్రాంతికృష్ణ హాజరుకానున్నారు. ఈ కవి సమ్మేళనంలో పాల్గొనేవారు 9246415150 నెంబరును సంప్రదించవచ్చని నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

122 అంశాలతో రూపొందించిన అజెండా

చిట్టినగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం జరగనుంది. ప్రధాన అజెండాలో 122 ప్రతిపాదిత అంశాలు చర్చకు రానున్నాయి. నగరాభివృద్ధికి సంబంధించిన అంశాలతోపాటు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలు, కుక్కల సమస్యలపై సమావేశం వాడీవేడిగా సాగనుంది.

నేడు జవహర్ ఆటోనగర్ ఏటీఏ సంఘ ఎన్నికలు

ఆటోనగర్: ఆటోనగర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీఏ) ఎన్నికలు నేడు జరగనున్నాయి. మొత్తం 14 అనుబంధ సంఘాలకు చెందిన 2వేల మందికి పైగా ఓటర్లున్న ఈ ఎన్నికల్లో ఇద్దరు నేతలు అధ్యక్ష పోటీలో ఉన్నారు. పదేళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న రాజనాల వెంకటరమణారావు (బాబ్జీ), కొత్తగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మెకానికల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు (కొండ) పోటీ పడుతున్నారు. ఈనెల మూడో వారంలోనే నామినేషన్ పూర్తయిన రోజు నుంచి అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. నేడు ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతను నిర్ణయించనున్నారు. ఒక పక్క ప్రస్తుత అధ్యక్షుడు బాబ్జీ తాను చేసిన అభివృద్ధితో గెలుపు గుర్రాన్ని తానేనని ధీమా వ్యక్తం చేస్తుండగా, అందుకు దీటుగా గంధం కొండ తాను ఈ ఎన్నికల్లో గెలువడం ఖాయమంటున్నారు. ఏదిఏమైనా నేటి సాయంత్రానికి ఓట్ల లెక్కింపు పూర్తయి ఏటీఏ కొత్త అధ్యక్షుడు కొలువు తీరనున్నాడు.

1న కేడీసీఏ అండర్-14 క్రికెట్ టీమ్ ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు: ఉమ్మడి కృష్ణా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి ఇండోర్ స్టేడియంలో సెప్టెంబరు 1న ఉదయం 8 గంటలకు అండర్-14 బాలుర టీమ ఎంపికలను నిర్వహిస్తున్నట్టు కేడీసీఏ సెక్రటరీ ఎం రవీంద్ర చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. 2012 ఆగస్టు 31కి ముందు జన్మించిన బాలురు ఈ ఎంపికలకు అర్హులని, ఆసక్తి ఉన్నవారు జన్మదిన, ఆధార్ ఒరిజనల్, జిరాక్సులతో పాటు స్వంత క్రికెట్ కిట్, వైట్‌డ్రెస్‌తో రావాలన్నారు.

31న రెడ్ 5కే మారథాన్

పటమట: హెచ్ఐవీ, ఎయిడ్స్, ఎస్‌టీఐ నివారణను ప్రోత్సహించడానికి 2నెలలు అవగాహన, చికిత్సలో భాగంగా ఈ నెల 31న బీఆర్‌టీఎస్ రోడ్డులో రెడ్ 5కే మారథాన్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ జి.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చదువుతున్న 17 నుంచి 25ఏళ్లలోపు యువత ఈ మారథాన్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మారథాన్ ఆడ, మగ, ట్రాన్స్‌జెండర్లకు మూడు విభాగాలుగా జరుగుతుందని, విజేతలకు మొదటి బహుమతిగా రూ.7వేలు, రెండో బహుమతిగా రూ.4వేలతో పాటుగా ప్రశంసా పత్రాన్ని ఇస్తామన్నారు.



నిరసన తెలుపుతున్న వాణిజ్య శాఖ ఉద్యోగులు

అనిశ్చితిని తొలగించి బదిలీలు చేపట్టండి

● వాణిజ్య పన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్ డిమాండ్

ఆటోనగర్: వాణిజ్యపన్నుల శాఖలో నెలకొన్న అనిశ్చితిని తొలగించి ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. కానూరు వాణిజ్యపన్నుల శాఖ డివిజన్-1 కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు మంగళవారం పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఈ నిరసనలో విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయెస్ అధ్యక్షుడు రవీంద్రబాబు మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, ఉద్యోగులకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని దుయ్యబట్టారు. వికేంద్రీకరణ పేరుతో ఉన్నతాధికారులు వ్యవస్థను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. రాజ్యాంగ నిబంధనలు తుంగలో తొక్కి స్వప్రయోజనాల కోసం వాణిజ్యపన్నుల శాఖ ఉద్యోగులను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించి బదిలీలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం డివిజన్ 2 అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వికేంద్రీకరణ పేరుతో జరిగిన అన్యాయాలపై విచారణ జరిపాలని కోరారు. ఈ నిరసనలో డివిజన్ అధ్యక్షుడు భాస్కరరావు, ఏపీ సబార్డినేట్స్ అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

జీవన ప్రమాణాలు పెంచాలి

స్వయం ఉత్పత్తి కేంద్రాలుగా డ్వాక్రా సంఘాలు: మంత్రి కొండపల్లి

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు, జీవనోపాధి పెంపుదలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ అధికారులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సచివాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ పనితీరుపై అధికారులతో మంత్రి సమీక్షించారు. స్వయం సహాయక సంఘాలను స్వయం ఉత్పత్తి కేంద్రాలుగా మార్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 90 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో 55 లక్షల మంది రూ.ఒక లక్ష కన్నా ఆదాయం కలిగి ఉన్నారని, మిగిలిన 35 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను లక్ష కన్నా ఎక్కువ ఆదాయం సాధించేందుకు లక్పతి స్కీం కింద అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆయన సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ఇప్పుడు 144 రకాల ఉత్పత్తులను 98 గ్రూపుల వారు తయారుచేస్తున్నారని వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని చెప్పారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్, పలువురు సెర్ప్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పవన్ పుట్టిన రోజున క్లీన్ ఆంధ్ర.. గ్రీన్ ఆంధ్ర

2న పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని మంత్రి నాదెండ్ల పిలుపు

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సెప్టెంబరు 2వ తేదీన పార్టీ నాయకులు, శ్రేణులు కలిసి ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పవన్ పుట్టిన రోజున క్లీన్ ఆంధ్ర- గ్రీన్ ఆంధ్ర కాన్సెప్ట్‌తో ఊరువాడా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కాలువలు, బహిరంగ ప్రదేశాలు శుభ్రపరచడం, స్కూళ్లు, ఇతర జనసంచార ప్రాంతాలు స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉండేలా చేయడం వంటి కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. గ్రీన్ ఆంధ్రాలో భాగంగా సామాజిక అటవీ విభాగం నుంచి మొక్కలను తీసుకుని వాటిని అవసరమైన ప్రాంతాల్లో నాటాలని సూచించారు.

రేపటి నుంచి పీసా చట్టంపై జాతీయ స్థాయి శిక్షణ

అమరావతి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టంపై స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఐఆర్‌డీ)లో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ దివాన్ తెలిపారు. దేశంలో పీసా చట్టం అమలు చేసే 10 రాష్ట్రాలకు సంబంధించిన 40 మంది ప్రతినిధులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ఈ మాస్టర్ ట్రైనర్లు జిల్లా, మండల, గ్రామస్థాయిలో ఆయా రాష్ట్రాల్లో శిక్షణ అందివ్వనున్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం ద్వారా ఇచ్చే ఈ శిక్షణను కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

అమరావతిలో సీఈసీ ఏర్పాటు చేస్తాం

ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు రంజిత్ అగర్వాల్

విజయవాడ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈసీ) పేరుతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. ఐసీఏఐ స్టడీ సర్కిల్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అగర్వాల్ మీడియాతో మాట్లాడారు. ఐసీఏఐకి దేశంలో 178 బ్రాంచ్‌లు, ఐదు ప్రాంతీయ సెంటర్లు, 350 స్టడీ సర్కిళ్లు ఉన్నాయన్నారు. విజయవాడ స్టడీసర్కిల్ ద్వారా విద్యార్థులు సీఏ కోర్సు, పరీక్షల విధానం, సిలబస్ గురించి తెలుసుకోవచ్చన్నారు.

ఉక్రెయిన్‌పై పుతిన్‌కు మోదీ ఫోన్

న్యూఢిల్లీ, ఆగస్టు 27: రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి సత్వరం శాంతియుత పరిష్కారం కనుక్కోవాలని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఆయన మంగళవారం ఫోన్లో చర్చలు జరిపారు. ఇటీవల తన ఉక్రెయిన్ పర్యటన, ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చల వివరాలను ఆయనతో పంచుకున్నారు. 'పుతిన్‌తో ఇవాళ చర్చలు జరిపాను. ద్వైపాక్షిక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించాను. యుద్ధానికి సత్వరం శాంతియుత పరిష్కారానికి భారత్ సంపూర్ణ మద్దతిస్తుందని చెప్పాను' అని ఆ తర్వాత మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

లాకర్ల పేరుతో భక్తుల నుంచి వసూళ్లు

వ్యక్తిగత వివరాలతో బెదిరింపు.. కర్ణాటక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'మీరు లాకర్ తీసుకుని ఏడాది అవుతోంది. మీరు ఖాళీ చేయకపోవడంతో ఫైన్ పడింది. కట్టకుంటే ఆధార్ కార్డును బ్లాక్ చేస్తాం' అంటూ భక్తులను బెదిరించి అందిన వరకు దోచుకున్న కర్ణాటకలోని ముల్బాగల్‌కు చెందిన తిలక్ శ్రీనివాస్‌ను తిరుమల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. శ్రీవారిసేవ చేసేందుకు వచ్చిన భక్తులు తిరుపతిలోని విష్ణునివాసంలో లాకర్లు పొంది బస చేస్తుంటారు. అయితే శ్రీనివాస్ కొద్దినెలలుగా లాకర్లు పొంది తిరిగి వెళ్లిపోయిన భక్తులకు ఫోన్ చేసి తాను టీటీడీ నుంచి ఫోన్ చేస్తున్నానని, ఆ భక్తుల ఆధార్ నెంబరు, పేరు, లాకర్ పొందిన తేదీ వంటి వివరాలు తెలియజేసి.. మీరు తీసుకున్న లాకర్ ఖాళీ చేయకపోవడంతో ఫైన్ పడిందని, వెంటనే కట్టాలంటూ భయపెట్టేవాడు. వివరాలన్నీ కరెక్ట్‌గానే ఉండడంతో భక్తులు కూడా నమ్మి శ్రీనివాస్ అడిగినంతా ఇచ్చేసేవారు. ఇటీవల ఓ మహిళ వద్ద నుంచి కూడా ఫైన్ వసూలు చేశాడు. దర్శనం కూడా చేయిస్తానని చెప్పి చేతులెత్తేయడంతో ఆమె విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేయగా అక్రమం బయటపడింది. కేసును తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా తిలక్ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు.

బళ్లారి జైలుకు దర్శన్... వేర్వేరు జైళ్లకు నిందితులు

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా ఉన్న సినీ నటుడు దర్శన్‌ను జైళ్ల శాఖ మంగళవారం బళ్లారి జైలుకు తరలించింది. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్యకేసులో నిందితుడుగా ఉన్న ఆయన.. జైలులో విలాసవంతంగా గడుపుతున్న దృశ్యాలు బయట పడటంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రభుత్వంతో పాటు 24 ఏసీఎంఎం కోర్టు ఆదేశాల మేరకు దర్శన్ సహా నిందితులను రాష్ట్రంలోని వివిధ జైళ్లకు తరలించారు. దర్శన్‌ను బళ్లారి జైలుకు, జగదీశ్ లక్ష్మన్‌ను శివమొగ్గ జైలుకు, నాగరాజ్‌ను కలబురగికి, వినయ్‌ని విజయపుర, ధనరాజ్‌ను ధారవాడకు, ప్రదోష్‌ను బెళగావి జైలుకు తరలించారు. పవన్, రాఘవేంద్ర, నందీశ్‌ను మైసూరు జైలుకు తరలించారు. ఏ1 నిందితురాలు పవిత్రగౌడ, అనుకుమార్, దీపక్‌ను పరప్పన అగ్రహార జైలులోనే ఉంచారు. జైళ్లశాఖ డీఐజీగా దివ్యశ్రీ, సెంట్రల్ జైలు చీఫ్ సూపరింటెండెంట్‌గా సురేశ్‌ను నియమించారు. గతంలో జైళ్లశాఖ డీఐజీగా ఉన్న సోమశేఖర్‌ను సెంట్రల్ జైల్ అకాడమీకి మార్చారు.

రైల్వే బోర్డు చైర్మన్‌గా సతీష్ కుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 27: రైల్వే బోర్డు చైర్మన్-సీఈఓగా ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసు(ఐఆర్ఎంఎస్) అధికారి సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ పదవి చేపట్టనున్న తొలి ఎస్సీ అధికారి ఆయనే కావడం విశేషం. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జయ వర్మ సిన్హా ఈ నెల 31న పదవీ విరమణ చేసిన అనంతరం సతీష్ కుమార్ ఆ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన నియామకానికి కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదం తెలిపినట్లు మంగళవారం అధికార వర్గాలు వెల్లడించాయి.

రాజ్యసభకు 12 మంది ఏకగ్రీవం

న్యూఢిల్లీ, ఆగస్టు 27: రాజ్యసభకు జరిగిన ఉప ఎన్నికల్లో మంగళవారం 12 మంది పోటీ లేకుండా నెగ్గారు. వీరిలో తొమ్మిది మంది సభ్యులు కావడం గమనార్హం. మరో ఇద్దరు ఎన్డీఏ కూటమి సభ్యులు కాగా, మరొకరు కాంగ్రెస్ అభ్యర్థి. ఎన్డీఏ కూటమికి చెందిన ఎన్సీపీ (అజిత్ పవార్), రాష్ట్రీయ లోక్ మంచ్‌కు చెందిన అభ్యర్థులు ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభలో ఎన్డీఏ మెజార్టీ మార్కును చేరుకున్నట్టయింది. ప్రస్తుతం రాజ్యసభలో సభ్యుల బలం 237 కాగా, మెజార్టీ సాధించాలంటే 119 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. నామినేటెడ్ సభ్యులతో కలిపి ఎన్డీఏ ఈ సంఖ్యను చేరుకుంది. తాజాగా బీజేపీ సొంత బలం 96కు చేరుకుంది.

ఉన్నత విద్య... ప్రవేశాలు మిథ్య!



ఈఏపీసెట్‌లో అర్హులకు, అడ్మిషన్లకు భారీ వ్యత్యాసం.. కోర్సుల్లో చేరని 50వేల మందికి పైగా విద్యార్థులు

- ఏటేటా డిగ్రీలోనూ భారీగా పడిపోతున్న ప్రవేశాలు
- వేల సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు వర్సిటీల్లో చేరిక
- పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్న వైనం
- రాష్ట్రంలో 4.47లక్షల డిగ్రీ సీట్లకు గాను 1.51 లక్షలే భర్తీ
- పట్టించుకోని ఉన్నత విద్యామండలి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రవేశాల పరిస్థితి అయోమయంగా మారింది. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థుల సంఖ్యకు, ఉన్నత విద్యా కోర్సుల్లో చేరుతున్న వారి సంఖ్యకు పొంతన ఉండటం లేదు. ప్రతి సంవత్సరం 50వేల మందికి పైగా విద్యార్థులు రాష్ట్రంలో అడ్మిషన్లు పొందట్లేదు. వీరిలో ప్రైవేటు వర్సిటీల్లో ఎంతమంది చేరుతున్నారు? పక్క రాష్ట్రాలకు ఎంతమంది వెళ్తున్నారు? జాతీయ విద్యాసంస్థల్లో ఎంతమంది సీట్లు పొందుతున్నారు? అనేది స్పష్టత లేకుండా పోయింది. ఇంజనీరింగ్ అడ్మిషన్లను పరిశీలిస్తే ఏటా ఈఏపీసెట్‌లో అర్హత సాధిస్తున్నవారి సంఖ్యకు, బీటెక్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య భారీగా వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ సంవత్సరం ఈఏపీసెట్‌లో 1,95,092 మంది విద్యార్థులు అర్హత సాధించారు. కన్వీనర్ కోటాలో దాదాపు 1.16 లక్షల మంది సీట్లు పొందారు. వీరిలో గరిష్ఠంగా 1.10లక్షల మంది కాలేజీల్లో చేరే అవకాశం కనిపిస్తోంది. మరో 25వేల మంది మేనేజ్‌మెంట్ కోటాలో చేరితే మొత్తంగా 1.35లక్షల మంది బీటెక్‌లో చేరే అవకాశం ఉంది. గత ఐదేళ్ల గణాంకాలు పరిశీలిస్తే పెద్ద సంఖ్యలో విద్యార్థులు బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలు పొందడం లేదని స్పష్టమవుతోంది.

ఆ విద్యార్థుల దారెటు?

ఇంటర్ పూర్తిచేస్తున్న విద్యార్థులకు, ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థులకు మధ్య ఎక్కువ తేడా కనిపిస్తోంది. ఉదాహరణకు ఈ ఏడాది రాష్ట్రంలో 3,74,598 మంది ఇంటర్ పూర్తిచేశారు. వారిలో 1.35 లక్షల మంది బీటెక్‌లో చేరినా, మరో 1.5 లక్షల మంది డిగ్రీలో చేరుతున్నారు. ఏటా మెడిసిన్‌లో 5వేల మంది, అగ్రికల్చర్ కోర్సుల్లో 5వేల మంది, మరో 15వేల మంది ఫార్మసీ కోర్సుల్లో చేరుతుంటారు. మొత్తం కలిపినా 3.06 లక్షల మంది అవుతారు. ఇంటర్ ఉత్తీర్ణులతో పోలిస్తే ఇంకా 63 వేల మంది విద్యార్థులు ఉన్నత విద్య కోర్సుల్లో చేరడం లేదు. రాష్ట్రంలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో సుమారు 8వేల మంది చేరుతున్నారు. ఏటా సుమారు 20 వేల మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్‌కు వెళ్తున్నట్లు గత ప్రభుత్వంలో ఉన్నత విద్యామండలి అధికారులు అంచనా వేశారు. ఇంకా మిగిలిపోతున్న విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారా లేదా వారంతా ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారా అనేది తేలాల్సి ఉంది.

డిగ్రీలో సీట్లన్నీ మిగులు

ఇంజనీరింగ్ ప్రవేశాలు కొంత ఫరవాలేదనిపించినా డిగ్రీ అడ్మిషన్లు మాత్రం దారుణంగా పడిపోతున్నాయి. రాష్ట్రంలో ఉన్న సీట్లకు, అడ్మిషన్లకు సంబంధం లేకుండా పోయింది. ఈ ఏడాది రాష్ట్రంలో 4.47 లక్షల డిగ్రీ సీట్లు అందుబాటులో ఉంటే తొలి విడతలో 1.51 లక్షల మంది విద్యార్థులు సీట్లు పొందారు. వారిలో ఎంతమంది కాలేజీల్లో చేరతారనేది అనుమానంగా మారింది. తాజాగా రెండో విడత కౌన్సెలింగ్ చేపట్టినా అడ్మిషన్లు ఉండే అవకాశం కనిపించడం లేదు. మొత్తంగా చూస్తే ఏటా దాదాపు 3 లక్షల డిగ్రీ సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. మొత్తం సీట్లలో మూడో వంతు మాత్రమే భర్తీ అవుతున్నాయి. ఉన్నత విద్యా మండలి అధికారులు చేసిన పొరపాట్లు, ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారుల ఏకపక్ష వైఖరితో ఈ ఏడాది కూడా డిగ్రీ అడ్మిషన్లు మెరుగుపడలేదు.

బీటెక్ ప్రవేశాల్లో వ్యత్యాసం ఇలా...

సంవత్సరం	ఈఏపీసెట్‌లో అర్హులు	బీటెక్ అడ్మిషన్లు	వ్యత్యాసం
2019	1,33,030	81,987	51,043
2020	1,29,894	92,314	37,580
2021	1,34,217	1,00,887	33,330
2022	1,73,572	1,07,601	65,971
2023	1,71,514	1,19,597	51,917
2024	1,95,092	1,35,000 సుమారుగా	60,092



రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో నాలుగేళ్లుగా చెట్లు, ముళ్ల పొదలు పెరిగి ఈ ప్రాంతమంతా అటవిని తలపించింది. కూటమిప్రభుత్వం చేపట్టిన జంగిల్ క్లియరెన్స్‌తో చెట్లు, ముళ్ల పొదలు తొలగించడంతో ఆ ప్రాంతం ఇప్పుడు కళకళలాడుతోంది. రహదారులు, గతంలో కట్టిన నిర్మాణాలు, వేసిన రోడ్లు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

సీఎస్‌లను పిలవడం.. మాకేం ఆనందం కాదు!

- విచారణకు రాష్ట్రాల తరఫున న్యాయవాదులూ హాజరవట్లేదు
- సీజేఐ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం అసహనం
- ఏపీ సహా 18 రాష్ట్రాల సీఎస్‌లు హాజరు

న్యూఢిల్లీ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను కోర్టుకు పిలవడంలో తమకు ఎలాంటి ఆనందమూ లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. రాష్ట్రాల తరఫున న్యాయవాదులు కూడా విచారణకు హాజరు కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందిన న్యాయాధికారుల పింఛను ప్రయోజనాలకు సంబంధించి రెండో జాతీయ జ్యుడీషియల్ పే కమిషన్(ఎస్ఎన్‌జేపీసీ) సిఫారసులను అమలు చేయాలని కోరుతూ 2015లో అఖిల భారత న్యాయమూర్తుల సంఘం(ఏఐజేఏ) పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆయా రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అఫిడవిట్లు దాఖలు చేయకపోతే తన ఆదేశాలను ఉల్లంఘించినట్టేనని హెచ్చరించినప్పటికీ 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అఫిడవిట్లు దాఖలు చేయలేదు. దీంతో ఆయా రాష్ట్రాల సీఎస్‌లు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు ఈనెల 27న విచారణకు హాజరు కావాలని గత విచారణ సందర్భంగా సుప్రీం ఆదేశించింది. ఆ మేరకు ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌తోపాటు తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర 18 రాష్ట్రాల సీఎస్‌లు మంగళవారం విచారణకు హాజరయ్యారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎస్ఎన్‌జేపీసీ సిఫారసుల అమలుకు సమ్మతిస్తున్నట్లు ఈ సందర్భంగా తమిళనాడు, మేఘాలయ, ఎంపీ, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, కేరళ, ఢిల్లీ అఫిడవిట్లు దాఖలు చేశాయి. ఈ అఫిడవిట్లను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆ రాష్ట్రాలపై విచారణను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఆ రాష్ట్రాల సీఎస్‌లు, ఆర్థిక కార్యదర్శులు ఇక ఈ కేసులో కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. మిగిలిన రాష్ట్రాలూ త్వరితగతిన అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

హైదరాబాద్ చెరువుల కబ్జాల్లో మావాళ్లు!

- ఉమ్మడి కర్నూలు జిల్లాకు హైడ్రా కావాలి
- కబ్జారాయుళ్లకు కాటసాని ప్రిన్సిపాల్: బైరెడ్డి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 27: హైదరాబాద్‌లో చెరువులను కబ్జా చేసిన వారిలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తమవాళ్లు ఉన్నారని టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి జిల్లాకు హైడ్రా లాంటి సంస్థ ఎంతో అవసరమన్నారు. అందుకోసం సీఎంను కలిసి విజ్ఞప్తి చేస్తామని మంగళవారం కర్నూలులో వెల్లడించారు. దేవుడి భూములు, వక్ఫ్ ఆస్తులు, పోరంబోకు స్థలాలు కోట్ల విలువైన స్థలాలను అక్రమించారని వీటిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా విచారణ మొదలైందని తెలిపారు. నగర నడిబొడ్డున ఉన్న వక్కెర వాగులో 11.92 ఎకరాల భూమిని కబ్జాచేసి వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వెంచర్లు వేయించాడన్నారు. కబ్జారాయుళ్లకు ఆయన ప్రిన్సిపాల్‌గా తయారయ్యాడని మండిపడ్డారు. రెవెన్యూ రికార్డులు కూడా మార్చేశారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో కబ్జాకు గురైన వివరాలన్నీ అధికారులకు అందజేసి దేవుడి భూములు, వక్ఫ్‌ఆస్తులు, వంకలు, వాగులు, పోరంబోకులకు సంబంధించిన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విజ్ఞప్తి చేశారు.

త్రీటైర్ నుంచి 6 టైర్ నగరాల్లో..

40% డిజిటల్ చెల్లింపులే!



న్యూఢిల్లీ, ఆగస్టు 27: దేశంలోని త్రీ టైర్ నుంచి 6 టైర్ నగరాల వరకు వినియోగదారుల్లో 40 శాతం మందికిపైగా రోజువారీ చెల్లింపులను డిజిటల్ రూపంలోనే చేస్తున్నారని తాజా సర్వేలో వెల్లడైంది. 45 శాతం మంది రెండు రోజులకోసారి డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల పరిస్థితిని తెలుసుకునేందుకు చేజ్ ఇండియా అనే సంస్థ ఈ సర్వే నిర్వహించింది. దేశంలోని విభిన్న జియోగ్రాఫిక్ జోన్లు కవరయ్యేలా మొత్తం 8 రాష్ట్రాల్లోని 16 జిల్లాల నుంచి 2,240 మందిని సర్వే చేశారు. వీరిలో 1,184 మంది వినియోగదారులు, 1,056 మంది వ్యాపారులు ఉన్నారు. దేశంలోని త్రీటైర్ నుంచి సిక్స్‌టైర్ నగరాల్లో కూడా వినియోగదారులు తరచుగా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారని ఈ సర్వే ద్వారా స్పష్టమైందని నివేదిక పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ చెల్లింపులను స్వీకరించని వ్యాపారుల్లో సగం మందికి అసలు డిజిటల్ చెల్లింపుల గురించే తెలియదని తెలిపింది. కుటుంబసభ్యులకు చేసే లావాదేవీలకు డిజిటల్ చెల్లింపులను వాడుతున్నామని 74 శాతం మంది వినియోగదారులు తెలిపారు. తమ అమ్మకాల్లో 25 శాతం కంటే తక్కువే డిజిటల్ చెల్లింపుల ద్వారా జరుగుతున్నాయని 41 శాతం మంది వ్యాపారులు తెలుపగా, 50 శాతానికిపైగా అమ్మకాలు డిజిటల్ చెల్లింపుల ద్వారానే జరుగుతున్నాయని 15 శాతం మంది వ్యాపారులు చెప్పారు. వ్యాపారుల్లో దాదాపు 46 శాతం మంది అవగాహన లేకపోవడం వల్ల డిజిటల్ చెల్లిపులు స్వీకరించడం లేదు. ప్రతి ముగ్గురు వ్యాపారుల్లో ఒకరు కేవైసీ ప్రక్రియ పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు నివేదిక తెలిపింది.

తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించి.. కేంద్రం నోటిఫికేషన్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, ఆగస్టు 27: తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించి.. 'డ్రగ్స్ అండ్ మ్యాజికల్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) యాక్ట్' (డీఎంఆర్ యాక్ట్)లోని 170వ నిబంధనను తొలగిస్తూ కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు నిలుపుదల ఉత్తర్వులు (స్టే) ఇచ్చింది. తమ ఔషధానికి అద్భుతసామర్థ్యం ఉందంటూ మందుల కంపెనీలు వాణిజ్య ప్రకటనలు ఇవ్వడాన్ని నిషేధిస్తూ పెట్టిన నిబంధన అది. అలాగే, ఆ నిబంధన ప్రకారం.. ఆయుర్వేద, సిద్ధ, యునాని సంస్థలు తమ ఔషధాలకు సంబంధించిన ప్రకటనలు ఇచ్చేముందు సంబంధిత ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అంత కీలకమైన నిబంధనను తొలగిస్తూ ఆయుష్ మంత్రిత్వ శాఖ గత ఏడాది అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ లేఖ రాసింది. ఆ నిబంధన ఎందుకు తొలగించారంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ నిబంధన కింద ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం తన లేఖలో కోరడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కానీ, కేంద్రం సుప్రీం అభ్యంతరాలను పట్టించుకోకుండా.. జూలై 1న ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నోటిఫికేషన్.. ఈ ఏడాది మే 7న తామిచ్చిన ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా ఉందని జస్టిస్ హిమ కోహ్లి, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో తాము ప్రశ్నించిన తర్వాత కూడా.. కేంద్రం తన లేఖను ఉపసంహరించుకోకపోగా, నోటిఫికేషన్ కూడా జారీ చేయడంపై ధర్మాసనం మండిపడింది. తదుపరి ఉత్తర్వులు వెలువరించేంతవరకూ ఆ నోటిఫికేషన్‌పై స్టే విధిస్తున్నట్టు పేర్కొంది.

144, 217 జీవోల రద్దు

గజిట్ ఉత్తర్వులు జారీ.. మత్స్యకారుల హర్షం

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల హక్కులను హరించేలా గత ప్రభుత్వం జారీ చేసిన 144, 217 జీవోలను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ జీవోలను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు గత మంత్రివర్గ సమావేశంలోనే ఇందుకు ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ రెండు జీవోలను రద్దు చేస్తూ ప్రభుత్వం మంగళవారం గజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లాను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి, రాష్ట్రంలోని జలాశయాల్లో పెంచే చేపలను బహిరంగ వేలం వేసేలా జగన్ సర్కార్ ఈ జీవోలు జారీ చేయడంపై, అప్పట్లో మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి, కోర్టులను ఆశ్రయించారు. ప్రభుత్వ ఆధీనంలోని చెరువులపై మత్స్యకార సంఘాలకు హక్కు లేకుండా చేస్తారా అంటూ మండిపడింది. నాడు జగన్ సర్కార్ తెచ్చిన ఈ జీవోలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, 2023-24లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద వివిధ మత్స్య అభివృద్ధి ప్రాజెక్టుల అమలు కోసం రూ.235కోట్లతో మత్స్యశాఖకు పరిపాలన ఆమోదం తెలుపుతూ, ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్టీల్‌ప్లాంటుకు మళ్లీ ఈపీడీసీఎల్ నోటీసు

31వ తేదీలోగా రూ.42 కోట్లు చెల్లించాలని హుకుం

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాలని విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఈపీడీసీఎల్ తాజాగా నోటీసు జారీచేసింది. పూర్తిస్థాయిలో ప్లాంటును నడపకపోవడం వల్ల ఉక్కు కర్మాగారంలో వృథా వాయువులు ఉత్పత్తి కావడం లేదు. అలాగే బొగ్గు కొరత వల్ల థర్మల్ విద్యుత్ ప్లాంటును నడపలేకపోతున్నారు. దాంతో పూర్తిగా ఈపీడీసీఎల్ విద్యుత్తునే ఉపయోగిస్తున్నారు. దాంతో ప్రతి నెలా రూ.90 కోట్ల వరకు బిల్లు వస్తోంది. నిధుల లేమితో ఆ బిల్లును కూడా సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఉద్యోగులకు జీతాలే ఇవ్వడం లేదని, విద్యుత్ బిల్లు చెల్లింపునకు కొంత గడువు ఇవ్వాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై యాజమాన్యం కూడా ప్రత్యేకంగా విద్యుత్ శాఖ మంత్రికి లేఖ రాసింది. అయితే ఈపీడీసీఎల్ అధికారులు మాత్రం కోట్ల రూపాయల్లో బకాయిలు పెడతామంటే కుదరదని, కట్టి తీరాల్సిందేనంటూ ప్రతి వారం వెళ్లి కొంత మొత్తం వసూలు చేసుకుంటున్నారు. జూలై నెలకు సంబంధించి ఇంకా రూ.41.81 కోట్లు చెల్లించాల్సి ఉందని, ఆగస్టు 31వ తేదీలోగా చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తామని నోటీసు ఇచ్చారు.

నేటి నుంచి 'అంగ్రూ' ఎన్నారై కోటా దరఖాస్తుల స్వీకరణ

అమరావతి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్, బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, కోర్సుల(202-25)కు రెండో దశ ఎన్నారై కోటా దరఖాస్తులు ఈ నెల 28 నుంచి స్వీకరించనున్నట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. అంగ్రూ వెబ్‌సైట్‌లో ఉన్న దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన దరఖాస్తులను వర్సిటీకి స్వయంగా లేదా పోస్టు ద్వారా పంపాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సూచించారు.

వచ్చే ఏడాది జూలైలో తానా మహాసభలు

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 24వ మహాసభలను వచ్చే ఏడాది జూలై మొదటి వారంలో డెట్రాయిట్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మహాసభలకు కోఆర్డినేటర్‌గా ఉదయ్ కుమార్ చాపలమడుగు, చైర్మన్‌గా గంగాధర్ నాదెళ్ల నియమితులైనట్లు తానా కార్యదర్శి రాజా కసుకుర్తి పేర్కొన్నారు. 2005, 2015లోనూ డెట్రాయిట్‌లోనే తానా మహాసభలు నిర్వహించారు. ఆ ఆనవాయితీకి కొనసాగింపుగా 2025 మహాసభలను సైతం అక్కడే నిర్వహించాలని నిర్ణయించారు. డెట్రాయిట్ తెలుగు కమ్యూనిటీకి దగ్గరగా ఉండడమే కాకుండా వచ్చిన అతిథులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు బాగుంటుందని శ్రీనివాస్ కోనేరు చైర్మన్‌గా, నరహరి కొడాలి, శ్రీనివాస్ దాసరి సభ్యులుగా ఉన్న కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి.. ఈ నిర్ణయం తీసుకున్నామని రాజా కసుకుర్తి తెలిపారు.



'చంద్రబాబు ఎక్స్.ఎక్స్‌ఓ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీప్రసాద్, ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషా తదితరులు

తెలుగు రాష్ట్రాలు గర్వించదగిన వ్యక్తి చంద్రబాబు

పుస్తకావిష్కరణలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీప్రసాద్

బంజారాహిల్స్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలు గర్వించతగ్గ వ్యక్తి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్ కొనియాడారు. వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానం ఇలా ప్రతి రంగంలోనూ ప్రగతి సాధించేందుకు ఆయన తీవ్రంగా శ్రమించారని, శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. పాత్రికేయుడు రచించిన 'చంద్రబాబు ఎక్స్ పాయింట్ ఎక్స్‌ఓ' పుస్తకాన్ని హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లో మంగళవారం ఏపీ రెరా మాజీ చైర్మన్ డాక్టర్ రామనాథ్ వెలమటి, మదనపల్లె ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషాతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ రచయిత రాజకీయ వివాదాల జోలికి వెళ్లకుండా కేవలం చంద్రబాబు ఆలోచన విధానం, అభివృద్ధి విషయంలో ఆయన విజన్‌ను మాత్రమే ప్రస్తావించడం అభినందించతగ్గ విషయమన్నారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వెలమటి మాట్లాడుతూ భవిష్యత్తులో తలెత్తే ముప్పును ఎలా ఎదుర్కోవాలనే విజన్‌తో పనిచేయడం కేవలం చంద్రబాబునాయుడికే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషా, ఆంధ్ర సరస్వతీ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, నెక్స్‌టెల్ మెటా సీఈఓ మిక్కిలినేని శ్రీకాంత్ తదితరులు ప్రసంగించారు.

'వికసిత్ భారత్'తో భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకోవాలి

జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: 'ప్రధాని మోదీ కలలు కంటున్న వికసిత్ భారత్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానం నుంచి 2029 నాటికి మూడో స్థానం చేరుకోవాలి. ఈ విషయంలో పన్ను చెల్లింపుదారుల సహకారం అవసరం. ఇప్పటివరకు పన్ను చెల్లింపుదారులు, సేవారంగంలో ఉన్నవారు జీఎస్టీ రిటర్న్సు దాఖలు చేసే విషయంలో ముందంజలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం' అని జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ హెచ్చరించారు. తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జీఎస్టీ ఆడిట్ ద్వారా దేశ వ్యాప్తంగా రూ.2,676 కోట్లు పన్నులు ఎగవేసినట్టు గుర్తించగా అందులో రూ.272 కోట్లు రికవరీ చేసినట్టు తెలిపారు. ఎలక్ట్రానిక్ క్రెడిట్ లెడ్జర్ ద్వారా 180 రోజుల్లో పన్ను చెల్లించే విధానం తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లుగా పన్నులు చెల్లించని వారికోసం కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని.. అందులో భాగంగానే వడ్డీ, అపరాధ రుసుం చెల్లింపులో మినహాయింపు ఇచ్చిందన్నారు. జీఎస్టీ ఆడిట్ సబ్ ఆఫీసులు కొత్తగా అనంతపురం, కర్నూలులో ప్రారంభిస్తున్నట్టు కమిషనర్ ప్రకటించారు. తిరుపతి జీఎస్టీ ఆడిట్ జాయింట్ కమిషనర్ అంబి, అసిస్టెంట్ కమిషనర్ మాలతి, జీఎస్టీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

'టచ్'పై అవగాహన కార్యక్రమంతో.. తనపై అఘాయిత్యాన్ని గుర్తించిన బాలిక

పుణెలో పోలీసుల అదుపులో 67 ఏళ్ల వృద్ధుడు

పుణె, ఆగస్టు 27: మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరుగుతోన్న క్రమంలో మహారాష్ట్ర పుణెలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చదువుతోన్న ఓ 10 ఏళ్ల బాలిక ఈ కార్యక్రమం ద్వారా తనపై ఓ 67 ఏళ్ల వృద్ధుడు చేసిన అఘాయిత్యాన్ని గుర్తించి విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లింది. ఉపాధ్యాయులు వెంటనే బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేశారు. వారు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 28 ఆగస్టు 2024



ఆంధ్ర యూనివర్సిటీలో
డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు సంబంధిత స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.
- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ)ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజెడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్ఆర్ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ప్రింట్ మెటీరియల్ కోసం చెల్లించాల్సిన ఫీజు:** సెమిస్టర్‌కు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

రిమైండర్

ఉస్మానియా వర్సిటీలో
ఓడీఎల్ కోర్సులు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఫస్ట్ ఫేజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. బీఏ, బీబీఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని రెగ్యులర్ ప్రోగ్రామ్‌లతో సమానంగా పరిగణిస్తారు. అభ్యర్థులు రెగ్యులర్ కోర్సుతోపాటు ఒక ఓడీఎల్ ప్రోగ్రామ్ చేసుకోవచ్చు.



ఎంబీఏ, ఎంసీఏ: ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ లేదా డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2024/ఏపీ ఐసెట్ 2024/పీజీఆర్ఆర్‌సీడీఈ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ప్రోగ్రామ్ ఫీజు: ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.20,000; ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.15,000

ఎంఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఉర్దూ, హిందీ, సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఏ(హిందీ/ఉర్దూ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత లాంగ్వేజ్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. లేదా సంబంధిత మాధ్యమంలో పదోతరగతి వరకు చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: సైకాలజీకి రూ.10,000; మిగిలిన స్పెషలైజేషన్‌లకు రూ.8,000

ఎంకాం: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: ఏడాదికి రూ.9,000

ఎమ్మెస్సీ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మేథమెటిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్); స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. వీటికి బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అర్హులే.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: మేథమెటిక్స్‌కు రూ.9,000; స్టాటిస్టిక్స్‌కు రూ.8,000

డిగ్రీ: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్)ప్రోగ్రామ్‌లకు రూ.4,000; బీకాం(జనరల్)కు రూ.5,000, బీబీఏకు రూ.8,000

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు రూ.8,000. బయోఇన్ఫర్మాటిక్స్ స్పెషలైజేషన్‌కు ద్వితీయశ్రేణి మార్కులతో బీఎస్సీ/బీఎస్సీ(అగ్రికల్చర్)/ఎమ్మెస్సీ/బీఫార్మసీ/బీవీఎస్సీ/ఎంబీబీఎస్/ బీడీఎస్/బీఏఎంఎస్/బీయూఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులైనవారు అర్హులు. ప్రోగ్రామ్ ఫీజు రూ.32,000. కంప్యూటర్ అప్లికేషన్స్ స్పెషలైజేషన్‌కు ప్రోగ్రామ్ ఫీజు రూ.18,000. డేటా సైన్స్‌కు రూ.20,000. ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌కు రూ.15,000. వేదిక్ ఆస్ట్రాలజీకి రూ.8,000. ఈ స్పెషలైజేషన్‌లన్నింటికీ ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. వేదిక్ ఆస్ట్రాలజీని తెలుగు మాధ్యమంలో చదవాలి.

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: ఇందులో స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. (డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా)(వేదిక్ ఆస్ట్రాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.10,000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి/మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.6,000. ఈ కోర్సుని ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 16 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వెబ్‌సైట్:** www.oucde.net

ట్రిపుల్ఐటీ డీఎంలో ఫ్యాకల్టీ

జాబ్ కార్నర్



కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. అసిస్టెంట్ ప్రొఫెసర్
2. అసిస్టెంట్ ప్రొఫెసర్
3. అసోసియేట్ ప్రొఫెసర్
4. ప్రొఫెసర్

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సైన్సెస్(మేథ్స్)

అర్హత: పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: టీచింగ్ డెమాన్‌స్ట్రేషన్, రీసెర్చ్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: https://iiitk.ac.in/



కోపం వల్ల నష్టం

ముకుందాపురంలో రాజయ్య అనే వడ్రంగి ఉండేవాడు. అతనికి రాము అనే కొడుకు ఉన్నాడు. రాము మంచివాడే కానీ, అతనికి కోపం ఎక్కువ. అయిన దానికి, కాని దానికి తన తండ్రి దగ్గర పనిచేసే నౌకర్ల మీద కోప్పడుతూ ఉండేవాడు తరువాతి రోజుల్లో ఆ వ్యాపారాన్ని దుకాణాన్ని మొత్తం రాముకే అప్పజెప్పాలనే ఆలోచనతో ఉన్న రాజయ్యకు రాము నోటి దురుసు ప్రవర్తన చాలా ఆందోళన కలిగించేది. ఎన్నోసార్లు పనివారు రాము ఉన్నపుడు పనికి రావడం ఇష్టపడకపోవడం గమనించి, రాముకు నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు రాజయ్య. కానీ రాము వినేవాడు కాదు ముందు కోప్పడినా తరువాత వారితో బాగానే మాట్లాడుతున్నాను కదా అనేది రాము వాదన.

ఇక ఒకరోజు రాజయ్య రామును ఒక చెక్క తలుపు వద్దకు తీసుకువెళ్లి, రామూ ఇలా చూడు ఇకపై నీకు కోపం వచ్చినప్పుడల్లా, ఎవరి మీదా అరవకుండా ఈ తలుపుకు ఒక మేకు కొడుతూ ఉండు అని చెప్పి, ఒక సుత్తె కొడుకు చేతిలో పెట్టాడు. సరే నాన్నా అని వెళ్లిపోయాడు రాము. కొన్ని రోజుల తర్వాత తండ్రి కొడుకులు ఇద్దరు ఆ తలుపు వద్దకు వచ్చి చూడగా, అది నిండా మేకులతో ఎంతో అందవిహీనంగా వికారంగా కనబడింది. దాన్ని కొడుక్కి చూపిస్తూ రాజయ్య ఇలా అన్నాడు 'చూసావా ఈ తలుపు లాగే నువ్వు కూడా కోపంతో అరుస్తున్నపుడు వికారంగా కనబడతావు' కాబట్టే కొంచెం కోపం తగ్గించుకో అన్నాడు.

అలాగే నాన్నా అని చెప్పి వెళ్లిపోయాడు రాము. కొన్నాళ్లకు రామును పిలిచి మరలా ఇలా చెప్పాడు రాజయ్య 'నువ్వు ఎవరినైనా తిట్టి, మరలా వారికి క్షమాపణ చెప్పినప్పుడల్లా ఈ తలుపుకు కొట్టి ఉన్న మేకులలో నుంచి ఒక్కో మేకును ఊడదీయి అని చెప్పాడు. అలాగే నాన్నా అన్నాడు రాము. మరికొన్ని రోజుల తరువాత మరలా ఇద్దరూ ఆ తలుపు వద్దకు వచ్చారు. అపుడు రామును చూసి రాజయ్య ఇలా అన్నాడు మేకులన్నీ తొలగించినా కూడా తలుపు మొత్తం చిల్లులు పడి ఎంత అసహ్యంగా అయిపోయిందో చూసావా? అలాగే నువ్వు మొదట తిట్టి తరువాత క్షమాపణ చెబితే వాళ్ల మనసులో బాధ కూడా ఇలాగే ఉండిపోతుంది, పూర్తిగా మాసిపోదు' అన్నాడు ఆ రోజుతో తన తప్పు ఏమిటో అర్థం చేసుకున్న రాము ఆ మర్నాటినుండి అందరితో నెమ్మదిగా స్నేహంగా మసలుకోవడం అలవాటు చేసుకున్నాడు.

7 తేడాలను కనిపెట్టండి




ఎన్ని కుక్కలు ఉన్నాయి?



దారి కనుక్కోండి






డైలీ సుడోకు - 395

			2					6
				3		4		
					6	1	2	8
	2			5		3		1
	5						6	
4		1		9			8	
5	8	6	3					
		7		1				
2					4			

సుడోకు - 394 సమాధానం

1	2	4	8	3	5	7	6	9
3	7	6	4	2	9	1	5	8
9	8	5	6	1	7	4	2	3
7	5	9	1	4	6	3	8	2
2	1	3	9	7	8	5	4	6
4	6	8	2	5	3	9	7	1
5	3	1	7	8	2	6	9	4
6	4	2	5	9	1	8	3	7
8	9	7	3	6	4	2	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



Reliance Foundation Postgraduate Scholarships

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility:
- Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences
- Must have secured 550 to 1,000 in the GATE examination

OR

- Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]
- Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree
Last Date to Apply: 06-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RFS10

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the postgraduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000
Last Date to Apply: 04-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/HDFC54

SCHOLARSHIP ALERT

Adani Gyan Jyoti Scholarship 2024-25

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility:
- Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only.
- Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.
- Applicants must have passed their higher secondary/pre-university/ intermediate/ CBSE/ ISC or equivalent board exams after 2023.
- Admission must be based on the merit rank from state or national-level entrance exams.
- Family income must not exceed INR 4,50,000 per annum from all sources.

Prizes & Rewards: Up to INR 3,50,000 (tuition fee) annually.
Last Date to Apply: 07-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AGSP5

buddy4study.com